# చాటు కవిత్వం

డా.జొన్నలగడ్డ మార్కండేయులు
డా.దూర్వాసుల వేంకట సుబ్బారావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

కౌముది ప్రచురణలు - 116

# విషయ సూచిక


| | | | | |
|---|---|---|---|---|
| 2007 | 7 | తెలుగులో చాటుకవిత్వం | డా జొన్నలగడ్డ మార్కండేయులు (పదునాలుగు భాగాలూ) (2007 07 – 2008 08) | 2 |
| 2009 | 2 | చాటువులు | డా దూర్వాసుల వేంకట సుబ్బారావు (ఆరు భాగాలూ) (2009 2 – 2009 7) | 69 |



# తెలుగులో చాటు కవిత్వం

డా. జొన్నలగడ్డ మార్కండేయులు

(1)

*(తెలుగులో చాటు కవిత్వం ..... అంటే, కేవలం చాటు పద్య సంకలనము మాత్రం కాదు. వాటిని శీర్షీకరించి ఆకర్షణీయంగా నలుగురికీ తెలియజేయాలనే నా ప్రయత్నాన్ని 'కౌముది' పాఠకలోకం ఆదరిస్తుందనే అనుకుంటున్నాను. ముందుగా చాటు కవిత్వం అంటే నిర్వచించుకుందాం)*

చాటు కవిత అనునది కవిచేత అప్పుడప్పుడూ ఆశువుగా చెప్పబడేది. గ్రంథస్థము కానిది. అందు చేత చాటు కవిత ప్రత్యేక ప్రయోజనమాశించి చెప్పబడును అని నిర్ధారించుట కష్టము. రాజుల గురించి, రాజమంత్రుల గురించి, నీతి శృంగార, హాస్యాదివివిధ విషయముల గురించి కవులు గావించిన ప్రసంగములు చాటువులుగా ప్రాచుర్యమునంది పల్లెలోను, పట్టణములలోను, సాహితీపిపాసకులైన ముదుసళ్ళ పలుకుబడులలోనూ తాండవమాడుచు, చెవియొగ్గి వినునప్పుడు విచిత్రానుభూతిని కలిగించక మానవు. ప్రాచీన చాటువులలో చాలా వరకు అవి ఎవరిచే రచింపబడినవో తెలుపుట కష్టం. కొన్ని చాటవులు శైలిని బట్టి, మరికొంత లోక వాడుకను బట్టి కవి ఎవరో ఊహించుటకు వీలు కలిగించాయి.

తెలుగు భాష తీరుతెన్నుల తీయదనము, ప్రౌఢకవుల కవితారీతి, ఒక్కొక చోట ప్రబంధ కవులను మించిన భావనా పటిమ తనలో నిముడ్చుకుని 'చాటుకవిత' మబ్బు మసకేసిన చందమామవలె తెనుగు సాహిత్యమునందు చోటు చేసుకునే ఉందనుట సత్యదూరము కాదు. ఆదరణ లేక శిష్టుల అటకలపై చెదపురుగుల దురాగ్రహానికి బలై ఎన్నో అమూల్య గ్రంధాలు కాలగర్భంలో లీనమైనట్లే చాటు కవిత కూడా ఈ దురవస్థకు లోను కాక తప్పలేదు. నామరూపాలు లేకుండగ పోగా, మిగిలిన చాటవులు ఎట్లో ఆ నోటా ఆ నోటా పడి రూపాంతరము చెందినను బ్రతికి బట్ట కట్ట ప్రయత్నించుటకు వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వంటి పండిత ప్రకాండులు జరిపిన కృషి మెచ్చదగినది.

తెలుగువారి అదృష్టమేమోకానీ పేరెన్నిక గన్న అమూల్య గ్రంథములెన్నియో కాలగర్భంలో రూపుమాసిపోయినవి. అయిననూ ఆ మహాకవుల వాణి ఆ చంద్రార్కమై జనులలో నిలిచి యుండుట వలననో లేక నిజంగానే ఆ గ్రంథములను చూచియుండుటవలననో లక్షణ గ్రంథ కర్తలు వారి వారి పద్యములను ఉదహరించి కనీసం గ్రంథనామములైనా తెలుసుకొనుటకాస్కారము కలిగించారు. సాధారణముగా లోకములో ప్రజలలో ప్రచారములో నున్న ప్రముఖ గ్రంథములలోని పద్యములు లక్షణ కర్తలు గ్రంథస్థము చేసి ఉండాలి. ఈ లక్షణగ్రంథములలో చాటుగా తొంగిచూచుచున్న మధుర కవితావశేషములు పరిశీలించి మరుగుపడిన గ్రంథములు, కవులు కూడా ఒకచోట కూర్చబడినపుడు చాటు కవిత పరమార్థము సిద్ధిస్తుంది. చాటు అనగా తొంగి చూచు అనునది సాధారణ అర్థము. ఉదాహరణ అని కూడా చాటువున కర్థమున్నది.

నీతి శృంగారహాస్యాది వివిధ విషయముల గురించి గానీ లేదా వీటిని మిళితము చేసి తమ ఎడల ఆదరానాదరాలు చూపిన ప్రభువులపైన, ధనాధికుల గురించి, దుష్ప్రభువుల అక్రమపరిపాలనము గురించి, లేక దురాత్మల దుండగపు కార్యక్రమములగురించి కవులు ప్రయోగించిన పద్యరాజములు, అసూయచే సాటి పండితులను హేళన చేయుచు చెప్పబడిన పద్యములు --- చాటుకవితకు ప్రాణము వంటివి.

ఒక సంఘటన కానీ లేక ఒక మహామహుని చరిత్ర కానీ గర్భములో విచిత్ర మార్పులకు లోనై అది నిజమని భ్రమింపచేసి బుద్ధిమంతులను సహితము వాదోపవాదములకు దింపి ప్రచారమైన కథా చాటవులు--- సజీవములై చాటుకవితలో అంతర్భాగములవుతున్నాయి. కష్టసుఖాల జీవన పరిధిలో భక్త్యావేశముతో భగవంతుని గుణగణములు కీర్తించుచునో లేక నిందించుచునో కవులు చాటు కవితలో తొంగి చూడక మానరు. ఏది ఏమైనా చాటవులు సాధారణముగా అల్పాక్షరముల అనల్పార్థాన్ని సాధించి ఆహ్లాదముతో పాటు మనసుకు సూటిగా నాటుకుంటాయి.

## *అధ్యాయం-1*

## *చాటవులు - వివిధవిషయములు*

***లోకనీతి:-***

కూటికోసము కోటివిద్యలు.పాండిత్యము కూడా కూటికోసమే! పాండిత్యమున్న వానికెక్కడైనా జరుగుబాటు ఉంటుంది. సరిఅయిన ఆదరణ లభిస్తే అది ప్రకాశిస్తుంది. లేనినాడది వ్యర్థమవుతుంది. అంతేకాదు పండితుడాశ్రయించునపుడు సరసుడైన వానిని మాత్రమే ఆశ్రయించాలన్నది చాటకవుల చాటు పద్యాలలోనిక్షిప్తమైన లోకనీతి ఎప్పటికీ సజీవమే!

పొట్ట చీరిస్తే అక్షరం.. ముక్క లేదని, అక్షరమ్ముక్క నోట్లో ఉన్న వాడికి ఎక్కడైనా జరుగుబాటుంటుందని అంటుంటాము. అక్షరము లోక రక్షితమని చెప్పుచూ ఈ చాటువు

*అక్షరంబు వలయు కుక్షిజీవనులకు*
*అక్షరంబు జిహ్వ కిక్షురసము*
*అక్షరంబు తన్ను రక్షించుగావున*
*అక్షరంబు లోక రక్షితంబు*

అని అక్షరాస్యత ఆవశ్యకతను తెలియచేసింది.

కేవలము పాండిత్యమున్నంత మాత్రాన సరిపోదు. ఆపాండిత్యం జగత్పూజ్య ప్రతాపోదయశ్రీకి కారణం కావాలి. పండితునకే కాదు, ఎటువంటి గొప్పవారికైనను సరే జగత్పూజ్యప్రతాపోదయశ్రీకి విఘ్నములు కలిగించే ఆరుకారణాలను ఈ క్రింది చాటువు వివరిస్తోంది.

*ఆలస్యంబుని, కామినీ జనరతాత్యాశక్తియున్, జన్మభూ*
*లోలత్వంబును, రోగపుంభయము, దుర్లోభంబు, సంతోషమున్*
*బోలంగానివి యారునెప్పుడు, జగత్పూజ్యప్రతాపోదయ*
*శ్రీలంజెందగ విఘ్నకారణములై చెల్లున్ ధరామండలిన్*

ఎంత పాండిత్యమున్నప్పటికినీ, ఆదరణ లేని చోట గవ్వ విలువ చేయదు. రాజాదరణ పొందిన భటాళి భటత్వము, వైద్యుని వైద్యము, కవికవితామహత్త్వము, గాయకుని గానము మాత్రమే -- కోటి విలువ చేస్తున్నాయి. ప్రతిభావంతమైన యువత నిరాదరణకు గురవుతున్న నేటి పరిస్థితికి కూడా ఈ చాటువు అద్దం పడుతుంది.

*అవనిపుడాదరించిన భటాళి భటత్వము, వైద్యువైద్యమున్*
*కవికవితామహత్త్వమును, గాయకుగానము కోటిసేయున*
*య్యవనిపుడాదరించని భటాళి భటత్వము, వైద్యువైద్యమున్*
*కవి కవితామహత్త్వమును, గాయకుగానముగవ్వసేయున్!*

అయితే నయనానందకరముగా ఉన్నదని-- వివిధద్విజ (పక్షులకు) శ్రేణికి ఆశ్రయము కదాని, - తుమ్మెదలాసతో అశ్వత్థవృక్షము కడకు ఆస్వాదనక్రియకు పుష్పచయంబుకోరి పోయి భంగపడినట్లే - నిర్ధయుడైన సుందరా కారుని వద్దకు పోయి యాచించడమంటే అంతస్సార, నిస్సారతలెరుగని తనమే అవుతుంది. ఎందుకంటే పదిమంది ఒకని నాశ్రయించి బ్రతికేచోట మనము కోరుకున్న జీవితము లభిస్తున్నది పేరాశకావచ్చుననే లోకనీతికి ఉదాహరణ ఈ పద్యచాటువు.

*నయనానందకరంబనిందితము, నానాసద్ద్విజశ్రేణికా*
*శ్రయమశ్వత్థమహీజమంచుళులాసం చెందియాస్వాదనా*
*క్రియకుంబష్పచయంబుగోరి చనుమాడ్కిన్ సుందరాకారు ని*
*ర్ధయునాసింతురుగాకెఱుంగుదురె అంతస్సారనిస్సారతల్*

అలాగే సరసులు కానివారితో కవిత్వప్రసంగములు చేయడమంటే రాతిబొమ్మతో రమించి సౌఖ్యము పొందాలనుకునే శృంగార చేష్టవంటిదవుతుందని ప్రయోజన శూన్యమని ఈ చాటువు

*సరసులు కాని వారియెడ జాలగనిత్వరసప్రసంగముల్*
*కఱపుట కంఠశోషణమెకాక రసనతగూర్పనేర్పునే*
*స్మరశరజాల వేదనకుజాలక భ్రాంతినిరాతిబొమ్మతో*
*మఱిరమింపగాదిపురు మానవుడేమి సుఖింపగల్గెడిన్*

కంఠశోషణము తప్ప ప్రయోజనశూన్యమని హెచ్చరించింది.

అయిననూ సామర్ధ్యమున్న వ్యక్తి ఏ విధముగానైననూ పేరు తెచ్చుకుంటాడు. అటువంటి ఉత్తముని సామీప్యము వలన పాండితీశూన్యులకు కూడా గౌరవము లభిస్తున్నది. ఒకటి పక్కన ఎన్ని సున్నలు పెట్టినా అంకె విలువమారదు కానీ సున్నాలకు విలువ ఉంటోంది. అంకెవిలువ పెరుగుతోందని అనిపించినా ఒకటి తొలిగిస్తే సున్నలకు విలువలేదు. అలాగే ఒక పండితుడి పక్కన శుంఠలు కూడా రాణించి పండితుడి విలువ పెంచుతారు. ఆపండితుడిని విడిచి బయటకు వచ్చిన రోజున ఆ శుంఠలకు విలవ ఉండదనే లోకజ్ఞతకు అద్దంపడుతుంది ఈక్రింద చాటువు.

*ఆఢ్యుడున్నయప్పుడందఱు పూజ్యులే*
*లెక్కమీద సున్న లెక్కినట్లు*
*అతడు పోవు వెనుకనందఱుపూజ్యులే*
*లెక్క లేక సున్నలేగినట్లు*

సున్నకు అంకెతో ఉన్నపుడేవిలువ. అంకెలేని సున్నకు విలువలేదని పండితుడి సరసన, అపండితుడు కూడా శోభించగలడని ఈ చాటువు గంభీరముగా చాటినది.

అందమయిన స్త్రీ చెఱగు మాసి ఉన్నప్పటికిని అలంకరణ మాటున ఈ విషయము మరుగున పడిపోవునట్లు చేయగలదు. అట్లే ప్రతిభావంతునిలోని చిన్న చిన్న లోపాలు, అతని గౌరవానికి భంగం కలిగించవు. చెఱగుమాయడ మంటే స్త్రీ జీవితంలోని ఇబ్బందికరమైన

మూడురోజులు. అలంకరణతో ఆ విషయాన్ని మరుగుపరచి నలుగురి మధ్య ఇబ్బందిలేకుండ ప్రవర్తించి చెఱుగుమాసిన విషయాన్ని స్ఫురింప చేయని పడతి సౌందర్యమువలె ప్రతిభావంతుని ప్రతిభమాటున అతని బలహీనతలు చర్చకు రాకుండా మరుగున పడతాయి.

*సామర్థ్యమున్నవేళల*
*నేమనుజునకేని నిందలెట్లొదవు? కుసుం*
*బామేలిచీరదాల్చిన*
*భామచెఱుగుమాయుగాక బయలంబడునే!*

ఏతము ఎంత క్రిందకి వంగుతుందో అంతపాతాళమునుండీ నీటిని బయటకు తెచ్చి చిమ్ముతుంది. అలాగే చేతనయినవాడు కార్యసాధనకు అణిగిమణిగి ఉన్నట్లు అనిపించినా అల్పుడని భావించ వద్దంటోంది ఈ చాటువు.

*చేతనగువాడు కార్యము*
*కైతగ్గును వంగుగాక యల్పుండగునా?*
*యేతముచడితావంగున*
*బాతాళము నీరు దెచ్చి బయలంజల్లున్*

ప్రతిభావంతుని ఉనికి ఎక్కడున్నా పాతాళములోని నీరులాచిమ్ముకుని బయటకు చీల్చుకుని వస్తుంది.

<u>కవుల స్థితి :-</u>

ఆధునిక సాహిత్య దుస్థితికి దర్పణముపడుతుంది ఈ క్రింది చాటువు. ప్రతివారు కవులమని చెప్పుకునే వారిని తలచుకుని ఉత్తమ కవి పడిన ఆవేదన ఇది.

*దేవునాన మున్ను దేశానకొక్కరుండ*
*నిప్పుడూరనూరనింటనింట*
*వేవురార్వురేడ్వురెనమండ్రు తొమ్మండ్రు*
*పదువురైరి కవులు పద్మనాభ!*

పద్దెనిమిదవ శతాబ్దిలో ఆడిదము సూరకవి రేకపల్లి సోమప్ప కవి (కల్లూరి సోమనాధుడు) మీది వైషమ్యముతో చెప్పినది.

అంతియేగాక కవితా లక్షణమెరుగని వాని వద్ద కవిత్వము వినిపించుట వ్యర్థము. వాడికి కవిత్వము వినిపించుటకంటే హరిదాసు అగుట ఉత్తమమని ఒక కవి వాపోతున్నాడు.

*కవితాలక్షణమెరుగని*
*యవివేకికి బద్యమిచ్చి అడుగుట కంటెన్*
*చవిలెగొని దండెగొనుకుని*
*భువిలో హరిదాసుడైన పుణ్యమె దక్కున్*

తరువాత సన్మానము మాట దేవుడెరుగు. తన పాండిత్య ప్రకర్ష కోసము ప్రతికవిత్వమును విమర్శించుటే పనిగా పెట్టుకునే వాళ్ళను తిట్టచ్చు తప్పులేదు. ఇంత ఘాటుగా తిట్టాడంటే సద్విమర్శ పక్కదారి పట్టి ఉండాలి. చూడండి ఈ క్రింద చాటువు.

*నక్కలు బొక్కలు వెతుకును*
*అక్కరతో నూరుబంది యగడిత వెదుకున్*
*కుక్కలుచెప్పులువెదుకున్*
*తక్కిడినాలంజెకొడుకు తప్పే వెదుకున్*

ఇక ఉత్తముడైన లేఖకుడు, వాచకుడు గురించి తాళపత్ర గ్రంథ రచన చేసిన కవులు ప్రతిని చూసి ప్రతి సమానముగా రాయలేకపోతే అది తమపాలిటి దురదృష్టమవుతుందని భావించారు. నిజమే మరి-- భిన్న భిన్న లేఖక ప్రమాదముల వలననే కదా రామాయణ మాహాభారతాది గ్రంథములుభిన్న ప్రతులుగా లభించి నేటి కాలములో వాదోపవాదముల తరువాత పరిష్కర్తలకు సవాలుగా నిలిచాయి.

*తప్పు గురితించి వ్రాయుటుత్తమమె యగును*
*ప్రతిసమానముగా వ్రాయుటతిముదంబు*
*రెండువిడనాడి వ్రాసెడి లేఖకుండు*
*కలుగుటరయంగ కవియభాగ్యంబగాదె!*

**ఇక వాచకుల గురించి**

*వెనుకకు బోక హుమ్మనక వేసటబొందక బంతి బంతిలో*
*బెనుపకలోపలంగ్రబమసి బెగ్గిలకంతయు మున్నెసూచుచున్*
*గనుకొనునక్షరక్రమముకందుదప్పక యేక చిత్తుడై*
*యనుపమభక్తితో చదువునాతని వాచకుడండ్రుసద్బుధుల్*

# తెలుగులో చాటు కవిత్వం
# డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(2)

***అవివేకి --- పండితుడు:-***

గొప్ప వాళ్ళతో పోలికలున్నంత మాత్రాన కొంతమంది తమను అధికంగా భావించుకుంటారు. అంతటితో సరిపెట్టుకునే వాళ్ళు చాలా అరుదు. తాము అన్ని విధాల పండితుడికన్న అధికులమని ప్రచారము చేసుకుంటూ అంత కంటే అధికులమని తమ అల్పత్వాన్ని బయటపెట్టి పరిహాసపాత్రులవుతారు. దోమ తానన్ని విధాలా ఏనుగుతో సమానమని మురిసిపోయింది. పైగా తనకు రెక్కలొకటి అధికంగా ఉండడం చేత ఏనుగుకన్నా కూడా గొప్పదానివని చెప్పుకుని "హస్తిమశకాంతరము" అని తన అల్పత్వాన్ని బయటపెట్టుకుంది. నోరికొలదీ మహానుభావుని నిందించేవాడు దోమలాంటి అల్పుడని ఈ క్రింది ప్రసిద్ధ చాటు పద్యము చెపుతుంది.

పరగగ నాల్గుపాదములు బాగగుతుండము ఘీంకృతంబు మా
కిరువురకున్ సమంబె మఱియెక్కువ యొక్కటి పక్షయుగ్మఖే
చరుడను నాకు సామ్యమొక సామజమా? యని దోమ పల్కున
ట్లరయ మహానుభావులను నల్పుడు నోరికొలందులాడెడున్.

అదేవిధముగా దురాత్ముడు సుజనున్ని నిందించడాన్ని కొంగ - చంద్రునితో పోల్చుకోవడమువంటిదనే ఈ క్రింది పద్యము చాటు పద్యముగా ప్రచారమైంది. ఆంధ్రభోజడనుకవి రచించిన నీతిభూషణములోని పద్యముగా మడికి సింగన ఈ పద్యాన్ని సకల నీతి సమ్మతములో సంకలనము చేశాడు.

సకల స్థాణుశిరః ప్రవర్తి నురుపక్షద్వంద్వ శౌక్ల్యాభి రం
జకుడన్ సర్వదిగంతగామి నసకృత్సంసేవ్యమానుండనై
ష్టికుడన్ గావున మత్సమానుడగునే శీతాంశుడంచెప్పుడున్
బక మిందుంబ్రహసించురీతి సుజునుంబల్కున్ దురాత్ముండిలన్

***దాత సన్నిధిని చేరే అయోగ్యులు***

దాత చుట్టూ కొంత మంది అయోగ్యులు చేరతారు. అందుచేత దాతను యాచించకుండానే వెనుదిరిగి పోయే పరిస్థితి వస్తోంది.

గంధపు చెట్టు కింద నురగంబు పయోనిధి బాడబాగ్ని మా
కందఫలంబు క్రింద నొక కందురుదుంప జగద్విలోకనా
నందముమేఘు నందుబవినాచినమాడ్కిన కారణంబుగా
నుందురు దాత సన్నిధిన యోగ్యులు కొందరు మల్లిఖార్జునా!

గంధము చెట్టుపాముల కాశ్రయమిచ్చింది. పయోనిధిలో బడబాగ్ని ఉంది. మాకందఫలములో కందురు దుంప ఉంది. మేఘునిలో పిడుగు దాగి ఉంది. ఇలా భయము కలిగిస్తున్న వాటివల్లమంచి ప్రదేశాలను సమీపించడము ఎంత కష్టమో, అకారణముగా అయోగ్యులను చేరదీసే దాతను కూడా యాచకుడు సమీపించడానికి భయపడతాడని మల్లిఖార్జున స్వామిపరంగా విన్నవించి కవి వాపోయాడు.

*అపాత్రదానము*

అకారణంగానే కాదు. యోగ్యులెప్పుడూ అయోగ్యులనే నమ్మి చెడిపోతారు. ఇదొకశాపమో ననిపిస్తుంది. స్త్రీలు నీచునికి సులభముగా వశమవుతారు. రాజులు కాపురుషులను చేరదీస్తుంటారు. మేఘాలు అడవుల్లో అవసరమున్నా లేకపోయినా వర్షిస్తాయి. సత్యసంధుని కన్న అధర్మవర్తనుని దగ్గర ఇందిర చక్కగా కొలువుంటుంది. అవినీతిపరుణ్ణి భూమి ఆయుర్ధాయమిచ్చి భరిస్తోంది.

కరిగమనల్ దురాత్ములనె కాని రమింపరు హీనజాతికా
పురుషులగాని భూభుజులు ప్రోవరు కానలగాని మేఘముల్
కురియవు సత్యశౌచములకుం బెడబాసినవాని గాని యిం
దిర వరియింప దుర్వి యవినీతులగాని భరింపదెంతయున్

యోగ్యులెప్పుడూ అయోగ్యుల కారణంగానే అగౌరవం పాలవుతారనే చక్కటి లోకనీతిని దాచుకున్న చాటు పద్యమిది.

*విధి*

ప్రతివాని జీవితాన్ని ప్రతిబింబిస్తుంది ఈ చాటువు. నారాతింతే అని ఒక్కసారేనా విధిని తిట్టుకోని మానవుడుండేమో కదా! అలా అనుకున్నామోలేదో ఈ చాటువు చదివి చూడండి.

చేతికివచ్చు కార్య మెడచేసితి వర్ధులు శత్రులైరి యిం
కేతిరి నైన గార్యము ఘటించెదనన్న ఘటింపనీవు నీ
చేతగు నట్టిచెయ్దమును జేసితి వింతియగాక యింక నా
వ్రాతొక యింత మార్చగలవా! గ్రహచారము! దుర్విచారమా!

అందుకే కలిమిగలవాడె మనుజుడని, మనను మనము గుర్తించి ప్రవర్తించాలి. అందుచేత కొంత వేదాంత ధోరణి మన ప్రవర్తన కవసరమయింది.

*మనము ---- మనప్రవర్తన*

ఎన్నగలజీవరాశుల
నన్నిటి గర్భమునబుట్టియుటమనుజుండై
తన్నెఱిగి బ్రదుకవలెరా
కొన్నాళ్ళికనెచటనున్న గువ్వల చెన్నా!

మనిషై పుట్టినందుకు పరమార్థముందని ఈ పద్యము హెచ్చరించింది. అయినా కలిమి లేములు శాశ్వతము కాదు. మంచిగా బ్రతకాలి. బేరజము అంటే కుత్సితునికి బుద్ధిచెప్పలేము అని తెలుపుతోంది ఈ క్రింది గువ్వల చెన్నని నీతిపద్యము

సారాసారములెరుగని
బేరజముకు బుద్ధి సెప్ప పెద్దలవశమా!
నీరెంత పోసి పెంచిన
గూరౌనా నేలవేము గువ్వలచెన్నా!

గువ్వలి చెన్నని నీతి పద్యాలు ఇటీవల ముద్రణకు నోచుకున్నాయట!. అయినా ఇవి జనుల నాలుకపైన చాటువులుగానే నాట్యమాడాయి. (అలాగే భైరవనీతి పద్యాలు కూడా సంపాదింపబడాలి.) ధనికుడికిచ్చే విలువ పేదవానికివ్వని మానవ మనస్తత్వము భైరవనీతిగా ఈ క్రింది చాటువులో చూడండి.

కలిగినవాని ఇంట శుభకార్యము గల్గిన కీడుగల్గినన్
బిలువకమున్నె బాంధవులు పెల్లుగబోయి తదంగమంతయున్
దెలుపుచునుందురాతనికి దీనుని ఇంత శుభంబె కల్గినన్
బలమటు బిల్చినప్పటికి బల్కరుగా ఎవరైన భైరవా!

<u>*దుష్ప్రయుక్తములు*</u>

చాటుకవి ఈ చాటువులో దుష్ప్రయుక్తములను వివరించాడు.

తంత్రులు లేని వీణయును తానము, రాగము లేని గీతమున్
మంత్రములేని సంధ్యయును మౌనములేనితపంబు వేదని
ట్తంత్రములేని యాగము బదజ్ఞతలేని కవిత్వతత్వమున్
మంత్రులు లేని రాజ్యము సమానములియ్యవి దుష్ప్రయుక్తముల్!

<u>*పనికిరానివి ---- తగని పనులు*</u>

పెనుమళ్ళ రాఘవుని సంబోధిస్తూ ఒక కవి పనికిరానివాని గురించి చెపితే మరొక చాటుకవి తుంపెర హనుమంతుని సాక్షిగా తగనిపనుల గురించిన హెచ్చరిక చేశాడు. తగనిపను లెలాంటివంటే..

ఎనయగ హీనుదంట జలమింతయు నిల్వని పాడుగుంటనీ
చునకుబదార్థముంట తనుజూచి సహింపని యూరనుంట లే
దనియెడు చేనిపంట వెసనాకటికందని పంటమంటకా
జనకసుతాభిరామ బుధసన్నుత శ్రీపెనుమళ్ళ రాఘువా!

తగని పనులు తలపెట్టడమంటే ఏనుగునెక్కి చిన్నవాకిలి నుండి లోపలికి ప్రవేశించడములాంటిది

కాదనిపించుకోతగదు కాని గుణంబువహించిలోభిచే
లేదనిపించుకోతగదు లేని దురాశకుబోయి ఇందురా
రాదనిపించుకోదగదు రట్టడియై కరినెక్కి దిడ్డిదూ
రేదదియెంత? తుంపెరుపురీ హనుమంత! నితాంతవైభవా!

*పోరానిచోటులు --- కూడని పనులు*

పోరానిచోటులను గురించిన వివరణకన్నా ఆఖరిపాదంలో కవిసంబోధనాంత వృత్యనుప్రాస ఈ పద్యం మనకు గుర్తుండిపోయేలా చేస్తుంది.

పిలువని కూటికిన్, వెతలుబెట్టు ధరాధరుడేలు వీటికిన్
జలములు లేని యేటికిని సారెకు బందుగులున్న చోటికిన్
బలువురతోటి పోటీకి నృపాలురసాటికి బోవరాదయా
బలవదరీ! దరీకుహర భాస్వదరీయదరీదరీ హరీ!

*ఇక కూడని పనుల గురించి*

ఇఱుకరాదు చేతనిసుమంత నిప్పైన
గొఱుకరాదు యినుము కొంచమైన
నఱుకరాదు నీళ్ళు నడిమికి రెండుగా
బెఱుకరాదు బావి పెళ్ళగిలగ

*అష్టకష్టములు*

"చారుతమూర్తి, దేవతా చక్రవర్తి రమ్యగుణధామ కావేటిరంగధామ" అంటూ కవి సరసంగా చెప్పిన అష్టకష్టములు ఒక చక్కటి పద్యమై నిలిచాయి

అరయ పరదేశయాత్ర సేయుటమెండు-------తనకుతానెవండుకొనుట రెండు
కులసతి నెడబాసి తొలగి పోవుటమూడు --------- వెలయంగ యాచకవృత్తి నాల్గు
తనసరివారిబంచను జేరుకొనుటైదు----- గురుతెఱుంగనిరాజు గొల్చుటారు
చదువు నేరకయుండి సభకు పోవుట యేడు----- నెన్న దార్రిద్యంబు నెన్మదవది
అష్టకష్టంబులనియెడు నవ్వియివ్వి------గానఇటువంటివెవ్వరికైనవలదు
చారుతరమూర్తిదేవతా చక్రవర్తి----- రమ్యగుణధామ కావేటిరంగ ధామ

అయితే ఎన్ని కష్టాలు వచ్చినా కుక్క మొరిగిందని ఏనుగు ఆగిపోయి దానిని పట్టించుకోకుండా సాగిపోయినట్లే సాగిపోవాలన్నది భైరవలోకనీతి

పరువుగ్రహింపనేరకొకపాటిదురాత్ముడుమించనాడినన్
సరసులెఱింగి మార్కొనకసైచినయంతట నైచ్యమేలగున్
అరదుగ వచ్చు మార్గమున కడ్డముగానొక కుక్క వచ్చినన్
గఱచిన కోపగించి కరి కర్వగరాదుకదయ్య భైరవా!

*అధికారము*

అధికారము వహించవలసివచ్చినప్పుడు వేల్పులు కూడా ఎవరినీ సంతోషపరిచి పురుషోత్తములనిపించు కోజాలరనేలోక నీతికి దర్పణము పడుతుందీ చాటువు.

అధికారమబ్బినప్పుడు
బుధులు ప్రమోదించి వీడె పురుషోత్తముడం

చధికంబుగ గొనియాడెడు
విధంబున వర్తింపదరమె వేల్పులకైనన్

దైవ వశాత్తులభించిన రాజ్యాధికారమును దుర్వినయోగ పరచు అధికారి ఆ అధికారము కోల్పోయాకా విలువలేకుండా పోతాడు

విధిసంకల్పముచే నొకనాడు తా విశ్వంబు పాలించుచో
బధిరంబెక్కువ చూపుతక్కువ సదాభాషల్‌దురుక్తుల్ మనో
వ్యధతో మత్తతో దుర్వ్యసన దుర్వ్యాపారతం జెందున
య్యధికారాంతమునందు జూడవలదాయాయయ్య సౌభాగ్యముల్

విద్యావంతుడైన వాడుకూడా కాస్తంతసంపాదనపరుడయ్యేసరికి సంస్కారహీనుడవుతూ గర్వపడి పోతున్నపుడు విద్యావిహీనుడు సంస్కారహీనంగా ప్రవర్తిస్తాడని మనము భావించరాదనే చక్కని లోకోక్తి ఈ క్రిందిచాటువు

ఉద్యోగమొదవినప్పుడు
సద్యోగమదమొదవిపూర్వసరసతలుడుగున్
విద్యావంతునకైనను
విద్యావిహీనునకు వేఱె వివరంబేలా!

అందుచేతనే లోకమంతా పిచ్చిపుల్లయ్యలన్ని భావించిన ఆధునిక కవి కీ.శే. పులుగుర్త వెంకటరామారావుగారి ఈ క్రింది చాటువులో లోకనీతిని ఎలా వివరించారో చూడండి..

నాల్గు,ఐాలుగడించినాకేమియనబోకు--- తరతమభావమింతెరిగిబ్రతుకు
బుద్ధిసంపదకేనమొనగాడనబోకు ---- పండితుల్ శృంగభంగంబొనర్తు
వరవిద్యనాయంతవాడులేడనబోకు--- కవులునీయాట సాగంగనీరు
నిక్కుమై నెల్లరనీవునీవనబోకు -- చేటుకాలము చెప్పి - చెప్పిరాదు
ఏమిచూచుకనీకింతతామసంబి--- కేమికలదని నీకు లోనింతకులుకు
తెలివితక్కువ పెద్దమ్మలందునెంత-- యధికతముడవౌవెఱ్ఱిపుల్లయ్య వీవు

# తెలుగులో చాటు కవిత్వం

డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(3)

*__అన్యాపదేశములు__*

ఒకటిని నెపము పెట్టుకుని చెప్పడము అన్యాపదేశము. తమను తాము అధికులుగా భావించుకుని ఇతరులను గడ్డిపోచల కింద జమకట్టే పలుకుబడిగల వ్యక్తులకు లేదా సాటికవులకు చురుక్కుమనిపించి ఉలిక్కిపడి సిగ్గుపడేలా చేయడము కోసము కవులు అన్యాపదేశముగా పోలిక పెట్టి రచించిన చాటుపద్యాలు కోకొల్లలు. అన్యాపదేశ చాటవులు రసభరితంగ సరసయుక్తంగా మనలో అంతర్లీనంగా దాగి ఉన్న అధిక్యతాభావము వల్ల ఎదుటివారి పట్ల ప్రదర్శించిన తేలిక భావానికి నొచ్చుకోనీయకుండా ఉదహరించ తగ్గ పద్యాలుగా మన రసనపై ఎప్పటికీ నాట్యమాడేలా రచింపబడ్డాయి.

*__ఉమ్మెత్తపువ్వు__*

ఉమ్మెత్తపువ్వును ఈశ్వరుడు చంద్రునితో సమానముగా తలపై ధరించినంత మాత్రమున చంద్రునితో సమానముగా వెన్నెలలు కురిపించి ఆనందింప చేయలేదు. గొప్పవారి సరసన చేరి గొప్ప పడడము మంచిదే! కానీ శివుని తలపై చంద్రునితోబాటు గౌరవము పొందినా చంద్రుని ఉదాత్త గుణము ఉమ్మెత్త పువ్వు పొందలేకపోయింది. గొప్ప వారి సరసన చేరి కూడా హీనుడు ఉదాత్త గుణములు పొందలేడు.

*వారక ఈశ్వరుండు తలపై ధరియించిన యంతమాత్రమ*
*వ్వారిజవైరి తోడ సరివత్తువె యుమ్మెతపూవ! నీ పసన్*
*వారిధులబ్బునో దెసలు వన్నెలు దేరునో చంద్రకాంతముల్*
*నీరవునో చకోరముల నెవ్వగదీఱునో తాపమారునో*

*__తిలపిష్టము----కురంగనాభము__*

పడిశము పట్టి వాసనలు గుర్తించలేని పీసనరోగి కస్తూరిని (కురంగనాభము) తెలకపిండితో పోల్చినంత మాత్రమున కురంగనాభ సువాసనలకు లోటురాదు. కురంగనాభ గౌరవస్థానాన్ని తిలపిష్ట మాక్రమించలేదు కదా! వేషాన్నిబట్టి స్థాన విలువ కలగదని ప్రతిభ ఎప్పుడూ పరిమళించు కస్తూరిలా ఉన్నత స్థానాన్ని అర్హులనుంచి అందుకుంటుందని సాహిత్య పోషకులకు ప్రశంసగా అన్యాపదేశమైన చాటువిది.

*పీనసరోగి నిన్ను దిలపిష్ట సమానము చేసినంతనే*
*వాని వివేకహీనతకు వందుఱనేల కురంగనాభమా!*
*మానవతీ కపోలకుచమండల మండిత చిత్రపత్రికా*
*నూనవితాన వాసనలనొందుట లోకము నిన్నెఱుంగదే!*

<u>*కొంగలు---హంస*</u>

ఒకసారి ఒక హంస తన గుంపు నుండీ దారి తప్పి కొంగల గుంపు దగ్గరకు చేరుకుంది. దాని విదేశీయతను గుర్తించిన కొంగలు దానినివాస స్థలమును గురించిన వివరాలడిగాయి. మానస సరోవర ప్రాంతవాసిగా హంస చెప్పిన వివరాలు విని అంతటి గొప్ప ప్రదేశములో నివశిస్తున్న హంస అదృష్టమునకు గౌరవించవలసినది పోయి నత్తలంటే తెలియని నత్తలంటే తెలియని ప్రదేశములో నివిశిస్తున్నావని నవ్వి హేళన చేసాయి. నూతిలోని కప్పలవంటి విజ్ఞానము కలిగిన అవివేకులకు సమాధానము చెప్పలేని పరిస్థితి మధ్య వివేకవంతులకులకు జరిగే అవమానమును సరసంగా వివరించే ఈ పద్యము పద్యప్రియులకు గుర్తుండిపోయేలా రచింపబడినది. కొంగల ప్రశ్నలకు జవాబులు "  " గుర్తుల మధ్య సూచించడము జరిగింది

*ఎవ్వడవీవు, కాళ్ళు మొగమెర్రన?--- "హంసమ" -- ఎందునుందువో?*
*"దవ్వులమానసంబునను"-- దానవిశేషము లేమి దెల్పుమా?*
*"మవ్వపుకాంచనాబ్జములు, మౌక్తికముల్గలవందు"--నత్తలో?*
*"యవ్వియెరుంగ"--మన్న నహహోయనినవ్వె బకంబులన్నియున్*

<u>*కేతికి--*</u> <u>*తేటి*</u>

కొంతమంది వేషభాషలు చూసి భ్రమించి ఆ వ్యక్తిఎదుట పాండిత్యము ప్రదర్శిస్తే సన్మానము చేయరు సరికదా ఆ వ్యక్తి వల్ల శృంగభంగము తప్పదు. పువ్వులన్నిటిలోనూ తేనెనాస్వాదించగల తేటికి కేతకీ కుసుమాన్ని సమీపించే అవకాశము భగవంతుడు నిరాకరించినందుకు బాధపడనక్కరలేదని, కంటక భరితమైన కేతకీ కుసుమ ప్రదేశము వల్ల తనువు వ్రయ్యలుకానందుకు సంతోషించాలని కవి అందరినీ ఆశ్రయించకూడదని చేసిన అన్యాపదేశ హెచ్చరిక ఈ చాటువు.

*అసదృశగంధబంధురమటంచు వడిన్ జనుదెంచికేతకీ*
*ప్రసవమునందుజెంది మకరందము పెందమి గ్రోలలేమికిన్*
*దెసచెడి కుందనేమిటికి తేటి! యరాళకరాళకంటక*
*ప్రసవముచే భవత్తనువు వ్రయ్యకవచ్చినమేలు చాలదే!*

కోరి అవమానము తెచ్చుకోకూడదని హెచ్చరిక. అందని ద్రాక్ష పులుపని సరిపెట్టుకోవాలి తప్ప తీయగా ఉందో లేదని తెలుసుకోవడానికి ప్రయత్నించకూడదు.

<u>*చూతఫలము----కర్కశహృదయులు*</u>

లోక విఖ్యాతమైన సిరిసంపదలతో తులతూగుతూ కూడా ఉపకారహృదయము లేని బండరాతి గుండెమానవులు జనాభా లెక్కలకు పనికి వస్తారు తప్ప, ఆకర్షణీయమైన చూతఫలములోని టెంకవలె, ఊరట కలిగించుటకు సమర్థులు కాలేరు.

*చూతఫలావతంస! నిను జూచిన కన్నులపండువయ్యె!రూ*
*పాతిశయంబునన్ బరిమళాఘ్రాతమౌచు దిశౌఘుమెల్ల వి*
*ఖ్యాతియొనర్చు నీగుణములైనను గల్గదు నాకు నెమ్మదిన్*

*గౌతుకమెప్పు నీ హృదయ కర్కశభావము జూడ చూడగన్*

*సత్పురుషుడు--అల్పుడు*

సత్పురుషుడు సలిలప్రవాహములో చేసే స్నానములా మాటలతో మనస్తాపమును తొలగిస్తాడు. అల్పుడు గండూషతోయములాంటివాడు. ఆ పుక్కిలింత నీటిలాంటి అల్పుని మాటలు ధీరునికి విచారము తొలగించలేవు.

*ధరనత్యుత్తముడైన ధీరుని మనస్తాపంబు దీర్పంగ స*
*త్పురుషానీకమ యోపుగాని యొకయల్పుండోపునే తీవ్రదు*
*స్తరనైదాఘనిదాహతాప మడపన్ ధారాధరాంచద్రసో*
*త్కరధారావళిగాక యర్హమగునే గండూషతోయంబులన్*

*అబద్ధమాడువాడు*

గాడిద కొడుకని తిట్టి గాడిదను అవమానించకండి. అది ఎన్ని తిట్లనైనా సహించగలదుకానీ ఆడిన మాటలు తప్పినవానిని తనకొడుకుగా అంగీకరించదు.

*ఆడిన మాటలు దప్పిన*
*గాడిద కొడుకంచు తిట్టగా విని యయ్యో!*
*వీడా నాకొక కొడుకని*
*గాడిద యేడ్చెంగదన్న ఘనసంపన్నా!*

*దానవిద్యారసికత లేనివాడు*

పర్వతకొండడనేవాడున్నాడో లేదో తెలియదు కానీ పర్వతము, కొండలవలె శరీరాలు పెంచుకుని గడ్డితినే పశువులవలె పొట్టనింపుకోవడమే పరమార్ధముగా బ్రతికే దానవిద్యరసికతలేని పర్వతకొండడు మాత్రము పశువుతో సమానుడు.

అసమానదానవిద్యా
రసికతలేనట్టి నరుని బ్రతుకేటికి?సీ!
కసవేఱుకతిని బ్రదుకదె
పసరము తన కడుపునిండ బర్వతకొండా!

*పండితసంస్కారము*

పండితుల అహంకారము కొందరి విషయములో సంర్ధనీయమయింది. వారు ఒకరినొకరు పక్షులతోనో జంతువులతోనో లేక ఇతర అన్యాపదేశంగానో పోలికలు పెట్టుకుని తమ పాండిత్యమును తక్కువచేసే వారికి సవాలు విసిరేవారు. నాటి కృష్ణరాయల కాలమునుండీ, నేటి జ్ఞానపీఠకవుల వరకు పేరు కెక్కిన పండితులందరూ సాటికవులతో వివాద పడవలసివస్తే అన్యాపదేశంగా అహంకారము చూపుతూ చెప్పిన చాటుపద్యాలు సమర్ధనీయమైనా కాకపోయినా చదువునపుడు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి..

*కుక్కుటము--ఖగేంద్రుడు*

మిడిసిపడు అల్పుని ఆటలు గొప్పవాని ముందు సాగవు. అటువంటి అల్పుని నేలమీద నూకలు తిని క్రొవ్విన కుక్కుటముతో పోల్చి తనను సర్పదర్పమణచగల గరుత్మంతునిగా భావించుకున్న కవి, తాను ఎదురులేనికవినని లోకానికి చాటి చాటు పద్యములో జీవించాడు. ఆంధ్రభోజుడు కృష్ణదేవరాయల కోరికపై పెద్దన కవితా పితామహుడి రచన ఇదని సాహితీ ప్రియుల అభిప్రాయము.

*రంతుల్మానుము కుక్కుటాధమ! దరిద్రక్షుద్రశూద్రాంగణ*
*ప్రాంతోలూఖలమూల తండుల కణగ్రాసంబుచే గ్రొచ్చి దు*
*ర్దాంతాభీల విశేష భీషణ ఫణాంతర్మాంస సంతోషిత*
*స్వాంతుండైన ఖగేంద్రు కట్టెదుర నీజంజాటముల్ సాగునే!*

***వరాహము - ఆదివరాహము***

లోకములో తమ పూర్వీకులను తలచుకుని గొప్పలు చెప్పుకునే వారిని కవి చేసిన పరిహాసము ఈ పద్యము. అలనాడెప్పుడో అది వరాహము భూమి నెత్తిందని పంది చెప్పుకుని తిరగడమెలాంటిదో అల్పుడు తన పూర్వీకుల గురించి చెప్పుకు తిరగడము అలాంటిది. భట్టుమూర్తి కవి చాటువుగా పేరు కెక్కిమంచి అన్యాపదేశ చాటువుగా అల్పులను భుజాలు తడుముకునేలా ప్రచారమైంది.

*తక్కకనేల ముట్టెగొని త్రవ్వగనేర్తునటంచుదాకు తా*
*నొక్కటెజాతియంచు ముదమందకు బుద్ధిని వెళ్ళిపంది! నీ*
*వెక్కడ! అది ఘోణియ ననెక్కడ! య్యదిసముద్రదుర్గభూ*
*ర్భాక్కుతలంబు నొక్క యరపంటనె మింటికి నెత్తనేర్తువే!*

***గార్ధభాపదేశము***

శ్రీనాథుడు కొండవీటిలో దేశాటన చేసినపుడు, ఛందస్సు నేర్చుకున్న అహంకారముతో కేవలము గణబద్ధ రచన చేస్తూ సారవిహీనమైన పద్యాలతో కవులుగా తిరుగుతున్న అల్పజ్ఞానులను సంబోధిస్తూ గార్ధభాపదేశముగా చెప్పిన ఈ చాటువు నేటికాలానికి కూడా సందేశమై నిలుస్తుంది

*బూడిద బుంగవై యొడలు పోడిమిదక్కి మొగంబు వెల్లనై*
*వాడలవాడలం దిరుగుచుండేడువారలు చొచ్చుచోయనన్*
*గోడలగొందులందొదిగి గూయుచునుండెడి కొండవీటిలో*
*గాడిద! నీవునుంగవివికావుకదా! యనుమానమయ్యెడిన్*

***నీటిబొట్టు--ముత్యము***

జంతువుల పోలికలు పెట్టి పరుషంగా సవాలు విసిరితే కోపముతో అవతలి వ్యక్తి మరోపోలికతో పరుషమైన పదజాలముతో చాటువులు చెప్పి తిట్టుకవిత్వవీరులనిపించుకున్నారు. కానీ కొంచెం సంస్కారయుతంగా కూడా ప్రవర్తించాలన్న మందలింపుతో అర్థవంతమైన అన్యాపదేశము కవి సంస్కారాన్ని గుర్తుండిపోయేలా చేస్తుంది. ఎవరికైనా సరే బంధుత్వ కారణంగా ప్రాప్తించిన ఉన్నత స్థానము ఒక అవకాశమే తప్ప శాశ్వతము కాదు. స్థాన విశేష మాత్రముచే కలిగిన ఔన్నత్యము తామరాకు మీద ముత్యములా మెరిసే నీటిబొట్టులాంటిది. అధికార దుర్వినియోగులకు కనువిప్పుగా రాయల అష్టదిగ్గజ కవి తిమ్మన ఈ చాటువును చెప్పాడని ప్రతీతి.

*స్థాన విశేష మాత్రమున తామరపాకున నీటిబొట్టు! నిన్*
*పూనిక మౌక్తికంబనుచు బోల్చినమాత్రన ఇంతగర్వమా?*
*మానవతీ శిరోమణుల మాలికలందున గూర్పవత్తువో*
*గానుక లియ్యవత్తువో! వికాసము నిత్తువొ విల్వదెత్తువో!*

*అల్పుడు --ఉన్నతపీఠము*

పండితులైనవారు ఎంత సంయమనం పాటించినా అల్పకవిది మాత్రం కోతిబుద్ధి. వాడికి తనను అందరూ గౌరవించాలన్న తపనతో ఉత్తమస్థానాన్ని అడ్డదారిలో సంపాదించి కూర్చుని విపరీత చేష్టలు చేసినా, కవులు సహించి ఊరుకున్నారన్న వాస్తవానికి అద్దంపట్టిన చాటువిది. భట్టుమూర్తి, తెనాలి రామలింగకవి శ్రీకృష్ణదేవరాయల కొలువులో లేరు. అయినా అష్ట దిగ్గజ కవులలో వారిద్దరి పేర్లూ లోకము ఒప్పుకుంది. అలా అని రాయలు భట్టు మూర్తికి అర్ధాసనమిచ్చి గౌరవించినందుకు అసూయతో వికటకవి ఈ పద్యము చెప్పాడని భావించడము ఆ మహాకవులిద్దరినీ అవమానించడమే అవుతుంది.

*పండితులైనవారలు సభాస్థలినుండగ నల్పుడొక్కడు*
*ద్దండతపీఠమెక్కిన బుధప్రకరంబులకేమిలోటగున్*
*కొండకకోతి చెట్టుకొనకొమ్మకునెక్కిన గ్రింద మత్తవే*
*దండమహోగ్రసింహములు తాలిమి నుండవె రాజచంద్రమా!*

సింహతలాటములు ధరించి గజారోహణ సత్కారములందుకున్న వారికి కోతియాట వినోదంగానే ఉంటుంది.

*కవుల హృదయ స్పందనలు*

తమ యెడ ఆదరణ చూపినందుకు ప్రశంశ, నిరాదరించినందుకు నింద రూపంలోనూ చెప్పిన పద్యములుగా కవుల హృదయ స్పందనలను అన్యాపదేశములనలేము కానీ అన్యాపదేశ హెచ్చరికలుగా మాత్రము మనము అంగీకరించాలి. దేవలూరి కేశవరెడ్డి అనువ్యక్తి అడిదము సూర కవిని 'కపీశ్వరా!' అని సంబోధించాడు. దానికి కవి

*పీపట్టినట్టునోరను*
*వీపట్టదదేమి నీకు 'పీ--పీ 'లందున్*
*పీపయి రుచిపుట్టెనొ నీ*
*కీపట్టున దేవలూరి కేశవరెడ్డీ!*

అలాగే పూసపాటి సీతారామరాజు తననీ కవి ఏకవచనములో సంబోధించినందుకు కోపపడితే ఈ కవి

*చిన్నప్పుడు రతికేళిక*
*నున్నప్పుడు కవితలోన యుద్ధములోనన్*
*వన్నెసుమీ రాకొట్టుట*
*చెన్నుగ నో పుసపాటి సీతారామా!*

అని తిరిగి ఏకవచనముతోనే పద్యము చెప్పి పోగొట్టాడు. ఒక మంత్రి రాజుగారి భార్యతో అక్రమ సంబంధము కలిగి ఉండేవాడు. ఏకశయ్యాగతుడై రాణితో నిద్రిస్తున్న సమయంలో రాజురాకనుభృంగాపదేశంగా రాణిగారి ఆంతరంగిక చెలికత్తె చేత చెప్పించిన భృంగపంచకము శ్రీనాథుడు రాశాడంటే నమ్మలేము. ఇటువంటి శృంగారపరమైనవి, తమకు జరిగిన అన్యాయాన్ని తెలుపుతూ, అర్జీపద్యాలుగా రాజులకు తెలియచేసిన అడిదమురామ కవి చెఱువు మీది పద్యాలు వంటివి రెండు, మూడు కన్న మించి ఉన్నాయి కాబట్టి ఇటు వంటివి ప్రత్యేక సంఘటనా అన్యాపదేశ రచనా చాటువులుగా సంకలనపరుద్దాము. గ్రంథ విస్తరణ భీతిచే వాటి ఉనికిని మాత్రమే ప్రస్తావించవలసి వచ్చింది. తమ యెడ ఆదరణ చూపిన రాజులను, రాజమంత్రులను చాటుకవులు కీర్తించారు.. నిందించారు ఈ క్రింది చాటువు చూడండి

పద్యము చెప్పిన సుకవికి
హృద్యముగానియ్యనట్టి హీనాత్ముని యా
పద్యము పామైకరుచును
బ్రద్యోదిత కీర్తికాండ! భాస్కరుకొండా!

ఇంతిలా బెదిరించడానికి కారణము కవులు శాపానుగ్రనిగ్రహ సమర్థులని ఒకొక చాటువు ప్రచారములో ఉంది.

*గడియలోపల మూడుకండికలైతాడి - బడగూలదిట్టె మేధావిభట్టు*
*కినిసి యొక్క ముహూర్తమున బ్రహ్మదండి--ముండ్లెల్ల డుల్లగదిట్టె మల్లఘనుడు*
*మూడు నాడికలకు ముట్టడివైచిన--మారనిభీమని మడియదిట్టె*
*నఱజామునకు జెరువంతయు నింకంగ--దిట్టెను బడబాగ్నిభట్టు*
*వాసరత్రయంబునకు జావంగదిట్టె -*
*శ్రీనగముదోచు తుక్కవిశేషమంత్రి*
*తురగహోరకు దిట్టెతిరుమలయ్య*
*పర్యగత దుష్టవర్ణప్రభావములను*

ఈ పై చెప్పబడిన కవులందరూ విషమాక్షర ప్రయోగము ద్వారా పద్యములు చెప్పి శపించారు. వేములవాడ భీమకవి వంటి వరప్రసాదులైన కవులు అమోఘవచస్కులు. వీరి అద్భుత ప్రభావమును గురించిన చాటువులు ప్రత్యేకముగా పరిశీలించేముందు అమోఘవచస్కులైన సత్కవుల జోలికేకాదు కొంత మంది జోలికి వెళ్ళకూడదు. ఖండించ కూడదు. చూడండి ఈ క్రింద చాటువు.

*వండెడువాని సత్కవిని వైద్యుని మంత్రిని దంత్రవాదినిన్*
*గొండెము పల్కువాని రిపుగూడిన వాని ధనేశునిన్ మహీ*
*మండలమేలువాని దనమర్మమెఱింగినవాని నిష్ఠునిన్*
*ఖండితమాడునే నదియు గండమయా శరభాంకలింగమా!*

అద్భుత ప్రభావము కలిగిన కొందరి కవుల చాటువులకు ముందు కొన్ని చమత్కార చాటువులు చూద్దాము

***<u>చాటువులు----చమత్కారము</u>***

నలుగురొకచోట కూడినపుడు సంభాషణ సరసయుక్తముగా సాగుట సహజము. ఆ సంభాషణలో హాస్యము, శృంగారము, ఛలోక్తులు, సామెతలు. ఒకరిపై ఒకరు విసుర్లు-- ఓటు చేసుకుంటాయి. ప్రతిభావంతులైన వారి చమత్కార సంభాషణ సరసయుక్తమై, మరల మరల తెలుగు సాహిత్యములో చమత్కారమును మెరపింపచేస్తూ అనేక చాటువులున్నాయి. ఇతరుల సంభాషణలో ఉదహరింప బడుతుంటాయి.

# తెలుగులో చాటు కవిత్వం
## డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(4)

*చాటువులు ---చమత్కారము*

నలుగురొకచోట కూడినపుడు సంభాషణ సరసయుక్తముగా సాగుట సహజము. ఆ సంభాషణలో హాస్యము, శృంగారము, ఛలోక్తులు, సామెతలు, ఒకరిపై ఒకరు విసుర్లు --చోటు చేసుకుంటాయి. ప్రతిభావంతులైన వారి చమత్కార సంభాషణ సరసయుక్తమై, మరల మరల ఇతరుల సంభాషణలలో చోటుచేసుకుంటాయి. తెలుగు సాహిత్యములో చమత్కారమును మెరపింపచేస్తూ అనేక చాటువులున్నాయి. ఇతరుల సంభాషణలలో ఉదహరింపబడుతుంటాయి.

*బ్రహ్మచారి - మాడలు*

ఈ క్రింది చాటువులో నిర్ధనుడై పెళ్ళికి వెళుతున్న బ్రహ్మచారి, తన వద్ద మాడలు (సొమ్ము) లేకపోయినప్పటికీ నాలుగు వరహాలు ప్రయాణ ఖర్చులకు సరిపెడతానని చెపుతున్నాడు

*ఎక్కడకేగెదోవడుగ? 'యేగెదపెండ్లికి ' మాడలేవిరా?*

*'నిక్కము నాల్గుచేగలవు ' నీకటరాయేవి చూపుమీ?--*

*'యొక్కటి త్రోవలోగనెద, నొక్కటికొక్కరిబూట పెట్టెదన్*

*ఒక్కటి తప్పనెంచెద, మరొక్కటిలేదని కొక్కరించెదన్*

*హరి---సాంబశివుల సంభాషణ*

సాంబశివుడు కైలాసము వదిలి హరిని చూడడానికి వైకుంఠము వచ్చాడు. జ్యేష్ఠాదేవి విష్ణుమూర్తి భార్యగా లోకంలో వాడుక. కానీ ఆమెకు అక్కడ ఉండే తీరిక లేదు. దరిద్ర గృహాలు ఆమెకు నిలయము. చింతపల్లి కరణము యొక్క దరిద్రావస్థను కవి వారిరివురి పలకరింపుల సంభాషణగా చమత్కారముగా వెలుగులోకి తెచ్చి, ఆశ్రయ మిచ్చి ఆదరించే ఒక

దాత వల్ల ఆ కరణానికి సిరిసంపదలు కలిగేలా మేలు చేసిన పద్యముగా చెప్పాడని నాకనిపించిన చాటువిది...

*'హరిహరి ' - యేమి సాంబశివ 'అయ్యభయంపడి పల్కనోడెదన్'--*

*అరమరలేల పల్కు--- 'భవదగ్రపురంధ్రి పెదక్కయేదయా?'--*

*సిరికిని దానికింపడక చీదరయెత్తగ చింతపల్లెలో*

*వరకరణాల ఇండ్లకడ వారక యున్నదయాయుమాపతీ!*

***<u>విటుడు---వేశ్య</u>***

వేశ్యావృత్తి నిషిద్ధము కాని రోజులలో వేశ్యలలో చాలామంది విదుషీమణులుగా పేరుగాంచినట్లు సాహిత్యము మనకు సాక్ష్యము పలుకుతుంది. అపరకృష్ణదేవరాయలని పేరుగాంచిన రఘునాధరాయుని కొలువులోని రంగాజమ్మ అనే ప్రసిద్ధ కవయిత్రి వేశ్యకులమునకు చెందినదే. ఆ సంగతలా ఉంచితే ఏదో కవిత్వము నేర్చుకుని మగతనము చూపిస్తూ ఒక విటుడు విదుషీమణి అయిన ఒక వేశ్య ఇంట్లో వక్కలాకులు వేసుకుంటూ సున్నము తెమ్మని పురమాయిస్తూ ఆమెను చమత్కారముగా పెద్దమ్మా అని సంబోధించి సంబరపడే లోపులోనే కుక్కా సున్నమిదిగో అని వేశ్య నుంచీ వచ్చిన సమాధానానికి ఎలా అవాక్కవుతాడో ఈ క్రింది చాటువులలో చూడండి.

*పర్వత శ్రేష్ఠ పుత్రికాపతి విరోధి*

*యన్న పెండ్లాము నత్తనుగన్న తండ్రి*

*పేర్మి మీరిన ముద్దుల పెద్దబిడ్డ!*

*సున్నమించుక తేగదే సుందరాంగి*

పర్వత శ్రేష్ఠ పుత్రిక (పార్వతి) భర్త శివుడు. శివునికి విరోధి మన్మధుడు. మన్మధుడూ విష్ణువు కుమారుడు కావడం వల్ల బ్రహ్మ మన్మధునికి అన్న. బ్రహ్మ భార్య అయిన సరస్వతికి అత్త అయిన లక్ష్మిని కన్న తండ్రి సముద్రునికి పెద్ద కూతురు పెద్దమ్మ (జేష్ఠాదేవి). అందుచేత దరిద్రపుదానా సున్నముతే అని చమత్కరించాడు. కాని -- ముఖే - ముఖే సరస్వతి. వేశ్య తిరిగి అతనిని కుక్కగా పిలిచి సున్నమిచ్చింది.

*శతపత్రంబులమిత్రుని*

*సుతుజంపినవాని బావ సూతుని మామన్*

*సతతము దాల్చెడునాతని*

*సుతవాహనవైరి సున్నంబిదిగో*

శతపత్రములనగా తామరలు. తామరల మిత్రుడైన సూర్య పుత్రుడు కర్ణున్ని చంపిన అర్జునుని బావ అయిన కృష్ణుని కుమారుడైన మన్మధుని మేనమామ చంద్రున్ని శిరముపై దాల్చు శివుని కుమారుడు వినాయకునికి వాహనము ఎలుక. ఆ

ఎలుకకు శత్రువైన పిల్లికి శత్రువైన కుక్కా సున్నమిదిగో అని వేశ్య జవాబు.

<u>*బాచన్న*</u>

అడిదము సూరకవి కుమారుడు అందముగా ఉండడు. కానీ కాకిపిల్ల కాక్కికి ముద్దు. అందుచేత అతని భార్య, కుమారుడు బాచన్నను చూసుకుని మురియడం అసహజం కాదు. కానీ కొడుకుని అందంగా వర్ణించి పద్యం చెప్పమని అడిగిన భార్యకు మాత్రం కవి అతిశయోక్తులు చెప్పలేదు. తన కుమారుని అనాకారితనాన్ని భార్యతో చమత్కారంగా పంచుకున్నాడు.

*బాచాబూచులలోపల*
*బాచన్నే పెద్ద బూచి పళ్ళున్న తానున్*
*బూచంటే రాత్రి వెఱతురు*
*బాచన్నను చూచి పట్టపగలే వెఱతుర్*

<u>*అశాంతి*</u>

మనసుకు చిరాకుగా ఉండి ప్రశాంతత కోరుకునే సమయములో జరిగే సంఘటనలు ఈ కవికి సంభవించినట్లు మనకు జరగక పోయినా, చిరాకు మనకు అనుభవమే! ఇది హాస్యముగ అనిపించి నా ప్రశాంతతకు భంగము కలిగించేలా ఒకేసారి కష్టాలు కలగకూడదనే సందేశము ఈ చాటవులో ఉంది

*గురువులరాక, దాసిమృతి, గుజ్జుపుదాడియు, వానవెల్లువల్*
*పోరుగున నప్పుబాధ, చెవిపోటును, దొమ్మరులాట, యింటిలో*
*వరసతి గర్భవేదన, వివాహము విత్తున కల్లునల్కయున్*
*కరువు, దరిద్రమాబ్దికముకల్గెనొకప్పుడు కృష్ణభూవరా!*

<u>*నానాటికి తీసి కట్టు నాగం భొట్లూ!*</u>

ఒకప్పుడు మంచి ఉన్నత స్థితిలో ఉండి నానాటికి ఆ స్థితినుంచీ దిగజారిపోయే వారిగురించి పైవిధముగా అంటూండడము పరిపాటి. ఈ నాగంభొట్లు ఎవరో కానీ అగ్రహారాధికారము నుంచి చిరుస్థాయికి దిగిపోయి, లక్షాధికారి స్థాయినుంచీ బీద స్థాయికి దిగిపోతుండే వారికి ఉపమానమై నిలిచాడు. ఇది ఒక కంద పద్య పాదము చదవండి..

*ఏనాటి అగ్రహారమొ*
*మీనాటికి కండ్రికాయెమీపనిదీరన్*
*మానాడు మాన్యమాయెను*
*నానాటికి తీసికట్టు నాగంబొట్లూ*

*చమత్కార జవాబు*

నియమబద్ధమైన పద్యకవితకు ఎంతో ప్రతిభ కావాలి. చాటుకవి కొన్ని ప్రశ్నలడుగుతున్నాడు ఒక సీసపద్యంలోని ప్రతిపాదంలోనూ. జవాబు తేలికే. కాని చమత్కారమేమిటంటే ఇచ్చిన జవాబు "వికటకవి" పదంలా ఎటునుంచి చదివినా పదం మారకూడదు. చాటు పద్యము, బ్రాకెట్లో జవాబు ఈ క్రింది చాటువు

*రాముడెవ్వానితో రావణు మర్ధించె* ----------(తోకమూకతో)

*వరవాసుదేవుని పట్టణమేది*--(రంగనగరం)

*రాజమన్నారుచే రంజిలుశరమేది*-------- (లకోలకోల)

*వెలయగానుక పంటనిత్తువేది* -----(జంబీరబీజం)

*అలరంభ కొప్పులో అలరుపూదండేది*--------- (మందారదామం)

*సభవారినవ్వింపజాణడెవడు* -------(వికటకవి)

*సీతపెండ్లికినోలిచేసినవిల్లేది*----- (పంచాస్యచాపం)

*శ్రీకృష్ణుడేయింట చెలగుచుండు* --(నందనందనం)

*అన్నిటికిచూడనైదేసియక్షరములు*

*ఈవలావలచూచిన నేకవిధము*

*చదువునాతడు భావజ్ఞచక్రవర్తి*

*లక్షణోపేంద్ర ప్రౌఢరాయక్షితీంద్ర*

*అక్క--చెల్లెలు*

బావ, మరదళ్ళ సరసము సాధారణంగా మాటలవరకే పరిమితము. ముఖ్యంగా అక్కను ఆటపట్టించడానికి చెల్లెలు అబద్దం చెప్పిందో లేక సరసము శృతిమించిందో చెప్పలేము. ఈ క్రింది చాటువులో ఏదో కారణము చేత భర్త గదిలోకి వెళ్ళడానికి అవకాశములేని ఓ ఇల్లాలు చెల్లెలిని బావేం చేస్తున్నాడో చూసి రమ్మని పంపింది. బావగదిలోకి వెళ్ళి తిరిగి వచ్చాక చెల్లెలు నిజం చెప్పిందా? లేక అక్కను ఆటపట్టిస్తోందా? అన్నది మరదళ్ళున్న బావలే ఆలోచించి చెప్పాలి.

*"అక్కరో! నీదువల్లభుడహంకృతి చేసిన చేతవింటివా?"*

*యెక్కడనెక్కడే మరియునెవ్వరి నెవ్వరి? "నన్నెనన్నె!"నీ*

*వక్కడికేలపోవలయు? "నంపవ" యంపతి కూడుమంటినా?*

*"మొక్కితి, వేడుకుంటి, ననుముట్టకుమంటిని కేమి చేసెదన్"*

<u>*సరదాతిట్లు*</u>

బూతాడని నరుడుండడని మనకు తెలుసు. చాలామందికి బూతు ఊతపదంగా వచ్చేస్తుంటుంది. మరికవులు ఈ విషయంలో తక్కువవారు కాదు. బుక్కపట్నం తిరుమల తాతాచార్యులు బూతు పద్యాలు బాగా చెప్పేవాడట. ఈ క్రింది చాటువులలో వినకూడని బూతులేదుకాని సరదాగా తిట్టినట్టనిపిస్తున్నాయి. మతుకు మల్లిశాస్త్రులను నస్యమడిగి లేదన్నాడని ఈ విధంగా పద్యం చెప్పాడు

*శాస్త్రుల్లట ఈ నీచుడు*

*పాస్త్రాత్తుల మగడు వీనిపరువేమోకా*

*కాస్తంత నస్యమడిగిన*

*నాస్తేయని పలుకు వీనినాలుక పీక*

ఆచార్యులు కదా వైద్యంవచ్చు. అచ్చన్న అనేవాడు వైద్యం చేయించుకుని పైకమిస్తానని ఇవ్వలేదు. వైద్యకట్నం ఇవ్వకపోతే ఇలా తిట్టిన తిట్టు తప్పక అచ్చన్నలో పరివర్తన తెచ్చింది కనుకనే ఈ చాటుపద్యము ప్రచారము ప్రచారములో కొచ్చి ఉండాలి.

*పచ్చడము దుప్పటాయెను*

*విచ్చలవిడి తులసి ప్రతి విడియంబాయెన్*

*అచ్చలనగుబాటాయెను*

*అచ్చన్నా! నీదుకీర్తి ఇట్టిట్టాయెన్*

ఇలా తరగని గనిలో దొరికేమణులవలె చాటుపద్య మణులు నచ్చిన విభాగంగా యేర్చికూర్చుకుని సేకరించడం ప్రారంభించగలిగితే నా శీర్షీకరణ ప్రయోజనము నెరవేరుతుందని నేను భావించడము పేరాశకాదని అనుకుంటున్నాను. ఇప్పుడు మహాకవుల గురించి కల్పనా చాటువులను రెండో అధ్యాయంలో శీర్షీకరించడానికి ప్రయత్నిస్తాను.

# తెలుగులో చాటు కవిత్వం
## డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(5)

<u>చాటువులు--- కల్పనలు</u>

ఏ భాష సాహిత్య చరిత్ర చూసినా కవిత్వము చెప్పి మెప్పించిన కవులపట్ల ప్రజలు చూపిన ఆరాధనా భావము సువర్ణాక్షర లిఖితమై కనిపిస్తుంది. అసలు వ్యక్తి ఆరాధన అన్నది కవులనుంచే ప్రజలకందిందంటే అతిశయోక్తి కాదు. కవిత్వమనునది భగవద్దత్తమని, కవులు శాపానుగ్రహ నిగ్రహశక్తులతో విరాజిల్లుతారని, విద్యావంతులుకూడా ప్రచారము చేశారు. ముఖ్యంగా కవులు కవిత్వము ద్వారా విషమాక్షర ప్రయోగము చేసి శత్రువులను, అమృతాక్షరప్రయోగము చేసి మిత్రులను లొంగదీసుకోగలరని నమ్మేవారు. కవిత్వము నేర్చుకుంటే తెలియకుండానే విషమాక్షర ప్రయోగము జరిగి ఇతరుల ప్రాణాలకేకాదు -- తమకు తామే హాని చేసుకుంటారన్న నమ్మకము కూడా బలీయంగ వ్యాపించి ప్రజ్ఞ కలిగినవారు కూడా కవిత్వరసాస్వాదన కిచ్చిన ప్రాముఖ్యము కవిత్వ రచన చేయడానికి వచ్చేవారు కాదు. ఆంధ్రా యూనివర్శిటీకి ఉపాధ్యక్షులుగా పనిచేసిన కట్టమంచి రామలింగారెడ్డి గారు కవిత్వమనగా మరణ యోగములలో ఒకటి అని భావించారు. ఎందుకంటే రామలింగా రెడ్డిగారి తండ్రిగారు కట్టమంచి వారిని మంచి కవి అని మెచ్చుకుంటూనే ఏదో ఒక రోజున కవిత్వములో విషగణములు పడిన కారణంగా ఎవరికేనా చేటు తెస్తారేమోనని భయపడుతూండేవారని చెప్పుకున్న విషయాన్ని మధునాపంతుల వారు తన ఆంధ్ర రచయితలలో ఆ మహారచయిత గురించిన వ్యాసములో గ్రంథస్థము చేశారు.

శరీరము వాయు, అగ్ని, భూమి, నీరు, ఆకాశము అనే పంచభూతాలు కలిగి ఉంటుంది. అందుచేత ఆ శరీరములోని నోటి ద్వారా ఉచ్చరించే అక్షరాలు కూడా వాయు, అగ్ని, భూ, ఉదక, ఆకాశ బీజాక్షరాలవుతున్నాయని వర్గీకరించారు. గ్రంథాదిని ఏ బీజాక్షరాలు ఉంచి రచన చేస్తే ఏఏ ఫలితాలు కృతి భర్తకు కలుగుతాయో భీమన ఛందము ఉదహరించిన పద్యము ఈక్రిందది.

క్షితిబీజంబులు సంపదల్వొదల పోషించున్ పయోబీజము  
ల్పతతంబున్ ప్రమదంబొనర్చు శిఖిబీజంబుల్ మృతింజేయు మా  
రుతబీజంబున్ ప్రమదంబొనర్చు శిఖిబీజంబుల్  
రుతబీజంబులు శోక వార్ధిబడగా ద్రోయున్న భోబీజముల్  
పతినత్యంత దరిద్రుచేయు మిగులంపద్యాదినొందించినన్

కృతాదిపద్యము భూమి బీజాక్షరమైతే సంపదలు, ఉదక బీజాక్షరమైతే సంతోషము, అగ్ని మరణము, వాయుదుఃఖము, ఆకాశ బీజాక్షరములు దర్రిదము కలగజేస్తాయని భీమన ఛందము చెప్పింది. అమృతాక్షర, విషమాక్షరాలు ఈ పంచభూతాక్షరాలలోనివే. వీటి వివరణ ఛందోగ్రంథాలలో ఉన్నాయి. అమృతాక్షర ప్రయోగాన్ని అలా ఉంచితే విషమాక్షర ప్రభావము గురించి ప్రసిద్ధమైన భీమన చాటు ధార ఉదహరించ తగ్గది. పద్యము మొదటినుండీ 'ఆరవ' దగుచోట 'త'కారము నిలిపితే బాణము గుండెలో గ్రుచ్చుకొన్నట్లు గ్రుచ్చుకొని మరణం కలిగిస్తుందన్న భీమన ఛందములోని ఈ పద్యము ప్రసిద్ధికెక్కింది.

సాగిపోతరాజు అనేవాడు గుడిమెట్టకు ప్రభువు. ఈ రోజుల్లో మంచి మోటారు సైకిలులాగ ఆ రోజుల్లో మంచి గుఱ్ఱము ప్రయాణ సాధనముగా కలవాడు. అందరికీ అసూయ కలిగించేవాడు. భీమనకవి గుఱ్ఱాన్ని సాగిపోతరాజు రాజునన్న గర్వము చేత బలవంతముగా లాక్కుని పరిహాసము చేశాడు. పోతరాజు తమ్ముడు బ్రాహ్మణ సొమ్మునాశించవద్దని హితవు చెప్పాడు. వినలేదు. అందుచేత పోతరాజు రావణుడయ్యాడు. భీమనరాముడయ్యాడు. గుఱ్ఱాన్ని సీతతోను, గుడిమెట్టను లంకగాను, లచ్చన్నను విభీషణునిగాను పోల్చి ఆరవచోట తకారము నిలిపి పోతరాజును చావతిట్టిన కవి పద్యమీ క్రిందది.

హయమది సీత పోతవసుధాధిపుడారయ రావణుండుని
శ్చయముగ నేను రాఘవుడ సయ్యుజ వారిధి మారుడంజనాప్రి
యతనయుండు లచ్చన విభీషణు డాగుడి మెట్టలంక నా
జయమును పోతరక్కసుని చావును నేడవనాడు చూడుడీ!

<u>శ్రీకారము</u>

కావ్యరచనలో ఈ విషమాక్షరపొరపాట్లు దొరలితే ఏమౌతుందో అనే అనే భయాన్ని తొలగించడానికి కావ్యాన్ని శ్రీకారంతో ప్రారంభిస్తారు. పరుసవేదిని తాకిన ఇనుము బంగారమగునట్లు శ్రీకారము సమస్త దోషాలను తొలిగిస్తుంది

శ్రీకారముకృత్యాదిని
ప్రాకటముగనున్న చాలు బహుదోషములం
పోకార్చి శుభములొసగును
ప్రాకృతముగ నినుముసోకు పరుసము భంగిన్

ప్రాచీన గ్రంధరాజములన్నీ శ్రీకారముతోనే ఉంటాయి.

వాల్మీకి చండాలుడని, కాళిదాసు గొల్లవాడని లోకమున నాటుకున్న కథలు -- క్రీ:పూ '56' నున్న కాళిదాసుకు -- క్రీ.శ '730' ప్రాంతమునున్న భవభూతికి సమకాలిక సహవాసిత్వము కల్పించిన కథలు, సాహిత్య చరిత్రనధ్యయనము చేసేవారు ఒప్పుకోకపోయినా, కల్పనా జగత్తుకు ఊపిరిగా నిజమని భ్రమకలిగిస్తూ ప్రచారములో ఉన్నాయి. తెలుగు కవుల విషయంలో కూడా ఇటువంటి కల్పనలు కల్పించడంలో తెలుగువారేమీ తీసిపోరని చాటువులు నిరూపించాయి.

ఒక సంఘటన కాని, ఒక మహాకవి చరిత్రకాని లేదా ఆ మహా కవికి గల అతీతశక్తులను గురించి కాని - ఇటువంటివన్నీ కాలగర్భములో విచిత్రమైన మార్పులకులోనై, బుద్ధిమంతులను సహితము వాదోపవాదములకు దించుతాయనడానికి సాక్ష్యమైన చాటుధారలు కోకొల్లలు.. ముందుగా కవులకు గల అతీతశక్తులు లేదా ప్రభావముల గురించి వివరించుకుందాము.

<u>కవుల ప్రభావము</u>

సాధారణముగా కవులు శారదోపాసకులు, భగవత్కృపాపాత్రులు అయిఉంటారని లోకము నమ్ముతుంది. ఈ కారణము చేతవారు శాపానుగ్రహ నిగ్రహ సమర్థులుగానో, అద్భుత ప్రభావ సంపన్నులుగానో చాటు పద్యాలలో నిక్షిప్తమయ్యారు. శాపానుగ్రహ నిగ్రహమున్న

వారిలో ముఖ్యంగా శాపమిచ్చేవారు తిట్టుకవులుగా ప్రసిద్ధి కెక్కారు. 1967 లో సాహిత్య అకాడమీ వారు బహుమతినందిన రావూరి దొరసామిశర్మ రచించిన ' తెలుగులో తిట్టుకవిత్వము' గ్రంధములో తిట్టుకవుల వివరాలు విపులంగా దొరుకుతాయి. తిట్టుకవులు అద్భుతప్రభావసంపన్నులు. వారు అమోఘవచస్కులు. ఈ తిట్టుకవుల ఘనతను గురించి ఈ క్రింది చాటువు తెలుపుతుంది.

గడియలోపల మూడుకంఢికలై తాడిబడగూల తిట్టె మేధావిభట్టు.

కినిసియొక్క ముహూర్తమున బ్రహ్మదండిముండ్లెల్లడుల్లగదిట్ట మల్లఘునుడు

మూడు నాడికలకు ముట్టడివైచిన మారనిభీమన మడియదిట్టె

నజాామునకుచెఱువంతయునింకంగ దిట్టెను బడబాగ్నిభట్టు.

వాసరత్రయంబునకు చావంగతిట్టె

శ్రీవగముతోచు తుక్క విశేషమంత్రి

తురగచోరకు తిట్టెతిరుమలయ్య----పర్యగతను దుష్టవర్ణప్రభావములను

ఈ చాటుపద్యములో పేర్కొనబడిన కవులందరూ విషమాక్షర ప్రయోగము చేసి శాపమిచ్చారు. భీమనకవిలా వీరు నిలుపకూడని చోట ఆయా అక్షరములు నిలిపి శాపమిచ్చారు. ఆశించిన ప్రయోజనము పొందారన్నది కల్పనో, నిజమో నిర్ధారించలేము కాని ఈ చెప్పబడిన చాటువులోని కవులు, ఇతర కవులు విషమాక్షర ప్రయోగముతో సాధించుకున్న ప్రయోజన మేమిటో అప్పకవివంటిలాక్షణికులు గ్రంథస్థము చేశారు.

మేధావిభట్టు:-

తకారము ఆరవ అక్షరముగా ప్రయోగించి పద్యము చెపితే సద్యోమృత్యుప్రదమని భీమనఛందములోని చాటుధారను లాక్షణికులంగీకరించినట్లుగా భావించవచ్చు. ఈ క్రిందిచాటువులో మేధావిభట్టు దూరమునుంచీ తనకెదురుగా వస్తున్న సాళువ పెదతిమ్మభూపతిమీద పద్యము చెప్పదలచి చేతిలో గంటమున్నా తాళపత్రము లేదనితకారము ఆరవచోట ప్రయోగించి తాటిచెట్టును నేలకూల్చాడు

సాళువపెదతిమ్మమహీ

పాలవరుడువీడెవచ్చె, పద్యమ్మువ్రాయన్

కేలనులేదాకొకటియు

తాళమ! ముత్తినియలగుచు ధరపైపడుమా!

ఇలాగేప్రౌఢకవిమల్లన '3' వ అక్షరముగా 'అ' కారము ప్రయోగించి బ్రహ్మదండిముండ్లు రాలగొట్టెను. రంగరాజులింగయకూడా '3'వ అక్షరము తిట్టుకవిత్వానికుపయోగించుకున్నాడు. ఎడవల్లిపర్వతన్న'5'వ అక్షరములో 'హ'కారము నిలిపి తిట్టాడు. ఈ కవుల చాటువుల శాపానుగ్రహశక్తిని లాక్షణికులు ప్రామాణికముగా గ్రహించి తమ గ్రంధములలో ఉదహరించారు. అదేవిధంగా

**బడబానలభట్టు:-**

'7'వ అక్షరముగా 'ట' కరము నిలిపి చెఱువులో పడిపోయిన ఉంగరాన్ని తీసుకోవడానికి చెఱువునే ఎండగట్టాడనే కథనం కూడా చాటుకవుల ప్రభావానికి నిదర్శనంగా ఉంది.

బడబానలభట్టారకు

కుడిచేయుంగరము రవికిగొబ్బున్నర్ఘ్యం

బిడువేళనూడినీలో

బడియెం దటాకంబ! నీటిబాయము వేగన్

<u>తెనాలిరామలింగడు:-</u>

కవులలో రామలింగనిది ఎప్పుడూ ప్రత్యేకస్థానమే! ఈయన ఏకంగా '5'వచోట 'క' అక్షరము -- '7'వచోట 'ట' అక్షరము నిలిపి తిట్టిన చాటువును అప్పకవి ఉదాహరించాడు. రాయల వెంట మన వికట కవి వినోదము కలిగించడానికి వెళ్ళాడు. బసవరాజు కుమారుడైన గోవిందరాజులు--రాయలతో కయ్యానికి కాలుదువ్వాడు. అది చూచి విషమాక్షర ప్రయోగంగా ఈ క్రింది పద్యము చెప్పాడు.

బసవనకుపుట్టినపుడె
పసరము గోచిందరాజుపసరంబైతే
కసవేటికి దినడనగా
కసవుందిను శత్రులాజిగదిసిన వేళన్

ఈ తిట్టుపద్యము మహిమవలన గోవిందరాజులు పూరిని నోటకరచుకుని ఓటమిని ఒప్పుకొనెను.

తిట్టు కవుల కారణంగా విషమాక్షర ప్రయోగసరళి ప్రచారంలోకి వచ్చింది. అంతమాత్రమున కావ్యములలో ప్రతిపద్యంలోనూ విషమాక్షర ప్రయోగమును వెదికి పరిశోధన చేయమనడము లాక్షణికుల ఉద్దేశము కాదు. కవులు అమోఘవచస్కులన్నది కాదనరాని నిజము. అటువంటి అమోఘవచస్కుల గురించి తెలుసుకునే ముందు మరొకసంగతి విషమాక్షరప్రయోగభయముతో కావ్య రచన మాత్రము పద్యకవులు మానలేదు. చూడండి ఈ పద్యము

అదిపద్యాది శ్రీకారమైనదేవ
వాచకంబైనప్పుడు వఱలు సిరులు
నాదిపద్యాది మూడు గణాక్షరములు
చూడవలెగాని యన్నియు చూడవలదు

గ్రంథారంభములో తొలిమూడు గణముల అక్షరములు శ్రీకారముతోగాని, దేవతావాచకము గానీ కలిగి ఉంటే చాలు. గ్రంధమంతా ప్రతిపద్యము దోషరహితమై కావ్యము శుభప్రదమై సంపదలిస్తుంది. ఇక అమోఘవచస్కులను గురించి తెలుసుకుందాం!

# తెలుగులో చాటు కవిత్వం
## డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(6)

**అమోఘ వచస్కులు**

విషమాక్షరప్రయోగ మవసరము లేకుండానే శపించుటకు, దీవించుటకు సమర్థులై శాపానుగ్రహులుగా ప్రచారమైన కవుల గురించిన చాటువులు కూడా లెక్కకు మించి ఉన్నాయి. ఇవి కల్పితములే కావచ్చు. వాదనకు నిలబడలేకపోవచ్చు. కానీ చాటు పద్యములనాశ్రయించి లోకంలో కథలుగా ప్రచారమై, కవుల కాలనిర్ణయంలో ప్రాముఖ్యము వహించి మహాకవులకు కీర్తిని, అపకీర్తిని కూడా తెచ్చిపెట్టాయి. కవుల చరిత్ర రాయడానికి పూనుకున్నవారి వాదోపవాదాలకు ఊపిరి పోసాయి.

**అథర్వణ పండితుడు---నన్నయ**

ఆదికవి నన్నయ కన్నా ముందే మహాభారతము రచించిన గొప్ప కవిగా అథర్వణ పండితుని పేరు లోకంలో ప్రచారంలో ఉంది. కానీ ఆదికవిగా మహాభారత నిర్మాణము చేసిన నన్నయ సరసన చేర్చదగినంత కూర్పుగల అథర్వణ పండితుని భారత ప్రతి లభించలేదు. లాక్షిణికుల ఉదాహరణలలో మాత్రమే నిలచిన ఈ అథర్వుని భారత పద్యాలు చదివి - నన్నయ - తన కవిత్వము కన్నా అధర్వుని కవిత్వము మిన్నయని అసూయ చెంది, పలుకుబడి కలిగిన, రాజాస్థాన కవి కాబట్టి అధర్వణ భారతాన్ని అణచి వేసి అధర్వుని కోపానికి గురై , అమోఘ శాపము వల్ల దుర్మరణము పాలయ్యాడని నమ్మదగని ఒక కథ ప్రచారంలో ఉంది. నన్నయ భార్య, అధర్వుని భార్య నీ లాటి రేవులో కలుసుకున్నారు. ముచ్చటలు ప్రారంభించారు. నన్నయ భార్య తన భర్త రచిస్తున్న మహాభారతాన్ని గురించి గొప్పగా చెప్పి భీష్మాది కురువీరులు చేసిన పదినెనుమిది దినాల కురుక్షేత్ర యుద్ధ దినాల సంఖ్యను గురించిన 'పది దినంబులు భీష్ముడాహవ భారకుండా గురుండు పంచదినంబులు----' అనే తరళ పద్యమును భారతము నుండి ఎన్నుకుని చదివి, భర్త శైలి గురించి గర్వ పడింది.. అందుకు అధర్వుని భార్య "ఇంత చిన్న విషయానికి పెద్ద పద్యమవసరంలేదని తన భర్త ప్రతిభావంతుడని, ఒక్క చిన్న కంద పద్యములోనే ఆ విషయాన్ని చెప్పాడని" అధర్వణ భారతములోని ఈ క్రింది పద్యము చెప్పినట్లుగా చాటువుగా ప్రసిద్ధి కెక్కింది. కూచిమంచి తిమ్మన, లింగమ గుంటతిమ్మన, వెల్లంకి తాతంభట్టు, అప్పకవి, కస్తూరి రంగ కవి మొదలైన లాక్షణికులు అధర్వుణుడు

భారత రచన చేసినట్లుగా పేర్కొన్నారు. అయితే నన్నయ భారతంలో కూడా "పది దినము లైదు---" అన్న ఈ చాటు పద్యము కూడా నన్నయ రచనగానే చేర్చబడడానికి కారణము తెలియదు...

పది దినములైదుప్రొద్దులు

పదపడి రెణ్ణాళ్ళు నొక్కపవలున్ రేయిన్

కదనంబు సేసి మడిసిరి

నది సుతగురు కర్ణశల్య నాగపురీశుల్

చిన్న కంద పద్యభావంలో తన భర్త రచించిన తరళ పద్యభావాన్ని ఇమిడ్చిన అధర్వుని గొప్పతనాన్ని నన్నయ భార్య మెచ్చుకుని ఇంటికి వచ్చింది. అదే విషయాన్ని, నన్నయ చెవిని వేసింది. నన్నయ అధర్వుని ఇంటికి వెళ్ళి అతడు లేని సమయంలో భారత ప్రతిని అధర్వుని భార్యను అడిగి పుచ్చుకుని చదివి, తనకంటే మిన్నగా ఉన్న అతని శైలికి అసూయపడి ఇంట ఎవరూ లేని సమయము చూసి ఇల్లు తగల బెట్టించాడు. ఇంటితో బాటు అధర్వుని భారతము తగులపడిపోయింది. అధర్వుడు ఆ మంటలలో ఆక్రోశిస్తూ ప్రవేశించి ఆత్మాహుతి చేసుకుంటూ పడిన క్షోభ, నన్నయకు మతిభ్రమణ కలిగించి భారత రచన అరణ్య పర్వం సగంలో ఆగిపోవడానికి కారణమైంది. అధర్వుని హాహాకారమే అమోఘవాక్కుగా శాపమై తగిలిందన్నది లోకం నమ్మినా, కాలనిర్ణయ కవుల చరిత్ర వాదనలో వారు సమకాలికులు కాలేకపోవడంతో పండితులు ఈ కథను త్రోసిపుచ్చారు.

**వేములవాడ భీమకవి-----నన్నయ**

నన్నయకు ముందే ఆంధ్ర కవిత పుట్టిందని అసూయపరుడైన నన్నయ, ఇతరకవులను అణగదొక్కాడని, రెండున్నర పర్వాల తరువాత ఏకారణం చేతనో భారత రచన పూర్తి చేయలేకపోయిన ఆదికవిని అప్రతిష్టపాలు చేయడానికి పుట్టిన కథ మరొకటుంది. ఎందుకంటే వేములవాడ భీమకవి రచించిన రాఘవ పాండవీయము, కవిజనాశ్రయము అనే ప్రముఖ గ్రంధాలను కూడా వెలుగులోకి రానీయకుండా నన్నయ అణిచి వేశాడు. అందుచేత అమోఘవచస్కుడైన 'వేములవాడ భీమన' నన్నయను మరణించమని శపించాడు. అందుచేతనే భారత రచన అరణ్య పర్వం సగంలో ఆగిపోయింది. అంతే కాదు భారత రచనా ప్రణాళిక కనుగుణంగా నన్నయ రచించుకున్న వ్యాకరణ గ్రంధము 'ఆంధ్ర శబ్ధచింతామణి'ని చించిపోగులు పెట్టి భీమన, గోదావరిలో కలిపేశాడు.. రాజరాజనరేంద్రుని కొడుకు సారంగధరుడు చిన్నతనంలో ఆ వ్యాకరణ గ్రంధాన్ని కంఠస్తం చేశాడు. పినతల్లి చిత్రాంగి చేసిన ఆరోపణ కారణంగా కాళ్ళు, చేతులూ ఖండించమన్న తండ్రి రాజ రాజ నరేంద్రుని ఆజ్ఞ కారణంగా కాళ్ళూ చేతులూ కోల్పోయాడు. ఆ తరువాత మత్స్యేంద్ర సిద్దుని అనుగ్రహము చేత సారంగధుడు పోయిన అవయవాలు తిరిగి పొందాడు. నన్నయ రచించిన ఆంధ్ర శబ్ద చింతామణిని తిరిగి రచించాడు. 'ఎలకూచి బాలసరస్వతి అహోబలీయము' అనే వ్యాఖ్య కలిగిన ఆ గ్రంధాన్ని సారంగధరుడు వెలుగులోకి తెచ్చాడని

ఆదిని భీమకవీంద్రుడు

గోదావరిలో గలిపెను గుత్సితమున నా!

మీదట రాజరాజనరేంద్ర

క్ష్మాదయితుని పట్టి దాని మహివెలయించెన్ !

అప్పకవి చెప్పిన ఈ విషయము నమ్మదగినది కాకపోయినా అమోఘవచస్కుడు భీమన రచించిన రాఘవ పాండవీయము కానీ, భీమన కవి జన్మాశ్రయ చంధము కానీ ఊహ కందని కారణాల వెనక అణచబడ్డాయన్నది నిజము. అందుచేత నన్నయ కాలము వాడిగా భీమన శాపానుగ్రహ నిగ్రహుడుగా పేరుపొందిన కథలు వ్యాపించ గలిగాయి. అతని శక్తిని గురించిన చాటువీ క్రింది పద్యము...

రామునమోఘబాణమును, రాజశిఖామణి కంటిమంటయున్

భీముగదా విజృంభణ ముపేంద్రుని చక్రము వజ్రివజ్రమున్

తామరచూలివ్రాతయను తారకవిద్విషు ఘోరశక్తియున్

వేములవాడ భీమ కవి వీరుని తిట్టును రిత్తవోవునే!

అని-- "రామబాణము, త్రినేత్రుని కంటి మంట, భీముని గద, విష్ణుచక్రము, వజ్రాయుధము, బ్రహ్మరాత, కుమార స్వామి శక్తి ఆయుధము----" ఎలా తిరుగులేనివిగా ప్రచారమయ్యాయో, అలాంటి వారితో సమానమైన, తిరుగు లేని అమోఘవాక్కుతో శాపానుగ్రహనిగ్రహుడుగా చాటువులలో ఎలా ప్రచారమయ్యాడో చూద్దాము.

భీమన తండ్రి సాక్షాత్తు ద్రాక్షారామములో వెలసిన భీమేశ్వరుడే! అందుచేతనే అతని వాక్కుకు అంతటి శక్తి వచ్చిందని లోకం చెప్పుకుంటోంది. భీమన తల్లి బ్రాహ్మణ బాల వితంతువు. ఆమె స్నేహితురాళ్ళతో కలిసి భీమేశ్వర సందర్శనానికి ద్రాక్షారామానికి వచ్చింది. అడిగిన కోరికలివ్వగల స్వామి మహిమను శ్లాఘిస్తున్న స్నేహితురాళ్ళతో వెటకారంగా -- "నాకు కొడుకుని కనే భాగ్యమివ్వగలిగితే ఈస్వామి మహిమ కలవాడని మీరు నమ్మదురుగాని లెండి"-- అంది. దేవుడితో పరిహాసము మంచిది కాదు. అనుగ్రహమో, స్వామి కోపమో తెలియదు గాని, భీమన తల్లి తనకే పాపమూ తెలియదని ఎంత వాదించినా స్వామిపై భారము వేసి గర్భము ధరించవలసి వచ్చింది. పది నెలలూ మోసి కొడుకుని కని భీమన అని పేరు పెట్టింది. బ్రాహ్మణ సమాజము వెలివేసింది. పెరిగి పెద్దవాడై ఆడుకుందుకు వచ్చిన భీమనను తోటిపిల్లలు 'విధవ కొడుకని' గేలి చేసి తండ్రెవరో చెప్పమని హేళన చేశారు. ఖిన్నురాలైన తల్లి నిలదీసిన పుత్రునికి సమాధానము చెప్పలేక భీమేశునికే తెలియాలని చెపొపింది. భీమన గుడికి వచ్చి లింగానికి తల బద్దలు కొట్టుకుని శివుని ప్రసన్నము చేసుకున్నాడు. ద్రాక్షారామ భీమేశుడు ప్రత్యక్షమై తానే తండ్రినని ఒప్పుకుని అమోఘవచస్కుడవు కమ్మని భీమనకు వరమిచ్చాడు.

**భీమన--- బ్రాహ్మణ సమారాధన**

వరసిద్ధుడై తిరిగి వస్తున్న భీమన ఒక బ్రాహ్మణ సమారాధన జరుగుతున్న ఇంటి ముందు ఆగాడు. వెలివేయబడ్డాడు కాబట్టి బ్రాహ్మణులు భీమన వర ప్రభావము గురించి తెలియక "ముండకొడుకని" తిట్టి తలుపులు మూసేసారు. ఆ ఇంటి అరుగు మీదనే కూర్చుని తలుపు సందులోంచి తొంగి చూచిన భీమన విస్తళ్ళలోని పదార్థాలను శపించాడు. అన్నము సున్నముగానూ, అప్పాలు కప్పలుగానూ, కూరలు, పప్పు, పులుసు, పచ్చళ్ళను రాళ్ళుగా మార్చేశాడని ఈ క్రింది చాటు పద్యము సాక్ష్యము.

గొప్పలు చెప్పుకొంచు నను కూటికి బంక్తికి రాకుమంచునీ

త్రిప్పుడు బాపలందరును తిట్టిరికావున నొక్కమారునీ

యప్పములన్ని కప్పలయి యన్నము సున్నముగాగ మారుచున్

పప్పును, శాకముల్ పులుసు పచ్చడులుంచి ఱుజాలుగావుతన్

భీమన వాక్కు అమోఘము. ఆకలితో ఉన్న బ్రాహ్మణులకు ఈ విచిత్ర సంఘటన సంభవానికి మతిపోయింది. భీమన వర ప్రభావుడై తమ భోజనాన్నిలా శపించాడని తెలియగానే 'భగవత్కృపా పాత్రుడవు మమ్మలిని క్షమించు. నీకు వెలిలేదు. వచ్చి మాతో కలిసి భూజించే శక్తి గలవాడవై నీ వాక్శుద్ధితో ఆహారపదార్థాలను ఎప్పటిలా ఉండేలా అనుగ్రహించు" అని ప్రార్థించారు. వెంటనే భీమన

ఘనుడీ వేములవాడ వంశజుడు ద్రాక్షారామ భీమేశ నం

దనుడీ భీమనయంచు గుర్తెరిగి నిందల్మాని నన్ గౌరవం

బున నీ విప్రులు సూచిరందువలనన్ బూర్వ స్థితింజెంది భో

జన వస్తు ప్రక్రంబులన్నియు యధాస్వస్థంబులౌగావుతన్!

ఆ నాటి నుండీ భీమునకు వెలి పోవడమే కాక ప్రజలలో అతని అమోఘ శాపానుగ్రహ వాక్శుద్ధి గురించిన కథలు ప్రచారమయ్యాయి.

**భీమకవి - కళింగ గంగు**

*(చాటు పద్యాలలోని కవులు, రాజు గురించిన వివరాలు చరిత్ర కాల నిర్ణయానికి సహకరించవు. విభేదిస్తాయి. అందుచేత నిజానిజాలు కన్న కవి ప్రభావ చాటువులులోని విషయాన్ని వివాదాస్పదము కాని రసహృదయంతో ఆస్వాదించాలని మనవి.)*

కళింగ గంగు ఒక రాజు. ఆయన కవి పోషకుడు. రాజైనా ఆయనా మామూలు ప్రవర్తన కతీతుడు కాదు. అందుచేత వస్తూపోతుండే కవులను వచ్చిన వెంటనే ఆదరించి దర్శనమివ్వాలన్న నియమాన్ని పాటించడములో అహంకారముతో కొందరి పట్ల చులకన భావనతో దర్శనమివ్వడానికి తాత్సారము చేసేవాడు. భీమన విషయంలో మరికాస్త దురుసుగా 'ఇప్పుడు కుదరదు. సందడి తీరిన తరువాత వచ్చి దర్శనము చేసుకోమని, పొమ్మని చెప్పాడు. భీమన శక్తి కళింగ గంగుకు తెలియదు. వర దర్పంతో ముక్కోపి తనాన్ని అలవరచుకున్న భీమన శాపమిచ్చాడు.

వేములవాడ భీమ కవి వేగమె చూచి కళింగగంగుతా

సామము మానికోపమున సందడిదీరిన రమ్ముపొమ్మనెన్

మోమును జూడదోసమిక ముప్పదిరెండుదినంబులావలన్

జామున కర్థమందతని సంపద శత్రులపాలుగావుతన్

ఈ కళింగ గంగు ముఖము చూడనని ముప్పది రెండు రోజులలో రాజ్యహీనుడవ్వాలని ఇచ్చిన శాపము ఫలించింది. అంతే రాయలనే పేరుగల రాజు, కళింగ గంగు రాజ్యాన్ని ఆక్రమించాడు. కళింగ గంగు రాజ్యభ్రష్టుడై తిరుగుతూ ఒకనాడు చీకటిలో వర్షపు నీరు నిలవున్న గోతిలో పడి మూలుగుతున్నాడు. ఆ సమయంలో పల్లకీలో వస్తున్న భీమన ఆ మూలుగులు విని పల్లకీ ఆపించి బోయీలను వివరాలు తెలుసుకోమన్నాడు. "భీమకవి చేసిన జోగినని' ఆ రాజు చెప్పిన మాటలు విని కళింగ గంగును గుర్తించి జాలిపడి మరల రాజ్య సిద్ధి అవుతుందని దీవించాడు. ఆ చాటువీ క్రింది పద్యము.

వేయిగజంబులుండ బదివేలు తురంగములుండనాజిలో

రాయలగెల్చి సజ్జగరంబున బట్టము గట్టుకోవడిన్

రాయ కళింగగంగు కవిరాజు భయంకరమూర్తి జూడగా

బోయిన మీనమాసమున బున్నమి వోయిన సష్టినాటికిన్

పున్నమి తరువాతి సష్టినాడు భయంకర మూర్తి అంటే యముడిని చూడడానికి కవిరాజు భీమన పోయిన దినమంటే భీమన మరణించిన ఆరోజు కళింగ గంగుకు తిరిగి భీమన అనుగ్రహవాక్కుగా మారి రాజయ్యాడని అంటారు. కాని 'భీమన కవిరాజు యొక్క భయంకరమూర్తి' శత్రువులను చూస్తుండగా మీనమాసమున పున్నమివోయిన సష్టినాడు పదివేలు ఏనుగులు, గుఱ్ఱాలు కలిగి రాయలను గెలిచి సజ్జ నగరములో పట్టాభిషేకము చేసుకోమన్నాడనేదివనే ఈ పద్యంలో ఉందన్నది ప్రచారములోనున్న కథ. ఎందుకంటే కవివాక్కు మీద నమ్మకమున్న కళింగ గంగు సజ్జ నగరము చేరుకున్నాడు. ఒక నాటక సమాజము వారి కంట పడ్డాడు. కళింగ గంగును ఓడించిన రాయలు తన విజయ గాధనుకళింగ గంగు అందుకు ఒప్పుకుని యుద్ధఘట్ట సమయంలో తనే కళింగ గంగునని ప్రకటించి నాటక ప్రదర్శన చూస్తున్న రాయలను ఖడ్గముతో నరికి అప్పటికప్పుడు పట్టాభిషేకము చేసుకుని కవి వాక్కును నిజం చేశాడన్నది లోకము చెప్పుకున్న కథ. గుడిమెట్ట ప్రభువు సాగి పోతరాజును తన గుఱ్ఱాన్ని దొంగలించినందుకు శపించిన చాటుధార విషయము విషమాక్షర ప్రయోగానికి ఉదాహరణగ నిలిచిన సంగతి ఇదివరకు చెప్పుకున్నాము. ఇప్పుడు కళింగ గంగు విషయంలో చెప్పిన పద్యాన్ని బట్టి భీమన దీవించగల శక్తి గలవాడని కూడా నిరూపించుకున్నాడు.

**చౌక్క రాజు---మల్లెసాల స్థంభము**

చాళుక్య చౌక్క భూపాలుడు భీమకవి తనను దర్శించినపుడు మల్లెసాలలో పచార్లు చేస్తూ కవితో ముచ్చటలాడుతూ 'మీ వాక్ప్రభావాన్ని స్వయంగా చూడాలని ఉందని నమస్కరించి అడిగాడు. తన కాలిని మల్లెపాలలోని స్థంభానికానించి' మాకు వినోదము కలిగేలా ఈ స్తంభాన్ని చివుళ్ళు, జొంపములు కలిగన వృక్షముగా మార్చమని' కోరాడు.

ఆనీతాభ్యుపదాన శృంఖళకరాభ్యాలంబితస్థంభమా!

నేనే! వేములవాడభీమకవినేనిన్ జిత్రకూటంబులో

భూనవ్యావృత పల్లవోప లతికాపుష్పగుచ్ఛంబులన్

నానాపుష్ప ఫలప్రదాయివగుమా! యాకల్పవృక్షాకృతిన్

వెంటనే ఆ స్తంభము ఫలపుష్ప బరితమై చిగుళ్ళు, కొమ్మలు కలిగిన వృక్షముగా మారింది. ఆ స్థంభము కలకాలమలాగే ఉండిపోవడానికి భగవదనుజ్ఞలేదు. ఎందుకంటే స్తంభానికానించిన చౌక్కరాజు కాలు ఇప్పుడు చెట్టె బోదెలో చిక్కుపడి విడదీయరాని బంధమేర్పరచుకుంది. అందుచేత తనకాలు బయటకు రావాలంటే తిరిగి మల్లెసాల స్థంబము ప్రత్యక్షము కాక తప్పదు. రాజు ప్రార్థనపై భీమన వృక్షాన్ని తిరిగి స్థంభముగా మరమని తన వాక్శుద్ధిని ఉపయోగించవలసి వచ్చింది. ఆ చెప్పిన పద్యమీ క్రింది చాటువు.

శంభువరప్రసాదికవి సంఘువరేణ్యుడనైన నావచో

గుంభన చేయనెంతొయనుకూలత నొందితనూభావనం

గుంభిని చౌక్కనామ నృపకుంజరు పందిటి మల్లెసాలకున్

స్తంభమురీతి నీతనువు దాలిచి యెప్పటియట్లనుండుమా!

అంతే వృక్షము మాయమై స్తంభము ప్రత్యక్షమైంది.

**ఆముదపాకివ్వని బ్రాహ్మణుని మరణం - పోతరాజుకు ప్రాణదానము**

భీమకవి ముక్కోపిగా సహనము కోల్పోయాడనడానికి ఒక చాటు పద్యమును ప్రచారములోకి తెచ్చారు. భీమకవి సేవకుడొకడు పొరుగు బ్రాహ్మణుని పెరట్లోని ఆముదపు చెట్టు నుంచీ మందు కోసమని ఒక ఆకును కోసిమ్మని అడిగాడు. ఆ బ్రాహ్మణుడు ఇవ్వనన్నాడు. ఇంత మాత్రానికే అలిగి సేవకుని కోరికపై భీమన బ్రాహ్మణుడిని చావశపించి ఉంటే అమోఘ వరదుర్వినియోగానాకి పాల్పడిన వ్యక్తిగా నిందాపాత్రుడుగా కూడా అపకీర్తినార్జించిన కవిగా అంగీకరించక తప్పదు. కాని మరణించమని శపించి తిరిగి బ్రతికించిన పోతరాజు ప్రణదాన వృత్తాంతము కలిగిన చాటు పద్యములు, భీమకవి సంజీవి వంటి వాక్కుతో విలక్షణ వ్యక్తిత్వాన్ని కలిగి ఉన్నాడని చెప్పవచ్చు..

బ్రాహ్మణుని మరణించమని తిట్టిన పద్యము

కూరుడుగము, కాయడుగము
నారయగా నుల్లిబచ్చలల్లమడుగ మా
పేరాముదపాకమడిగిన
బారమ్మున నేసెనట్టి బాపడుత్రెళ్ళున్

భీమకవిని సన్మానిస్తాను రమ్మని పిలిచిన లేటవరపు పోతరాజు అనే వ్యక్తి భీమనను అల్లంత దూరంలోనే చూసి సన్మానము చేసే ఉద్దేశము విరమించుకుని ఉండడము చేత ఇంటిలో దాగుకుని భార్య చేత లేడని చెప్పించాడు. భీమన ఇక పోతరాజు వెళ్ళవలసిన చోటుకే వెళతాడని ఈ పద్యము చెప్పాడు.

కాటికి కట్టెలు చేరెను
నేటావుల గుంపుగూడి ఏడువసాగెన్
కూటికి కాకులు వచ్చెను
లేటవరపు పోతరాజు లేడా! లేడా!

కవివాక్ప్రభావము పోతరాజును విగత జీవుని చేసింది. పోతరాజు శవము దహన సంస్కారానికి కాటికి ప్రయాణమైంది. ఆ సమయంలో ఎదురైన భీమన కవి పాదాల మీద పడి భార్య క్షమించి భర్తను అతని సంజీవి వాక్కుతో బ్రతికించమని కోరింది. అప్పుడు భీమన

నాటి రఘురాము తమ్ముడు
పాటిగ సంజీవి చేత బ్రతికిన భంగిన్
కాటికి బోనీకేటికి
లేటవరపు పోతరాజ!లేమ్మా!లెమ్మా!

పోతరాజు నిద్రనుంచీ లేచినట్లు లేచి కవికి నమస్కరించి ఘనంగా సన్మానించి మాటనిలుపుకున్నాడు.

**భీమన---రణతిక్కన**

భారత కవి తిక్కన సోదరుడు రణతిక్కన యుద్ధములో మరణించాడు. అది తెలియక అతని భార్యను భీమన 'దీర్ఘసుమంగళీభవ' అని ఆశీర్వదించాడు. తరువాత సంగతి తెలిసిన రణతిక్కన కళేబరము చెంతకు వెళ్ళి భీమన బ్రతుకుమని ఆశీర్వదించి రణతిక్కనను బ్రతికించాడని ఈ క్రింది చాటువులు ప్రచారములో ఉన్నాయి.

గుణములనిధానముగుమన
రణతిక్కనతాకళేబరంబును,శిరమున్
గణకమెయిగలయ బ్రదుకును
బ్రణుతాకిలవైరిమకుటభాసితపరుడై
శ్రీలలరార శత్రుల జెండితి నార్యులుమంత్రివర్యులా
ర్వేలఘనుల్నుతించి రలవేల్పు దొరల్ముదమందిమెచ్చిరో
లాలిత్యశౌర్య! ధైర్యజయలక్ష్మి ప్రియంబున నిన్వరించెనో
లీలా హెచ్చె దిక్కనకళేబరమా! ఇక నిల్చియాడుమా!

రణతిక్కన గురించిన చాటుపద్యాలు వేరే చర్చించుకోవాలి. ఒకమహావీరుడు మరణించడం జనులు జీర్ణించుకోలేని సత్యము. అతడు సజీవుడిగా జనుల ముందుకు వచ్చేలాప్రాణము పోసిన సంఘటనలోని నిజము హేతువాదానికి అందనిది. భీమన అమోఘ వచస్కుడనుటకు సందేహము లేదు. భీమన తల్లి కొడుకుకు నెయ్యి వడ్డిస్తూ నేతిజారీ పొయ్యి మీద వేడిచేయవలసి వచ్చి గిన్నె అడుగున అంటినమసి కడుపు మీద రాసుకుంటూ తుడిచి శుభ్రము చేసింది. కానీ పొట్ట మీద మసి అలాగే ఉండడము తో భీమన తలెత్తి చూసి 'అమ్మా నీ కడుపు మసి అయిందేమిటి' అని తల్లిని అడిగాడు. కడుపు మసి అవడమంటే తెలుగు జాతీయము ప్రకారము పుత్ర నష్టము. తల్లినలా ప్రశ్నించిన భీమన తల్లికి శోకము కలిగిస్తూ తనువు చాలించాడని అతని వాక్కే అతని ప్రాణము తీసిందని చెప్పుకుంటారు. ఆ అమోఘవచస్కుడు భీమన తల్లి---- "రాముని తల్లి కౌసల్య, పరశురాముని తల్లి రేణుక మన్మధుని తల్లి లక్ష్మి, కృష్ణుని కన్న తల్లి యశోద, రణ తిక్కనను కన్న తల్లి" వలె ఏ జన్మలోనో గొప్ప తపస్సు చేసి ఉండాలని భీమన గొప్పతనాన్ని ఈ చాటువు వివరించింది.

ఏమి తపంబుసేసి పరమేశ్వరు నేమిటబూజసల్పిరో
రాముని తల్లియుం బరుశురాముని తల్లియు భీముతల్లియుం
గాముని కన్నతల్లియును గంజదళాక్షుని కన్నతల్లియున్
శ్రీమహిత ప్రతాపుడగు సిద్దయతిక్కన కన్నతల్లియున్..!

❀❀ ❀❀

# తెలుగులో చాటు కవిత్వం
## డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(7)

<u>*తిక్కన:- రాజరాజనరేంద్రుడు*</u>

శ్రీశ్రీ వంటి మహా కవి తిక్కనని 'నభూతోనభవిష్యతి' అని ప్రశంసించాడు. ఆదికవి నన్నయే. కానీ తిక్కన అద్వితీయుడు. కవిత్రయములో రెండవవాడైన తిక్కన నన్నయ మీద గౌరవముతో అరణ్యపర్వ శేషాన్ని తన శైలితో అతుకు వేయడానికి సాహించలేదు. అద్వితీయమైన ద్వితీయ కవిగా తన శైలిని లోకానికందించాడు. ఆ మహా కవికి కుమ్మరి నాధుడు వ్యాసభగవానునుకి వినాయకుని వలె లేఖకుడుగా వ్యవహరించాడని అంటారు. అదలా ఉంచితే నన్నయ తరువాత రెండువందల సంవత్సరాల తరువాత పుట్టిన తిక్కన మనుమ సిద్ధి ఆస్థానకవిగా జగద్విదితము. కానీ నన్నయ మరణించిన తరువాత ఆంధ్రమహాభారత పూరణార్ధమై రాజరాజ నరేంద్రుడు తిక్కనను తన ఆస్థానమున కాహ్వానించిన విషయము పొంతనలేని కట్టుకథే అయినా చాటు కవిత ప్రచారము సమకాలికత్వాన్ని ఆపాదిస్తూ ఆసక్తి కలిగిస్తుంది.

ఆంధ్ర మహాభారతములో - 'నిండుమనంబు, నవ్యనవనీత సమానము పల్కు'-- 'మదమాతంగ రురంగకాంచన'-- 'శారదరాత్రులు జ్వలల సత్తరతారహారక' -- అనే మూడు పద్యాలు లోకంలో నన్నయ కవి అనితర సాధ్య శైలికి ఉదాహరణలుగా ప్రచారమయ్యాయి. నన్నయ మరణించడంతో ఆగిపోయిన భారత రచనను పూరించగల మహాకవిని గుర్తించి ఆస్థాన కవిని చేయడానికి అన్ని రాజాస్థానాలకు ఈ పద్యాలలో ఒకదానిని రాజరాజనరేంద్రుడు పంపాడని అంటారు. అయితే మనుమ సిద్ధి ఆస్థానములో ఉన్న తిక్కన అంతకన్నా బాగా రాయగలనని అర్థము వచ్చేటట్లు పంపిన పద్యానికి రంగు పులిమి పంపాడు. అయితే తిక్కన తాను మనుమ సిద్ధి ఆస్థానములోనే ఉంటానని భారత రచన రాజమహేంద్రవరము వచ్చి రచించి అంకితమివ్వలేని రాజరాజనరేంద్ర మహారాజు కొలువును తిరస్కరించాడు. మనుమసిద్ధి రాజధిక్కారణ నేరమారోపించి తిక్కనను బుజ్జగొరిగించి వీధులవెంట తిప్పి మాంసము తినిపించమని శిక్ష వేశాడు. కానీ భారత రచన పూర్తవడము తన లక్ష్యమని మహాకవిని అవమానించవద్దని తన పట్టుసడలించుకుని రాజరాజనరేంద్రుడు తిక్కనను మనుమసిద్ధి ఆస్థానములోనే ఉండి భారత రచన పూర్తి చేయమని కోరాడు.. కానీ రాజు వేసిన శిక్ష తప్పదు కనుక క్షురకర్మ చేయించుకుని యజ్ఞదీక్ష తీసుకుని, ఊరేగి, యజ్ఞము చేసి పూర్తయిన తరువాత మాంసము (పురోడాశము)ను తిని ,యజ్ఞము చేసిన కారణముగా సోమయాజి అనిపించుకున్నాడు. రాజాజ్ఞ అమలైనకారణంగా రాజుకు అసత్య దోషము పోయింది. తన మాట నిలుపుకుందుకు రాజాంకితముగా కాక తిక్కన సోమయాజి పేరుపడి హరినాథ దేవాంకితముగా భారత రచన చేశాడు. తిక్కనకు మనుమసిద్ధి అంటే ప్రాణము. భారతాన్ని హరిదరనాధునికి అంకితమిచ్చి నిర్వచనోత్తర రామాయాణాన్ని కవితాకన్యగా మనుమసిద్ధికి అంకితమిచ్చి మామ అనిపించుకున్నాడని ఈ పద్యం సాక్ష్యమిస్తుంది

ఏ నిన్ను మామయనియెడు
దీనికి దగనిమ్ము భారతీకన్యకనా
కీనర్హుడవగుదనినను
భూనాయకుపలుకు చిత్తమున కింపగుడన్ !

అక్కన్న, బయ్యన్నలను దాయాదుల కారణంగా రాజ్యభ్రష్టుడైన మనుమ సిద్ధికి భారతము చదివి వినిపించి మెప్పించి కాకతీయ గణపతి మహారాజు సహాయాన్ని తెచ్చి తిరిగి రాజ్యాభిషేకము చేసినట్లుగా జనశ్రుతి, ఇక తిక్కనకు గల వాక్శుద్ధిని చూద్దాము.

*తిక్కన -- కుమ్మరి కురునాధుడు*

సంస్కృతమహాభారత రచనలో వ్యాసునకు వినాయకుడు లేఖకుడిగా ఉండి పేరు పొందినట్లుగా, కుమ్మరికురునాధుడు తిక్కనకు లేఖకుడిగా ఉన్నాడని జన శ్రుతి. వ్యాసుడు-- వినాయకుడు మధ్య గల భారత రచన ఒప్పందములాగే తిక్కన గ్రుక్క తిప్పుకోకుండా పద్యాలు చెపుతుండగా కురునాధుడు మరల అడగకుండా నియమమేర్పరచుకున్నాడని తెలుగు భారత రచనకు కూడా ఒక కథ ఉంది.. భారతములో శల్యపర్వములో ఒక పద్యములో చివరి పాదములో 'మొలగిచనియె'----అని వదిలివేసి తిక్కన ఆలోచనలో పడి 'ఏమి చెప్పుదుం కురునాధ'--- అని కురునాధుని కేసి చూసి ఆగిపోయాడు. నియమం తప్పానని తిక్కన బాధపడుతుంటే అది తననడిగిన ప్రశ్న అని భావించకుండా ధ్రుతరాష్ట్రుడు అనే అర్ధము తీసుకుని "ఏమి చెప్పుదుంగురునాధ" అని పద్యము పూర్తిచేయడం వల్ల ప్రజ్ఞాభంగము కాలేదని "ఇయ్యదిపద్యమైనది. కురునాధుడైన ధ్రుతరాష్ట్రునితో సంజయుడు ఏమి చేయుదును కురునాధ అని పలికినట్లు భావించి పద్యము పూర్తిచేశాను" అని సమర్ధించిన లేఖ, కురునాధుని మాటలు తిక్కన వరసిద్ధి వాక్ప్రభావమును చాటుతున్నాయి. భారతములోని ఈ పద్యము చాటువుగా ప్రచారమందింది.

వలపలనిమూకంలోగా
ల్నిలువక గుఱ్ఱంబుడిగ్గి నీ కొడుకుగదా
కలితభుజుండగుచు నొకడు
మొలగి చనియె----నేమి చెప్పుదుంగురునాధా!

*ఖడ్గతిక్కన:---*

ఖడ్గతిక్కన మన కవిత్రయ తిక్కనకు పెద తండ్రి కుమారుడు. మనుమ సిద్ధిరాజుకు సేనాని. నెల్లూరు ప్రాంతములో పటపు రాయి గ్రామానికి తూర్పుభాగాన పినాకినీ నదీతీరమున తిక్కనపాడను స్థలములో గుఱ్ఱము మీద రౌతు చెక్కిన శిలను రణతిక్కన ప్రతిమయని స్థానికులు భావిస్తున్నారని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమ చాటు పద్యమణిమంజరిలో పేర్కొన్నారు. మనుమసిద్ధి, కాటమరాజుల యుద్ధములో అసమాన శౌర్యము చూపి మరణించిన రణతిక్కన మరణమునకు ప్రజలు ఈ విధముగా చింతించారన్నది ఈ క్రింది చాటువు.

వెన్నెలలేని రాత్రియు రవి ప్రభలేనిదినంబు నీరులే
కున్న సరోవరంబు కడునొప్పగుదీపము లేనిఇల్లునై
విన్నదనంబు నొందెను మన విక్రమ సింహపురంబు చూడగా
పున్నమ చంద్రుబోలు మనపోలదు తిక్కనలేమినక్కటా!

ఈ రణతిక్కనను వేములవాడ భీమకవి పునర్జీవుతుని గావించాడని చెపుతారు. కవిత్రయ తిక్కనకు సోదరుడైన ఈయన మొదట రక్తపాతమున కొప్పుకొనక రణరంగము నుండీ తిరిగి వచ్చాడు. అది ఇంట్లో వాళ్ళకు నచ్చలేదు. ఎందుకంటే రణతిక్కన కుటుంబ ప్రసిద్ధి ఈ విధంగా ఉంది.

వీరనాదంబు వేదనాదంబు---పాయకమే ప్రొద్దు మ్రోయుచుండు.

భూసురప్రకరంబు సేనలు చల్లంగ---బాయకెన్నియొ కుటుంబములు బ్రదుకు

బ్రాహ్మణావళికి ధారలు పోసిన జలంబు---సతతంబు ముంగిటజాలువారు.

విపులకొసగిన పత్రికలను--బాయక కరణముల్ వ్రాయుచుంద్రు

మానఘనుడైన తిక్కన మంత్రి యింట--

మదనసముడైన తిక్కన మంత్రి యింట

మహితయశుడైన తిక్కన మంత్రి యింట

మంత్రిమణియైన తిక్కన మంత్రి యింట

అటువంటి కుటుంబములోని తిక్కన యుద్ధభూమినుండీ వెనుదిరిగి రావడము కుటుంబము సహించలేకపోయింది. "చతురంగ బలముతో సమరంబు సేయక మానంబు విడిచిన మందబుద్ధి" అని

అనుచునార్వేలవారు నిన్నపహసింప

ధరణి నెల్లూరులో నెట్లు తిరుగగలవు

వైరులను గెల్చి సత్కీర్తి వరులుమయ్యి

మంత్రికుల హేళి! తిక్కనామాత్యమౌళి!

అని ప్రభోదించారు. భార్య పసుపు ముద్ద అంటించిన నీళ్ళ బిందెతో స్నానానికి నీళ్ళు పెట్టి నులకమంచమడ్డు పెట్టి "నేను, నీ తల్లివలె మూడో ఆడుదానివై కనపడకుండా మరుగున స్నానము చేయమ"ంది. గుండెను చీల్చే మాటలుగల శక్తివంతమైన ఈ పద్యము చూడండి.

పగఱకు వెన్నిచ్చినచో

నగరేనిను మగతనంపు నాయకులెందున్

ముగురాండ్రవారమైతిమి

వగపేటికి జలకమాడవచ్చిన చోటన్

అంతకన్న పదునైన మాటలతో అవమానించింది తల్లి. స్నానము చేసి భోజనానికి కూర్చున్న కొడుకుకు పెరుగుకు బదులు విరిగిన పాలు పోసి ఇదేమిటని అడిగిన తిక్కనకు "నువ్వు పగరకు వెన్నిచ్చిన రణస్థలములో గడ్డిమేస్తూ నీ పరాక్రమము చూసిన పశువుల పాలివి" అని సమాధానమిచ్చింది.

అసదృశముగనరి వీరుడు

మసిపోవగ విఱిగివచ్చు మగపందక్రియన్

గసవున్ మేయగబోయిన

పసులున్ విఱిగినవి తిక్క! పాలున్ విఱిగెన్!

ఈ మాటలు వినగానే తిక్కన తిరిగి సర్వసన్నద్ధుడై పగఱ నెదుర్కొని వీరస్వర్గము పొందాడని ఈ చాటు పద్యము చాటుతుంది.

పదటున వాజిరాహుతులపై దుమికించుచు తిక్కడార్చినన్
బెదిరి పరిభ్రమించి కడుబమ్మిట వీరులు భీతిచిత్తులై
యదెయదె వాలు వాల్మెఱుగులల్లవె యల్లదె యాతడంచనన్
గొదుకక యాజి చేసె రిపు కోటులకందఱకన్ని రూపులై!

ఈ మహావీరుడి భార్యను దీర్ఘసుమంగళిగా భీమన చాటువును ఇదివరకు చదివాము. పద్యమైనా, గద్యమైనా అక్షరశక్తిని కాదనలేము. ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు మరణించిన వెంటనే పాతపగలు దృష్టిలో పెట్టుకుని దండయాత్రకు సిద్ధమైన గజపతిని ఛీకొట్టి తన పద్యము ద్వారా సందేశమంపి వెనక్కు పంపాడని ఈ క్రింది చాటువు చాటింది.

రాయరాహుతమిండ రాచయేనుగువచ్చి--యారట్లకోటకోరాడునాడు.
సంపెటనరపాల సార్వభౌముడు వచ్చి--సింహాద్రిజయశిల చేర్చునాడు
సెలగోలు సింహంబు జేరి ధిక్కృతికంచు--తల్పులఢీకొల్పునాడు.
ఘనతతనిర్భరగండపెండెరమిచ్చి--కూతురాయలకొనగూర్చునాడు
ఒడలెఱుంగవొ? చచ్చితొ?యుర్విలేవొ?
చేరజాలకతలచెడిజీర్ణమైతొ
కన్నడంబెట్లు సొచ్చెదు గజపతీంద్ర!
తెఱచి నిలుకుక్కసొచ్చిన తెఱగుదోప

సిగ్గుపడిన గజపతి వెనుకకు వెళ్ళిపోయాడు. కవిత్వమహత్వము చేతవాక్ప్రభావము చూపిన ఎందరో కవులను గురించి పేర్కొనాలంటే పెద్దగ్రంథమే అవుతుంది. ***కృషిపాటి వెంకటసుబ్బకవి (1850)*** వంటి కవులు కుంభవృష్టిని కూడా ఆపగలిగారు. మహానంది క్షేత్రంలో జగద్గురు శ్రీ పుష్పగిరిశంకర భారతీ స్వామి సన్నిధిని బ్రాహ్మణ సమారాధన జరుగు సమయంలో కుంభవృష్టి ప్రారంభమవగా నెల్లూరు మండల వాసియగు ఈ కవి వర్షమునాపివేసాడని ఈ క్రింది చాటువులు ప్రచారములో ఉన్నాయి.

గోండ్రలు వెట్టు మేఘుడతి కోపమునంగురియంగజొచ్చెమా
తండ్రిమరుత్తనూజ! నను దబ్బఱాడనియెంచకుండనీ
వేండ్రమునీవెమాన్పవలె వేయివిధంబులుగాకయున్నమీ
తండ్రికినైనజెప్పి జలదప్రతిబింబము మాన్పు మారుతీ!
విద్యుత్పింగళేక్షణ కృపావిర్భూతశ్రీకృషిపా
డ్విద్వద్వేంకటసుబ్బసూరికవితోద్వృత్తత్వమాలించినీ
విద్యుద్గర్జభర్జనభర్జనాదులడరన్ వేమారువర్షింపకే
విద్యాశంకరభారతీవిజయమున్ విక్రాంతివాటిల్లగాన్!

***<u>ఎఱ్ఱన మొదటి పద్యము</u>***

అరణ్యపర్వ శేషపూరణముతో కవిత్రయములో మూడవవాడిగా ఖ్యాతినార్జించిన ఎఱ్ఱన ఆశ్వాసాంతగద్యంలో తన పేరు చెప్పుకొనలేదు. నన్నయయే రచించినట్లుగా ఆశ్వాసాంత గద్యలో ఉంది. అందుచేత అరణ్య పర్వశేషాన్ని పూరించాడు. అందుచేత అరణ్య పర్వములో నన్నయ కవిత్వము తరువాత ఎఱ్ఱన ప్రారంభ పద్యముగా ఈ క్రింది పద్యము ప్రచారమై ఎఱ్ఱన ప్రభంధ పరమేశ్వరత్వాన్ని లోకానికి తెలియజేయగలిగింది.

స్ఫురదరుణాంశురాగరుచిబొంపిరి వోయి నిరస్తనీరదా
వరణములై దళత్కమల వైభవశీరభణముల్ల సిల్లను
ద్ధురతర చక్రసార సంధ్రువత నిస్వనముల్సెలంగగా
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళ చూడగన్

*__భగవత్కృపాప్రాప్తులు__*

కవులందరూ మహాభక్తులు. ఇష్టదేవతా స్తుతి చేయని కవి మనకు తెలుగు సాహిత్యములో కనిపించడంటంటే అతిశయోక్తికాదు. భగవంతుడు వారి కవితావేశానికి ముగ్ధుడై కవికి ఆలోచన తెగక గంటము ఆపివేసినా నీవే దిక్కని ప్రార్ధించినా స్వయంగా వచ్చి సహాయపడ్డాడని మనకు చాటువులు సాక్ష్యమిస్తాయి. సరస్వతిని తన ఇంటికి రప్పించుకున్న ఇద్దరు మహాకవులను గురించి తెలుసుకుందాము.

*__బమ్మెరపోతన:-__*

పోతన రామభక్తుడు. శారదాదేవి కంటి నీరు తుడిచి ఓదార్చిన మహాత్ముడు. ఆ ఉదంతమునకు ముందు ఈ మహాకవికి శ్రీరాముడు స్వయంగా వచ్చి భాగవతంలో ఒక పద్యము పూరించిన సంఘటన నమ్మకానికతీతంగా నేటికీ ప్రజలను పులకాంకితులను చేస్తూ ఆభక్త పోతనకు కైమోడ్పుగా ప్రచారమైన పద్యాన్ని చూడండి. ''అలవైకుంఠపురంబులో-----'' అని రాసిన తరువాత పోతనకు గంటము కదలలేదు. ఆలోచించుకుంటూ బయటకు వచ్చి తిరుగుతున్నాడు. మొసలికి చిక్కి బాధపడుతున్న కరిని రక్షించడానికి సిద్ధపడుతున్న శ్రీమహా విష్ణువును వర్ణింపవలసిన పద్యమిది. పోతనకు ఆ సమయంలో తానెలా ఉన్నాడో తెలియజేయాలనిపించి సాక్షాత్తు శ్రీరామావతారుడైన నారాయణుడే దిగి వచ్చి ఇలా రాసుకున్నాడు.

అల వైకుంఠపురంబులో నగరిలో నామూల సౌధంబుదా
పల మందారవనాంతరామృత సరఃప్రాంతేందు కాంతోపలో
త్పలపర్యంక రమా వినోదియగు ఆపన్నప్రసన్నుండువి
హ్వలనాగేంద్రము పాహి పాహి యన కుయ్యాలించి సంరంభియై

ఆ పద్యము తరువాత హరి వైకుంఠము నుండీ రావడము, చక్రాన్ని పంపించి మకరిని ఖండించి కరిని కాపాడి పాంచజన్యము పూరించడము మొదలైన గజేంద్రమోక్షఘట్టాన్ని పోతన అవలీలగా పూరించాడని లోకము నమ్మింది. నేటికీ నమ్ముతోంది.

*__శారదకు ఓదార్పు__*

భాగవతాన్ని శ్రీరామాంకితముగా రచించాడు. కానీ బహుగ్రంథప్రణేత అయిన శ్రీనాథుడు పోతనను కలుసుకుని గొప్పరాజుకంకిత మిచ్చి తనలాగే సంపదలు పొందమని ప్రలోభపెట్టాడు. నిజానిజాల సంగతేమో కానీ సమకాలికుడైన శ్రీనాథ మహాకవి పోతనకు బావమరిది. అందుచేత పోతన మెత్తబడ్డాడు. నరాంకితము చేయడానికి ఆలోచన మొదలు పెట్టాడు. ఆ మహాకవి అంతర్మధనము శారదయై రూపుగట్టి కనులనీరునింపి ''నన్ను నరాంకితము చేస్తావా?'' అని ప్రశ్నించింది. అప్పుడు పోతన పశ్చాత్తాపముతో ఈ క్రింది పద్యమును రచించాడు.

కాటుకకంటి నీరు చనుకట్టుపయింబడనేల యేడ్చెదో
కైటభదైత్య మర్దనుని గాదిలికోడలయోమదంబ! యో
హాటక గర్భురాణినిను నాకటికింగొనిపోయి యల్లక
ర్ణాట కిరాటకీచకులకమ్మ త్రిశుద్ధిగ నమ్ముభారతీ!

******

# తెలుగులో చాటు కవిత్వం
## డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(8)

శారదా మాత కన్నీరు తుడిచిన రామభక్తుడు పోతన తన భాగవతాన్ని "ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి----" అని నరాంకిత గ్రంథ రచనను నిరాకరించిన విషయము భాగవతములో ఉంది. కానీ మంచన కేయూర బాహు చరిత్రలో ప్రథమాశ్వాసములోని ఈ క్రింది పదమూడవ పద్యము కూడా బమ్మెర పోతన చాటువుగా లోకములో శ్రీనాథ మహాకవితో నరాంకితముగా గ్రంథరచనను చేయలేనని నిష్కర్షగా పోతన చెప్పిన సందర్భముగా ప్రసిద్ధికెక్కింది.

బాలరసాలసాలనవపల్లవ కోమల కావ్య కన్యకన్
కూళల కిచ్చి యప్పడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్
హాళికులైన నేమి <u>గహనాంతరసీమగందమూలకౌ</u>
<u>(మరియంతకు నాయతిలేని నాడుకౌ)</u>
ద్దాళికులైన నేమి నిజ దార సుతోదర పోషణార్థమై

కూళలకివ్వడానికి మనసు రోస్తుంది కానీ మంచివాడు మదీయ కవితకు కృతిభర్త కావాలని మంచన ఆశిస్తు, తరువాతి పద్యములో చెప్పడాన్ని బట్టి ఈ పద్యము చెప్పినది మంచనే కానీ పోతన కాదు. ఇప్పుడు సరస్వతిని రాణిగా భావించి పడకటింటికి రప్పించుకున్న కవి గురించి తెలుసుకుందాం.

<u>**వాణి నా రాణి---పిల్లలమర్రి పిన వీరభద్రకవి సాహసము :-**</u>

తెలుగు సాహిత్యములో సరస్వతీ దేవిని కవులందరూ తల్లిగా భావించారు. జైమినీ భారతము రచించిన పిల్లలమర్రి పిన వీరభద్రుడు ఇందుకు విరుద్ధంగా "వాణి నా రాణి" అని చెప్పినట్లుగా ఆంధ్ర కవిలోకము నమ్మింది. ఒక చాటువు ప్రచారములో ఉంది.

పిల్లలమఱి పినవీరన
కిల్లాలట వాణి యట్టులే కాకున్నన్
తెల్లముగ నొక్కరాతిరి
తెల్లగ తెలవారువరకు తేగలడె కృతిన్

జైమినీ భారతములోని అశ్వమేథపర్వమును తెనిగించి సాళువగుండనృసింహరాజుకు అంకితమివ్వగల సమర్థుడు పినవీరన మాత్రమేనని కవులు సభలో ఏకగ్రీవముగా పలికారు. రాజు పరమానందపడి నిర్ణీత గడువులో కావ్యము అంకితమివ్వమని నిండు సభలో

సన్మానించి బహుకరించి అడిగాడు. తెల్లవారితే గడువు పూర్తవుతుంది. కానీ అంతవరకు శ్రీకారముకూడా చుట్టలేదు. పినవీరన సోదరుడు పెద వీరన భయపడి హెచ్చరించాడు. అందుచేత రాత్రి పినవీరన తన పడక గది పరిశుభ్రము చేయించి ఉపవాసదీక్షతో దర్భాసనముపై కూర్చుని సరస్వతిని ధ్యానించాడు. సరస్వతి ప్రత్యక్షమై గ్రంథము రాసింది. పదిమంది ఒకేసారి గంటములతో రాస్తున్న సవ్వడి గదిలోంచి వచ్చింది. పెదవీరన ఆశ్చర్యపడి తలుపు రంధ్రమునుండీ తొంగి చూశాడు. "బావగారు తొంగి చూస్తున్నారు" అని సరస్వతి మాయమయిపోయింది. తరువాయి మిగిలిపోయిన కొంచెం పూర్తి చేసుకుని రాజసభకు వచ్చి గ్రంథము వినిపించడానికి పూనుకున్నాడు. అప్పటికే ఈ సంగతి సభలో ప్రాకింది. సరస్వతిని ఇంటికి రప్పించుకున్న పుణ్యశాలివని ప్రశంసించారు. వాణి నా రాణి అని నవ్వుతూ ఇచ్చిన జవాబుకు రాజుతో సహా సభాదులు కోపంతో మండిపడుతుంటే ఆ మాటలు నిజంచేస్తూ వీణాపాణి తన హస్తాన్ని తెరచాటునుంచీ చూపిందన్నది తరతరాలుగా ప్రచారమైన కథ. పినవీరనకు ఏడు తరాల తరువాత అతని వంశము వాడిగా చెప్పుకున్న పెనుమళ్ళ సోమయ్య సీమంతినీ పరిణయంలో ఈ విధముగా చెప్పుకున్నాడు.

వాణి ఇల్లాలుగగవిశ్రేణికెల్ల
ప్రభుతరాశ్చర్యకరమైన బిరుదు పూనె
తుహినగిరిరాజరామ సేతవుల నడుమ
నితని కెనయైన కవివరుండెందుగలడు

కవి ఆశువుగా ఒక్క రాత్రిలో గ్రంథరచన చేయగల సమర్థుడు. ఆ కారణం చేత ఈ కథ కల్పింపబడింది. కృత్యాది ప్రార్థనలలో కవి శారదామాతను పరదేవతగా, ఏలికసానిగా స్తుతించాడు. కానీ వాణి నా రాణియని చెప్పుకున్న ఏకైక సాహసకవిగా పేరు పొందిన పిల్లమఱి పిన వీరభద్రుడు భగవత్కృపా పాత్రుడనుటలో సందేహము లేదు.

<u>సర్వేశ్వర శతకము---మెడకు గండ కత్తెర:-</u>

యధావాక్కుల అన్నమయ్య "సర్వేశ్వరా" అను మకుటముతో మత్తేభ, శార్దూల వృత్తములలో రసవత్తమైన శతకమును రచించాడు. ఈ శతక రచనకు శ్రీశైల మల్లికార్జునుడు ప్రతిపద్యానికి అమోద ముద్ర వేశాడని చెప్పుకుంటారు. శ్రీశైలము వెళ్ళి మల్లికార్జునుని దర్శించి వచ్చిన అన్నమయ్య కృష్ణానదీ తీరమున విశ్వామిత్రాశ్రమమను పేరు గల స్థలములో ఈ శతక రచన చేశాడట. ఈ ప్రాంతము పల్నాటి తాలూకాలోని జెట్టి పాలెము వద్ద ఉంది. మెడకు గండకత్తెర అన్న సామెత ఈ కవి వల్లేవచ్చి ఉంటుంది. ఎందుకంటే శతక పద్యాన్ని తాటాకు మీద రాసి కృష్ణానదిలో వేసెడివాడు. అది ప్రవాహానికి కొట్టుకుపోకుండా ఎదురీది దగ్గరకు వస్తేనే సూతబద్ధము చేస్తున్నాడు. అట్లు జరగపోతే శిరము ఖండించుకుంటానని శపథము చేసి మెడకొక గండకత్తెర తగిలించుకున్నాడు. అలా ఈ క్రింది పద్యాన్ని రచించి నీటిలోకి వదిలాడు.

తరులంబువ్వులు పిందెలై యెదవి తత్తజ్జాతితో పండ్లగున్
హర! మీ పాద పయోజపూజితములె యద్భుతంబివ్విరుల్
కరులౌ నశ్వములౌ ననర్ఘమణులౌ కర్పూరమౌ హారమౌ
తరుణీ,రత్నములౌ! పటీరతురులౌ తథ్యంబు సర్వేశ్వరా!

"చెట్టున ఉండిపోయిన పువ్వులు ఫలదీకరణము చెంది పిందెలుగా ఎదిగి ఆయా జాతి వృక్షాల పండ్లుగా మారతాయి. కానీ ఈశ్వర చరణాంకిత పుష్పములు ఫలదీకరణములో కరులు, అశ్వములు, మొదలైనవిగా జననమందుతాయి" అని అర్థమువచ్చే ఈ పద్యము ప్రవాహానికి ఎదురీది రాక కొట్టుకుపోయింది. అందుచేత శపథము ప్రకారము తల కత్తిరించుకోబోయాడు. శివుడు పశుల కాపరి రూపంలో వచ్చి ప్రవాహములో తనకీ తాటియాకు దొరికిందని ఇచ్చి అదృశ్యుడయ్యాడు. ఆ పద్యము అన్నమయ్య రాసింది కాదు.

ఆ పద్యము శివుడే రాసిచ్చాడని ఆనంద పడిన ఆ భగవత్క్రుపా పాత్రుని శతకములో సూత్రబద్ధమైన ఈ పద్యము సాక్ష్యమని లోకము చాటుతోంది. ఆ పద్యము ఈ క్రిందిది.

ఒక పుష్పంబు భవత్పద ద్యయముపై నొప్పంగ సద్భక్తిరం
జుకుడై పెట్టిన పుణ్యమూర్తికి పునర్జన్మంబులేదన్న బా
యక కాలత్రితయోపచారముల నిన్నర్చించునో పెద్దనై
ష్టికుడైయుండెడువాడు నీవగుట తా చిత్రంబె సర్వేశ్వరా

నయన రగడ---చక్రపాణి రంగనాధుడు

శివ కేశవుల కభేదము గురించిన చాటువులలో కూడా భగవత్క్రుపా పాత్రులను చూడవచ్చు. చక్రపాణి రంగనాధుడను కవి శివద్వేషి. పాల్కురికి సోమనాధుడు అను శివ కవితో వాదించి ఓడించి వైష్ణవమును నిలపాలని వచ్చి అతని కుమారుడు చతుర్ముఖ బసవేశ్వరునితో వాదించి ఓడిపోవడముతో సిగ్గుపడి ఇంటి దారి పట్టాడు. దారిలో శ్రీశైల మార్గములో శివుడు కోపించాడు. అంధత్వము ప్రాప్తించినది. అహోబిల నరసింహుడు స్వప్నములో కనిపించి శివ ద్వేషమును వీడుమని చెప్పాడు. శ్రీశైల మల్లికార్జుని దర్శించి ఒక కన్ను, పాల్కురికి సోమనాధ కవిని ప్రార్థించి రెండో కన్ను తిరిగి పొంది "కంటి, పొడగంటి" అని పాదాంతముగా నయనగతిరగడ రచించాడని హరి, హరకృపాపాత్రమైన వైనము ఈ క్రింది చాటు పద్యము వలన తెలుస్తోంది.

శ్రీ పార్వతీశు జూడక
పాపాత్ముడనై నరిగిన బథమున జక్షుల్
దీపించు దృష్టితొలిగిన
శ్రీపతి నడుగంగ చెప్పె శివు కర్తనుగాన్

పాల్కురికి సోమనాధుడు--చెన్న మల్లు సీసములు

ఇలా ఎందరో భగవత్క్రుపా పాత్రుల చాటువులు లెక్కలేనన్ని, ఒక గ్రంధమే రచించదగినన్ని ఉన్నాయి. పాల్కురికి సోమనాధ కవి జీవ సమాధి కేగుచు భూబిలము నేర్పరచుకున్నాడు. భూబిలములోనికి వెళ్ళడానికి ముప్పది రెండు మెట్లు దిగాడు. ఒక్కొక్క మెట్టు దిగుచు చెప్పిన సీస పద్యము చెన్న మల్లు సీసములుగా ప్రచారములో ఉన్నాయి. కర్ణాటకలో కలికెమను గ్రామమ్ములో ఉన్న శివాలయము సోమనాధుడు జీవన సమాధితో సిద్ధి పొందిన ప్రదేశముగా భావిస్తూ భక్తులు నేటికీ ఆలయ ఉత్సవాదులలో చెన్న మల్లుని సీసములు చదువుతారట. సర్వేశ్వరుని కృప పొందిన మహాకవి పాల్కురికి సోమనాధుడు.

చాటువులు---దేవతాస్తుతి

మానవ జీవితము కష్ట సుఖాల కాలవాలము. కష్ట కాలములో ప్రార్థించినంతగా ఇతర సమయాలలో అంత భక్త్యావేశముండదు. మిన్ను విరిగి మీదపడ్డంత కష్టకాలము దాపురించినపుడు పెల్లుబికిన భక్త్యావేశముకూడా కవితాగానమై అందరికీ ఆమోదయోగ్యమయ్యాయి. దాశరధి శతకము రచించిన రామదాసు చెరసాలలో "ఎవడబ్బ సొమ్మని----" అని కీర్తనలో నిలదీశాడు. అందుచేత దేవతా స్తుతి దుఃఖ విముక్తి ప్రధానంగా రచింపబడితే ప్రజాదరణ పొందుతాయి. నిందాగర్భస్తుతి కారణముగా దైవదూషణ చాటువులలో తొంగి చూచినా దేవతా స్తుతి లేని కావ్యము తెలుగు సాహిత్యములో లేదు. అందుచేత భగవంతుని గుణగణములు కీర్తించిన చాటు పద్యములు జనుల రసనపై నాట్యమాడుతున్నవి కొన్ని తెలుసుకుందాం.

వినాయకుడు మొదలు, త్రిమూర్తుల నుండీ గ్రామదేవతల వరకూ దేవస్తుతి పద్యములు ప్రచారమయ్యాయి. దేవతా స్తుతి పద్యములు కొన్నిటికి కవులెవరో తెలియకపోయినా పామరజనులు కూడా ఆదరించి ఆ కవులను అజరామరులను గావిస్తున్నారు.

తొండమునేక దంతమును తోరపు బొజ్జయు వామహస్తమున్
మెండుగ మ్రోయుగజ్జెలును, మెల్లని చూపులు మందహాసమున్
కొండొక గుజ్జురూపమున కోరిన విద్యల కెల్ల నొజ్జవై
యుండెడి పార్వతీ తనయ ఓయి గణాధిప నీకు మ్రొక్కెదన్

ఈ పద్యము రాని ఆంధ్రుడు, వినాయక చవితినాడు ఈ పద్యము చదివి "ఓ బొజ్జ గణపయ్య నీ బంటు నేనయ్య" అంటూ పూజ చేయని తెలుగు హిందూ కుటుంబమూ ఉండవంటే అతిశయోక్తి కాదు. మరో ప్రసిద్ధ వినాయక స్తుతి.

తొలినె యవిఘ్నమస్తనుచు దూర్జటినందన నీకు మ్రొక్కెదన్
ఫలితము చేయుమయ్య నాతలపంబడు కార్యకలాప మెల్ల నా
వలపలి చేతి గంటమున, వాక్కున నెప్పుడు పాయకుండుమా!
తెలివి ఘటింపుమా సతము దేవ వినాయక! లోకనాయకా!

<u>శ్రీ కృష్ణ స్తుతి:-</u> వినాయకుడి తరువాత శ్రీకృష్ణుని మీద పద్యాలు ఎక్కువగానే కనిపిస్తాయి.

చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ
బంగరు మొలత్రాడు పట్టుదట్టి
సందెతాయతులులును సరిమువ్వ గజ్జెలు
చిన్నికృష్ణా నిన్ను చేరి కొలుతు

బాలకృష్ణుని సొగసైన అలంకార వర్ణనతో సాగిన పద్యమిది. పసితనములో ఒకప్పుడు ఈ పద్యము నేర్పని తెలుగు తల్లికానీ, ఉపాధ్యాయుడు కానీ ఉండేవారు కాదంటే నేడు అతిశయోక్తిగా అనిపిస్తుంది. శతకపద్యాలు ఎన్నో చాటువులుగా ప్రసిద్ధికెక్కాయి. శతకము రాయకుండా కావ్య రచన చేసిన కవి ఉండడని పద్యప్రియుల నమ్మకము. ఆదికవి నన్నయ భారతములోని ఉదంకో పాఖ్యానములో నాగలోకములో ఉదంకుడు చేసిన స్తోత్రము శతక పద్య ఛాయలుగా భావిస్తారు. అలాగే తిక్కన కృష్ణ శతకము రచించాడని ప్రచారమైంది. కాలగర్భంలో కలిసిపోయిన తిక్కన కృష్ణ శతకములోని ఈ ప్రసిద్ధ పద్యము దేవతా స్తుతి చాటువునకుదాహరణ.

అరయన్ శంతనుపుత్రుపై విదురుపై నక్రూరుపై కుబ్జపై
నరుపై ద్రౌపదిపై కుచేలుని పయిం నందవ్రజస్త్రీలపై
బరగంగల్గు భవత్కృపారసము నాపై కొంత రానిమ్ము నీ
చరణాబ్జంబులు నమ్మినాడ! జగదీశా! కృష్ణభక్తప్రియా!

మరికొన్ని ప్రసిద్ధ పద్యములున్నాయి. కొన్ని దసరా పద్యాలుగా పూర్వకాలము గురువులు వల్లెవేయించేవారని అంటారు.

<u>నారాయణ స్తుతి :-</u>

ధర సింహాసనమై నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై
పరమామ్నాయములెల్ల వందిగణమై బ్రహ్మాండమాగారమై
సిరి భార్యామణియై విరించి కొడుకై శ్రీగంగ సత్పుత్రియై
వరుస న్నీఘన రాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా!
నారాయణ నీ నామము
నారాయణ వ్రాయవయ్య నా నాలుకపై

నారాయణ నిను నమ్మితి
నారాయణ కావవయ్య నారద వరదా!

ఇవి నేటికీ చాలామందికి నోటికి వచ్చు.

<u>శ్రీ రంగనాథ స్తుతి:-</u>

సింగపుమోమువాడు తులసీదామమువాడు కామినీ
రంగదురంబువాడు వలరాయని గాంచినవాడు భక్తికు
ప్పొంగెడు వాడు దానవుల పొంకమడంచెడువాడు నేడు శ్రీ
బంగరు రంగసాయి మనపాలంగలండు విచారమేటికన్

ఇలా ఇంకా మరిడి దేవత, సత్యవోలు భగవత్కవి రచించిన దశావతారారస్తవము అష్టదిక్పాలకులు, ఇతర దేవతలు కావేటి రంగడు----నిందా స్తుతి చాటువులు మొదలైనవి రసవత్తరమైన భక్తిభావ కవితలు. గ్రంధ విస్తర భీతి వంకతో ఉదహరింపలేకపోయినా సేకరించి చదువుకునే వారికి రసానుభూతిని కలిగించగలవని సవినయ మనవి. ఇక రాజాశ్రయ చాటు కవితను చూద్దాము.

# తెలుగులో చాటు కవిత్వం
# డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(9)

**రాజాశ్రయ చాటు కవిత**

పూర్వకాలంలో రాజులు, ధనవంతులు, సంస్థానాధీశులూ, జమిందారులు కవుల్ని విశేషంగా ఆదరించారు. కవిత్వాన్ని తమ జీవితంలో ఒక భాగంగా భావించారు. రాజ కొలువులో కవితాగోష్ఠిని పరిపాలనలో ఒక భాగంగా, ప్రాంతీయ విభేదాలకతీతంగా నిర్వహించారు. సన్మానాలు సత్కారాలు, కనకాభిషేకాలు జరిపించుకున్న కవులు, రాజ్యాలు పోయినా, ఆయా రాజుల్ని చిరస్థాయిగా నిలిచిపోయేలా చేసారు. రాజులు కృతులను స్వీకరించి కృతి భర్తలయ్యారు. ఒక్కో సందర్భంలో రాజులు కూడా కృతుల్ని రచించారు.
తమ యెడల ఆదరానాదరములు చూపిన ప్రభువుల స్వర్ణయుగానికి లేదా అక్రమ పరిపాలనకు కవుల చాటువులు సాక్ష్యంగా నిలుస్తాయి. కవులు దేశాటనము చేసిన సందర్భాల్లో తమకెదురైన దురాత్ముల దుండగపు పనులు, అక్రమ పరిపాలనా విశేషాలనే కాక సాధారణ ప్రజల జీవితాల్ని కూడా స్పృశించారు. దేశాటన చేసిన కవులు వ్రాసిన చాటువులలో నాటి సాంఘిక జీవనం కూడా మనకి కనిపిస్తుంది. పండితుల అహంకారము, పోటీలూ, ఒకరిపై ఒకరు చేసుకునే హేళనలు, కవిత్వ రసజ్ఞ ప్రసంగము - ఇలాంటివన్నీ రాజాశ్రయ చాటుకవితల్లో ప్రతిబింబిస్తాయి. ఇలా వర్ధిల్లిన తెలుగు సాహితీ స్వర్ణయుగం పద్యప్రియుల్ని రసానంద కందళిత హృదయారవిందులని చేస్తుంది .

**మహారాజులు - శ్రీనాధుడు**

*చిన్నారి పొన్నారి చిరుతకూకటి నాడు రచియించితి మరుత్తరాట్చరిత్ర*
*నూనూగు మీసాల నూత్న యౌవనమున శాలివాహన సప్తశతి నొడివితి*
*సంతరించితి నిండు జవ్వనంబునయందు హర్షనైషధకావ్య మాంధ్రభాష*
*ప్రౌఢనిర్భరవయః పరిపాకమున గొనియాడితి భీమనాయకుని మహిమ*
*ప్రాయమింతకు మిగులఁ గైవ్రాలకుండ*
*కాశికాఖండమను మహాగ్రంధమేను*
*తెనుగు చేసెద కర్ణాటక దేశకటక*
*పద్మవనహేళి శ్రీనాధభట్టసుకవి*

కాశీఖండము తెనుగు చేస్తూ తన పాండితీ ప్రతిభని సగర్వంగా చాటుకున్నాడీ పద్యంలో శ్రీనాధుడు. ఈ కాలంలోకూడా చాలామంది కవులు తమ కవిత్వరచనా పాండిత్య ప్రభావాన్ని చెప్పుకోడానికి ఈ పద్యాన్ని అనుకరిస్తారు. 15వ శతాబ్దానికి చెందిన శ్రీనాధుడు దేశాటన చేసి తన పాండిత్యంతో రాజస్థానాన్ని మెప్పించాడు. ఎంతో మంది పండితుల గర్వమణచి ఎన్నో సన్మానాలు పొందాడు, ఎన్నో అనుభవాలను సమకూర్చుకున్నాడు. అలాంటి వాటినన్నింటినీ చాటువుల రూపంలో అందించి ప్రజల మనసులలో నిలిచిపోయాడు. ఆ రోజుల్లో అయన దర్శించని రాజాస్థానం లేదు. రావు సింగ విభుని స్థానములో జయము కలిగించమని శారదప్రార్థించినపుడు చెప్పిన పద్యమిదిగో..

*దీనారటంకాల తీర్థమాడించితి దక్షిణాధీశు ముత్యాలశాల*
*పలుకు తోడైతాంధ్ర భాషామహాకావ్య నైషధగ్రంధ సందర్భమునకు*
*పగులగొట్టించితుద్భట వివాద ప్రౌఢి గౌడ డిండిమభట్టు కంచుఢక్క*
*చంద్రశేఖర క్రియాశక్తి రాయల యొద్ద పాదుకొల్పితి సార్వభౌమ బిరుద*
*మెటుల మెప్పించెదో నింకమీద*
*రావు సింగ మహీపాలు ధీవిశాలు*
*నిండుకొలువున నెలకొనియుండి నీవు*
*సరస సద్గుణ నికురంబశారదాంబ!*

## ప్రౌఢ దేవరాయలు - శ్రీనాధుడు

తన గురించి చెప్పుకుని సభ ఏర్పాటు చేయించమని డంబముగా అడిగిన కవులలో శ్రీనాధుడే ప్రథముడు. ఇంత డంబముగా అడిగిన కవులలో "ఏనుగు నెక్కినాము ధరణీంద్రులు మ్రొక్కగనిక్కినాము" అని పలికిన తిరుపతి వెంకటకవులు ఆధునికులుగా మరలా శ్రీనాధుని కాలాన్ని గుర్తుతెస్తారు.

ప్రౌఢదేవరాయల దర్శనము కోరుతూ తన సమర్థతను అతని ఆస్థాన కవులకు సవాలు విసిరిన ఈ చాటు పద్యము శ్రీనాధ పండితుని పాండిత్య అహంకారము మాటున దాగిన ఆత్మ విశ్వాసానికి ఋజువుగా నిలిచింది.

*డంబు సూపి ధరాతలంబుపై తిరుగాడు కవిమీద గాని నా కవచమేయ*
*దుష్ప్రయోగంబుల దొరకొని చెప్పెడు కవి శిరస్సుమీదగాని కాలుజాప*
*సంగీత సాహిత్య సరస విద్యలనేర్చు కవుల బొమ్ములుగాని కాల్చి విడువ*
*చదువు చెప్పగ నేర్చు సభయందు విలసిల్లు కవినోరుగాని వ్రక్కలుగదన్న*
*దంట కవులకు బలులైన దంటిమగడ*
*కవుల వాదంబు వినవేడ్క కల్గెనేని*
*నన్ను పిలిపింపు మాస్థాన సన్నిధికిని*
*లక్షణోపేంద్ర ప్రౌఢక్షితిరాయ!*

### శ్రీనాధుడు - ముమ్మసుకవి

ప్రౌఢరాయల స్థానములో ని ముమ్మసుకవితో శ్రీనాధుడు చెప్పిన పద్యమీచాటువు

*పంపావిరూపాక్ష బహు జటాజూటికారగ్వధప్రసవ సౌరభ్యములకు*
*తుంగభద్రాసముత్తుంగవీచీ ఘటాగంభీర ఘుమఘుమారాంభములకు*
*కళసాపుర ప్రాంత కదళీవనాంతర ద్రాక్షా ఫలస్తబకములకులతా*
*కర్ణాటకామినీ కర్ణహాటక రత్న తాటంక యుగధాళధళ్యములకు*
*నిర్నిబంధ నిబంధమై నెనయు కవిత*
*తెనుగునను సంస్కృతంబున బలుకనేర్తు*
*ప్రౌఢదేవేంద్రరాయ భూపాలవరుని*
*సమ్ముఖమ్మున నరజూడు ముమ్మసుకవి!*

కనకస్నానము చేయించమని రాయలనడిగిన పద్యమిదీ..

జననాధోత్తమ! దేవరాయనృపతీ! శ్రీవత్సలాం
ఛనసంకాశా! మహాప్రభావ! హరి రక్షాదక్ష! నా నోటికిన్!
గున్నపస్తోత్రసముద్భవంబయిన వాగ్ఘోషంబు శాంతంబుగా
గనకస్నానము చేసికాక పొగడంగా శక్యమే దేవరన్!

కనకస్నానము జరిపించాడు ప్రౌఢదేవరాయలు. శారదాదేవిని వాక్శుద్ధినిమ్మని కోరుతూ ఈ విధంగా ఆశీర్వదించాడు.

*జోటీ భారతి! యార్భటిన్ మెఱయుమీ చోద్యంబుగా నేనుగ*
*ర్ణాటాధీశ్వరు బ్రౌఢదేవనృపతిన్నాసీరధాటీచమూ*
*కోటీ ఘోటక ధట్టికాపురపుటీకుట్టాక సంఘట్టన*
*స్ఫోటీ ధూత ధరారజశ్చులికితాంభోటిం ప్రశంచించెదన్*

ఇలా సంస్కృత పదాడంబరముతో మహారాజులను తృప్తిపరచి ఆశీర్వదించెడివాడు.

### కస్తూరియాచన - తెలుగు రాయలు

శ్రీనాధుడు విలాసంగా జీవించాడు. దేశాటన సమయంలో సుగంధ ద్రవ్యమైన కస్తూరిని మహారాజులవద్దనుంచీ పదాడంబరముతో - కట్టుకునేలా శీర్వదించి తీసుకోవడమి తీసుకోవడము ఈ మహాకవి ప్రత్యేకత. సాంపరాయుని ఈ విధముగా కీర్తించాడు

*ధాటీఘోటక రత్న ఘట్టనమిళిద్రాఘిష్ఠ కళ్యాణ ఘం*
*టటంకార విలుంఠలుంఠిత మహాన్మత్తాహితక్షోణిభృ*
*త్కోటీరాంకృత కుంభినీ ధరసముత్కూటాటవీఝూటక*
*ర్ణాటంద్రాధిప సాంపరాయని తెలుంగా నీకు బ్రహ్మాయువౌ!*

అలానే  కస్తూరి ఘుమఘుమలు ద్రాక్షారామ అప్సరసల కుచద్వయముపై పరిమళిస్తాయని రాజుని మరింత సంతోషపరుస్తూ చెప్పిన ఈ క్రింది చాటువు తెలియని సాహితీప్రియులుండరు.

*అక్షయ్యంబుగ పాంపరాయని తెలుంగాధీశ కస్తూరికా*
*భిక్షా దానము సేయరా! సుకవిరాడ్బృందారకశ్రేణికిన్*
*ద్రాక్షారామ పురీ నివాస వర గంధర్వాప్సరోభామినీ*
*వక్షోజద్వయ కుంభికుంభములపై వాసించు తద్వాసనల్!*

# తెలుగులో చాటు కవిత్వం
## డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(9)

<u>రాజాశ్రయ చాటుకవిత - శ్రీనాథుడు</u>

**ఇతర రాజులు :--**

<u>సర్వజ్ఞ సింగని ఆస్థానము:--</u>

శ్రీనాథుడు పెదకోమటి వేమభూపాలుని ఆస్థాన విద్యాధికారి, ఒకసారి సర్వజ్ఞసింగ భూపాలుని కొలువుకు వెళ్ళి చెప్పిన ఈ క్రింది చాటువులో "సర్వజ్ఞ నామధేయము" శర్వునకు, రావు సింగ భూపాలునికి తప్ప ఇతరులకు చెల్లడము కుక్క సామజమేనని కీర్తించాడు. పెదకోమటి వేమారెడ్డి "నా ఆస్థానవాసివిగా ఉండి కూడా సర్వజ్ఞసింగనిని సర్వజ్ఞుడని కీర్తించుట నా కొలువును అవమానించినట్లవదా?" అని అడిగాడు. శర్వునకు తప్ప రావు సింగభూపాలునికి ఆ పేరు తగినదని చెప్పుకోవడము కుక్క సామజము వంటిదని నేను పరిహాసనిగూఢముగ చెప్పానని శ్రీనాథుడు సమర్థించుకున్న చాటువీ క్రిందది. పెదకోమటి వేమారెడ్డి పద్యములోని వ్యతిరేకార్థము గ్రహించి ఆనందపడ్డాడు.

సర్వజ్ఞనామధేయము
శర్వునకే రావు సింగభూపాలునకే
యుర్విం జెల్లును నితరుని
సర్వజ్ఞుండనుట కుక్కసామజమనుటే

**<u>సమస్యా పూరణ చమత్కారము</u>**

సింగ భూపాల ఆస్థానములోని ఒక భట్టుకవి 'కుక్కవొ, నక్కవొ, ఫణివొ, పిల్లివొ, బూతపిల్లివొ' - అనే సమస్యను ఇచ్చి పూరించమన్నాడు. శ్రీనాథుడు సమస్యనిచ్చిన భట్టునే సంబోధిస్తూ చమత్కారము చూపాడు. సమస్యా పూరణము తెలుగు కవులకు సవాలు వంటిది. నేటికాలములో కూడా ఇది సరసులను ఆకట్టుకుంటున్న కవితాప్రక్రియయే! కవులనేకులు సమస్యా పూరణములో మిక్కిలి చమత్కారమును చూపిన విధానము కృష్ణరాయల కాలము నుంచీ ఎక్కువగా కనిపిస్తాయి. మంచి దాతల పట్ల శ్రీనాథుని అభిమానమీ చాటువు.

తక్కక రావు సింగవసుధావరు డర్థుల కర్థమిచ్చుచో
దిక్కుల లేని కర్ణుని దధీచిని ఖేచరువేల్పుమ్రాను పెం
పెక్కిన కామధేనువు శిబీంద్రుని నెన్నెదు భట్ట! దిట్టవై
కుక్కవొ! నక్కవొ! ఫణివొ! కోతివొ! పిల్లివొ! బూతపిల్లివొ!

కొండవీటి అభిమానము

ఎన్ని రాజ్యాలు తిరిగి ఎందరు రాజులనాశ్రయించినా తాను కొండవీటి వాసినని శ్రీనాథుడు సగర్వంగా చెప్పుకున్నాడు.

పర రాజ్య పర దుర్గ పరవైభవశ్రీల--గొనకొనివిడనాడు కొండవీడు
పరిపంథిరాజన్య బలముల బంధించు--కొమరుమించిన బోడు కొండవీడు
ముగురు రాజులకు మోహంబు పుట్టించు--గుఱుతైన యుర్విఁతాడు కొండవీడు
చటువిక్రమకళా సాహసంబొనరించు--కుటిలాత్ములకుగాడు కొండవీడు
జవన ఘోటక సామంత సరస వీర
భటనటానేకహాటకప్రకటగంధ
సింధురారవ మోహన శ్రీలదనరు
కూర్మినమరావతికి జోడు కొండవీడు.

శ్రీనాథుని దేశాటనము--చాటువులు

శ్రీనాథుడు మహాకవి ఎదురులేని కవినని నిరూపించుకుంటూ నానారాజ సందర్శనము చేశాడు. ఈ దేశాటనములో రాజులనే కాక దేశ, స్థల, పురవర్ణనలు, స్త్రీల వర్ణనలు చేశాడు. కావ్య, ప్రబంధ శైలిగల ఈ చాటుపద్యములు తెలుగు పద్యప్రియముల మనసులను దోచుకున్నాయి. సాంఘిక చరిత్ర రచయితలకు శ్రీనాథకవి కాలము నాటి సాంఘిక చరిత్ర అవగాహనకు తోడ్పడ్డాయి.

పల్నాటి సీమ:--

శ్రీనాథునకు పల్నాటి సీమలో వరి అన్నము దొరకలేదు. నీరు దొరకలేదు. శృంగారము మాట దేవుడెరుగు, చూడ చక్కని యువతులు కూడా కనబడలేదు. ఎక్కడ చూసినా చిల్లర దేవుళ్ళు. రంభ కూడా ఏకులు వడకాలి. రాజు ఎద్దులు కట్టి మడి దున్నుకుంటున్నాడు. దాతలు సున్న అని పలనాటి పల్లెటూళ్ళను కవి ఈసడించుకుని చాటువులలో మనకందించాడు.

జొన్నకలి జొన్న యంబలి
జొన్నన్నము జొన్నపిసరు జొన్నలె తప్పన్
సన్నన్నము సున్నసుమీ
పన్నుగ పల్నాటి సీమ ప్రజలందరకున్

చిన్న చిన్న రాళ్ళు చిల్లర దేవుళ్ళు
నాగులేటి నీళ్ళునాపరాళ్ళు
సజ్జ జొన్న కూళ్ళు సర్పంబును దేళ్ళు
పల్లెనాటి సీమ పల్లెటూళ్ళు

రసికుడుపోవడు పల్నా
డెసగంగా రంభయైననేకులె వడకున్
వసుధేశుడైన దున్నును
కుమారస్తుండైన జొన్నకూడే కుడుచున్

అంగడియూరలేదు, వరియన్నము లేదు, శుచిత్వమేమిలే
దంగనలింపుగారు ప్రియమైన వనంబులు లేవు నీటికై
భంగ పడంగ జాలెడు కృపాపరులెవ్వరు లేరు దాతలె
న్నంగనుసున్న గాన పలనాటికి మాటికి పోవనేటికిన్

వరియన్న భోజనప్రియుడైన శ్రీనాధుడు జొన్న సంకటిని మాత్రము భరించలేకపోయాడు. ఒకరింట్లో వడ్డించిన జొన్నకూడు, బచ్చలి కూర తినలేక కృష్ణునితో ఇలా మొరపెట్టుకున్నాడు.

ఫుల్లన సరోజ నేత్ర! యలపూతన చన్నుల చేదు ద్రావి నా
డల్లదావాగ్ని మ్రింగితినటంచును నిక్కెదవేల తింత్రిణీ
పల్లవ యుక్తమౌనుడుకు బచ్చలి శాకము జొన్న కూటితో
మెల్లన యొక్క ముద్ద దిగమ్రింగుము నీపసగాన నయ్యేడిన్

శ్రీనాధుని కాలములో గ్రామ పురోహితులు తమ గ్రామానికి వచ్చిన ప్రముఖులను ఇంటికాహ్వానించి భోజనము పెట్టేవారు. అందుచేత తప్పనిసరిగా అట్టి ఘనుల ఆహ్వానమును తిరస్కరించలేక వెళ్ళవలసి వచ్చినపుడు ఒక గ్రామములో ఒక పురోహితుడింటి వాతావరణంలో వారి అసౌకర్య ఆతిథ్య మర్యాద ఏవిధంగా ఉందో జరిగిన అనుభవాన్ని చాటు పద్యంలో చెప్పకుండా ఉండలేకపోయాడు..

దోసెడు కొంపలో, పసులు త్రొక్కిడి మంచము, దూడరేణమున్
పాసినవంటకంబు పసిబాలుర శౌచము విస్తరాకులన్
మాసిన గుడ్డలున్ తలకు మాసిన ముండలు వంటకుండలున్
రాసెడు కట్టెలున్ దలపరాదు పురోహితులింటికృత్యముల్

కొంప చిన్నది. పశువులు, పేడ, రాసెడు కట్టెలు, నున్నటి బోడిగుండు మీద మొలుస్తూ, మొలుస్తున్నట్లున్న జుట్టులా ఆవరించి ఉన్న బొడిపెల కుండలలో వంట--ఆ పాసి వంట తినడానికి వడ్డించిన విస్తరి, చంటి పిల్లాడి విరోచన రంగులో ఉందని ఏవగింపు కలిగిస్తున్న నాటి పురోహితుల అశుభ్ర జీవన ఇంటి వాతావరణాన్ని చాటువుగా మనకందించాడు.------శ్రీనాధునికి పల్నాటి సీమలో గానీ, లేదా ఇతర ప్రాంత పర్యటనలోగానీ దాహము తీర్చగల మంచినీరు లభించక పోయుండాలి. ఈ క్రింది చాటువులో సిరిగలవాడైన విష్ణువు లక్ష్మితోబాటు పదహారు వేల మందిని ఏలుతున్నాడు. తిరిప మెత్తుకునే నువ్వు దయచేసి పార్వతితో సరి పెట్టుకుని నెత్తిమీది గంగను విడిచి పెట్టమని అడిగిన చాటువు ఈ క్రిందిది.

సిరిగలవానికి చెల్లును
గరితలు పదియారు వేల తగ పెండ్లాడన్
తిరిపమున కిద్దరాండ్రా
పరమేశా గంగ విడుము పార్వతి చాలున్

<u>ద్రావిడ భోజనము</u>

తొలుత వడ్డింత్రు దొడ్డమిర్యపుచారు బొగవెళ్ళి చిమ్మిరేగ
పలుతెబుంగులతోడ పచ్చళ్ళు చవిగొన్న బ్రహ్మారంధ్రము బారునావ
యవిసాకు వేచిననార్నెల్లు పసిలేదు పరిమళమొంచిన పండ్ల సొగచు

వేపాకు వెండించి వేసిన పొళ్ళను కంచానగాంచిన గ్రక్కువచ్చు
అరవవారింటి విందెల్ల నాగడంబు
చెప్పవత్తురు తమ తీరు సిగ్గులేక
చూడవలసెను ద్రావిళ్ళకీళ్ళుమేళ్ళు

చక్కటి భోజనము కోసము శ్రీనాథుడు అర్రులు చాచినట్లుగా దేశాటన పద్యాలు చెపుతున్నాయి. కర్ణాటక రాజ్యము వెళ్ళినపుడు రాజ దర్శనముకానప్పుడు చెప్పిన పద్యములో సరియైన భోజనము దొరకక పడిన ఇబ్బంది ఈ క్రింది పద్యము.

కుళ్ళాయుంచితి కోక చుట్టితి మహాకూర్పాసముందొడ్గితిన్
వెల్లుల్లిందిలపిష్టమున్మెసవితన్ విస్పష్టవడ్డింపగా
చల్లాయంబలిదావితన్ రుచులు దోషంబంచుపోనాడితిన్
తల్లీ కన్నడ రాజ్యలక్ష్మి దయలేదా! నేను శ్రీనాథుడన్

శ్రీనాథునికిష్టమైన భోజనము పూటకూటింటిలో దొరికేది కాబట్టే దేశాటన చేయగలిగాడని నిశ్చయముగా చెప్పవచ్చు. నచ్చని భోజనము గురించి చాటువులు గుప్పించిన శ్రీనాథునికిష్టమైన భోజనము ఒక పూటకూటింట్లో ఎలా ఉందో క్రీడాభిరామములో ఉంది. క్రీడాభిరామము శ్రీనాథుని రచనగానే భావిస్తున్నారు కానీ అది వినుకొండ వల్లభరాయ రచనగా వివాదములో చిక్కుకుంది. ఆ రోజులలో కప్పురభోగి అనే వరిబియ్యం అన్నంగా వడ్డించబడేది. లక్ష్మణ వజ్జల అనే పూటకూళ్ళవ్వ ఒక రూకకు పిండివంటలతో పెట్టిన రుచికరమైన భోజన వర్ణన ఈ క్రింది పద్యములో ఉంది.

కప్పురభోగి వంటకము కమ్మని గోధుమ పిండి వంటయున్
గుప్పెడు పంచదారయును కాచినయాలనే పెస
ర్పప్పును కొమ్మునల్లనటిపండ్లును నాలుగునైదునంజులున్
లప్పలతోడ క్రొంబెరుగు లక్ష్మణవజ్జలయింటరూకకున్

శ్రీనాథుడు మహాకవి. ఈశ్వరార్చన కళాశీలుడు. కానీ నాటికాలములో సహజమైన వేశ్యాలోలత్వమునకు అతీతుడని చెప్పడము దురభిమానమవుతుంది. సంపాదనలో వేశ్యార్పితముంది కాబట్టే కనకాభిషేకము చేయించుకున్న సొమ్ము దాచుకోలేకపోయాడు. వ్యవసాయము చేయవలసివచ్చింది. అందుచేత దేశాటనలో కనిపించిన సౌందర్యవతుల గురించి చాటువులు చెప్పాడు... వేశ్యావర్ణణ కావ్యాలలో కూడా ఉంది. అంతమాత్రమున శ్రీనాథుని పచ్చి శృంగారమును చాటువులలో ఉదహరించ తగ్గవే అయినావాటి కర్తత్వ వివాదము కూడా పరిగణలోనికి తీసుకోవాలి. ఇలాంటి చాటవులను శృంగారచాటువుల శీర్షికన ప్రత్యేకముగా ఉదహరించుకుని ఇతర కవులతో బాటు చదువుకోవాలి. అందుచేతనే ఆ చాటువులను ప్రస్తుతానికి విడిచి వేరే శీర్షికలో శృంగార చాటువుల్లో చేరుద్దాము. చెడ్డరాజుల పాలనలో ప్రజలకు కష్టాలు తప్పవు. పీడించడమే పరమావధిగా పెట్టుకున్న ఒడ్డె రాజులు మహాకవిని ఆదరించలేకపోయారు. సామాన్యులనే కాదు, పన్నుకట్టలేకపోతే ఆస్థాన కవిగా గౌరవించదగిన ఒక మహోన్నత వ్యక్తికి ఆశ్రయం కలిపించడానికి బదులు శిక్షించి ప్రజాహింసలో ఎంతటి హీన చరిత్ర మూట కట్టుకున్నారో ఆ మహాకవి చాటువుకు సాక్ష్యమై నిలిచారు.

కవిరాజు కంఠంబు కౌగిలించెను కదా----పురవీధి నెదురెండ పొగడదండ
ఆంధ్రనైషధ కర్తయంఘ్రియుగ్మంబున---తగిలియుండెనుగదా నిగళయుగము
వీరభద్రా రెడ్డి విద్వాంసు ముంజేత----వియ్యమందెనుగదా వెదురు గొడియ
సార్వభౌముని భుజాస్తంభమెక్కెంగదా-----నగర వాకిట నుండు నల్లగుండు

కృష్ణవేణమ్మ గొనిపోయెనింతఫలము---- బిలబిలాక్షులు తినిపోయె తిలలు పెసలు

బొడ్డుపల్లెను గొడ్డేటిమోసపోతి----- ఎటుల చెల్లింతు టంకంబులేడునూర్లు

ఏడునూర్లు పన్ను చెల్లించి శిక్ష తప్పించుకున్నాడో లేదో కానీ అవసాన కాల దురవస్థలో కూడా స్వర్గలోకపు కవులకు గుబులు పుట్టిస్తూ మరణిస్తున్నాని చెప్పుకుంటూ తన్నాదరించిన వారికిలా కృతజ్ఞతలు చెప్పిన రాజసము ఒక్క శ్రీనాథ కవిలోనే చూడగలమన్న ఈ చాటువు ఎప్పుడు చదివినా కవిసార్వభౌమునికి నివాళి అవుతుంది.

కాశికావిశ్వేశుకలిసె వీరా రెడ్డి--రత్నాంబరంబులే రాయడిచ్చు

రంభగూడె తెనుంగురాయరాహుత్తుండు--కస్తూరికే రాజు ప్రస్తుతింతు

స్వర్గస్థుడయ్యె విస్సన్న మంత్రి మరిహేమ-- పాత్రన్నమెవ్వని పంక్తికలదు

కైలాసగిరిపండెమైలారు విభుడేగి--- దినవెచ్చమేరాజు తీర్చగలడు

భాస్కరుడుమున్నెదేవుని పాలికరిగె -- కలియుగంబునని కనుండ కష్టమనుచు

దివిజ కవివరు గుండియల్దిగ్గురనగ--నరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి

శ్రీనాథుని తరువాత, తెలుగుభాష స్వర్ణయుగమైన రాయల సభలో చాటు కవిత ఎలా మనఃప్రియముగా ఉంటుందో చూద్దాము.

# తెలుగులో చాటు కవిత్వం
## డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(10)

సామాజిక జీవనాన్ని ప్రతిబింబించిన శ్రీనాథుని చాటువులు ఒకతరం నుండి మరో తరానికి మౌఖికంగానే ప్రచారమవుతూ ముద్రణా యుగానికి చిక్కాయి. అవి ఇన్ని అని లెక్క తేల్చడము కష్టసాధ్యము. డా.కోడూరి ప్రభాకరరెడ్డి ఆకారాదిక్రమంలో వాటన్నింటినీ "శ్రీనాథుని చాటువులు" పేరిట పుస్తకరూపంలో వెలువరించారు. అందుచేత ప్రసిద్ధము, అనామికము అని కాకుండా---- సారూప్యముగల చాటువులన్నీ ఒక చోట శీర్షీకరింపబడాలన్న ఆశయమే చాటుకవిత్వము సేకరించేవారికందరికీ ఉంటుంది... మనస్సును రంజింప చేయగల ప్రాచీన, ఆధునిక చాటుపద్య సేకరణ ప్రతి ఒక్కరూ చేయాలి. వేమన చెప్పిన ఈ క్రింది పద్యము చూడండి.

*నిక్కమైనమంచి నీలమొక్కటి చాలు*
*తళుకు బెలుకురాళ్ళు తట్టెడేల*
*చాటుపద్యమొకటి చాలదా ఇలలోన*
*విశ్వదాభిరామ వినురవేమ!*

నీలమణి నల్లగా ఉంటుంది. తళుకుబెళుకులతో తట్టెడు రాళ్ళు తెచ్చి ఇచ్చినా నీలమణినే ఎన్నుకుంటాము. పద్యాలలో చాటు పద్యము ఒక్కటి సేకరించినా నీలమణివంటిదే అందుచేత ఈ ముద్రణాయుగములో జనశ్రుతులుగా ప్రచారమైన చాటుకవిత, శ్రీనాథుని చాటువుల మాదిరిగా, శీర్షీకరింపబడాలన్నది నా ఆశయము. గుడి, చెరువు, వనము... శిథిలమైపోతాయి. పద్యము మాత్రము నశించదు అని గువ్వల చెన్నని నీతి ఈ క్రింది పద్యములో ఉంది. కృష్ణరాయల స్వర్ణయుగములోని చాటుకవితా సంపదను ఆస్వాదించేముందు ఈ నానుడి మరుపురానిది.

*గుడికూలును నుయి పూడును*
*వడినీళ్ళం చెరువు తెగును, వనమును ఖిలమౌ*
*చెడనిది పద్యం బొకటియె*
*కుడియెడమలకీర్తికన్న గువ్వలచెన్నా*

### <u>శ్రీకృష్ణరాయల సభ</u>

గంభీరత, స్థబ్ధత, వింతచెలువము, మధురసోయగము కలిగి--దేశభాషలందు తెలుగులెస్స అని నినదించిన ఆంధ్రభోజుని భువన విజయ సాహితిని తలచుకుని పులకించని తెలుగువాడుండడు. ఆంధ్ర సాహితీ సమరాంగణ చక్రవర్తి పాలించిన 1509--1530 కాలము చారిత్రికముగానేకాదు--సాహితీ స్రవంతి ఉత్తుంగతరంగాల తేలియాడించిన మధుర భావతీర గమ్యసోయగముగా కూడా మరపురాని

మధురానుభూతి. దక్షిణ భారతదేశమును ఏకచ్ఛత్రాధిపత్యముగా పరిపాలించిన మహారాజు శ్రీకృష్ణదేవరాయలు. ఆయన కొలువులోని సందేహము, వివాదాస్పదములైన కవికాలాదుల విషయాన్ని పక్కకు నెట్టి సరసహృదయ సాహితీలోకము-- ఆ అష్టదిగ్గజ కవి పోషక రత్నాకరుని "భువనవిజయమును" ఆధునిక సాహితీ రంగ స్థలము మీద నేటిమేటికవులు ప్రదర్శనగా రూపుదిద్ది భువన విజయ కవులను నేటికీ గుర్తుకు తేగలుగుతోందంటే చాటుపద్యములే ఆధారము.

**రాయలు -- గండపెండేరము:-**

రాయలు సంస్కృతాంధ్రపండితుడు. సంస్కృత కవులంటే అభిమానముంది. ఆదరించాడు కూడా. అయితే తెలుగును ఎవరు కించపరిచినా రాయలు సహించలేదు. కించపరచిన వారికి తగిన సమాధానము చెప్పిన కవికి గండపెండేరమిచ్చి సత్కరించాడు. కేవల సంస్కృత విద్వాంసుడు భువన విజయ సభలో "ఆంధ్రభాషామయంకావ్యమయోమయ విభూషణమ్ "అన్నాడు. అంటే ఆంధ్రభాషలో చేసిన కావ్యము 'ఇనుముతో చేసిన నగ' అని ఈసడించాడు. "సంస్కృతారణ్య సంచారి విద్వన్మత్తేభశృంఖలా" 'సంస్కృత భాష అనే సాహిత్య అరణ్యములో సంచరించే మదపుటేనుగును బంధించే సంకెల' ఈ తెలుగు నగే అవుతుందని పెద్దన లేచి సమాధానమిచ్చాడు. రాయలు ఆ సమాధానము విని ఒక బంగారు పళ్ళెములో పెట్టి గండపెండెరము తెప్పించాడు. ఆ తెలుగు కవిత్వాభిమాని అయిన రాజకవి తెలుగులో సంస్కృతాంధ్ర పండితులనిలా కవ్వించాడు.

ముద్దుగ గండపెండియరమున్ గొనుడంచు బహూకరింపగా
నొద్దిక నాకొసంగుమని యొక్కరు కోరగలేరొకో
(రాయల పద్యములోని మూడవ పాదానికి ఎదురుచూడకుండా పెద్దన మహాకవి లేచి)
పెద్దన బోలు పండితులు పృథ్విని లేరని నీవెరుంగవే
పెద్దన కీదలంచినను పేరిమి నాకిడు కృష్ణరాణ్ణుపా!

సభ నిరుత్తరమైంది. రాయలు రాజసంగా చూస్తుంటే "పూతమెఱుంగులుంపసరు పూపబెడంగులు చూపునట్టి--వాకైతలు? జగ్గునిగ్గునెనగావలెగమ్మునగమ్మనవ్వలెన్----" అని ఒక ఉత్పలమాలికలో ప్రశంసించాడు. రాయలు సంతోషముతో సింహాసనము దిగివచ్చి స్వయముగా తనే "ఆహా! ఆంధ్రకవితా పితామహా" అని పాదమునకు గండపెండేరము తొడిగి "ఏదీ! మరొకమాలిక చెప్పండి." అన్నాడు పెద్దనతో. రాయల గండపెండెర స్పర్శ పెద్దనకు రాజసము కలిగించి ఉండాలి. ఆ రాజసము సరసయుక్త పద్యమై రాయలచేతనే కాదు, కవుల నీరాజనమందుకున్న పద్యముగా ప్రచారమయ్యింది

నిరుపహతిస్థలంబు, రమణీ ప్రియదూతిక తెచ్చి క
ప్పురవిడెమాత్మకింపయిన భోజనముయ్యెలమంచమొప్పుత
ప్పరయు తెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరికిన గాక యూరకకృతుల్ రచియింపుమనంగశక్యమె!

ఏకాంతము, రమణీప్రియ దూతిక అందిస్తున్న తాంబూలము, మంచిభోజనము, ఊయల ఊపు, తప్పు ఒప్పులు తెలిసిన రసజ్ఞుల లేఖక పాఠకోత్తముల ప్రోత్సాహము, సమక్షము లభించినపుడే కృతిరాయగలనని సగర్వముగా చెప్పాడు. కాబట్టే ఆ మహారాజు ఆంధ్రకవితాపితామహుని తన ఏనుగుపై ఎక్కించుకున్నాడు. మనుచరిత్ర అంకితము తీసుకుని పల్లకీలో ఎక్కించి తాను స్వయంగా పురవీధులలో మోశాడు. రాయల నిర్యాణము తరువాత కూడా బ్రతికి ఉన్న పెద్దన, మహారాజు నిర్యాణాన్ని తలచుకుని ఆ సందర్భంగా మహారాజు చేసిన సత్కారాలను ఈ క్రింది చాటువులో తలచుకున్నాడు.

*ఎదురైనచో తన మదకరీంద్రము నిల్పి--కేలూత యొసగి ఎక్కించుకొనియె*

*మనుచరిత్రంబందుకొనువేళ పురమేగ--పల్లకి తనకేల పట్టియెత్తె*

*గోటకగ్రామాద్యనేకాగ్రహారంబు--లడిగిన సీమలయందునిచ్చె*

*బిరుదైన కవిగండపెండేరమునకీవ--తగుదనితానెపాదమునతొడగె*

*ఆంధ్రకవితాపితామహ! అల్లసాని---*

*పెద్దనకవీంద్ర! యనితన్నుబిల్చినట్టి*

*కృష్ణరాయలతోదివికేగలేక*

*బ్రదికియున్నాడ జీవచ్ఛవంబునగుచు*

<u>పెద్దన సమస్యాపూరణము:-</u>

పెద్దన ఆంధ్రకవితా పితామహుడు. మాలికా రచన ప్రతిభతో ఈనాటికవులకు కూడా స్ఫూర్తి నింపాడు. ఆశుకవిత్వముతోబాటు, సమస్యాపూరణముకూడా రాయలకాలములో మంచిఖ్యాతినందింది. అయితే ఇంతటి గొప్పకవినీ కూడా తెనాలి రామకృష్ణుడు అమవసనిసికిన్ అని ప్రయోగించినందుకు ఆక్షేపించాడు. రాయలిచ్చిన సమస్య - పూరణ, దానికి రామలింగని ఆక్షేపణము ఈ క్రింది రెండు చాటువులు. రాయల భువన విజయములో కవిత్వ ప్రసంగ సమయాన ఎంతటి మహాకవినైనా తప్పుపట్టేవారని ఈ చాటువులు నిరూపిస్తాయి.

సమస్య:- <u>కలనాటిధనములక్కఱ</u>

<u>కలనాటికి దాచ కమల గర్భునివశమా!</u>

పూరణ: నెలనడిమినాటి వెన్నెల

అలవడునె గాదెపోయ <u>నమవసనిసికిన్</u>

ఎమితినిసెపితివికపితము

బ్రమపడి వెరిపుచ్చకాయ వడిదిని సెపితో

యుమితెక్కయదిని సెపితో

యమవసనిసి యన్నమాట యలసని పెదనా!

<u>రాయలు---రామలింగడు:-</u>

పెద్దన వంటి కవినే ఆక్షేపించిన రామలింగడు రాయల ప్రశంశలకు గురయ్యాడు. కానీ ఆ వికటకవి అహంకారముతో పేట్రేగిపోయి ఇతరకవులు సమస్యలిస్తే తిట్టుకవిగా మారేవాడు. అప్పుడు రాయలు మందలించాడని, కోపించాడని చాటువులున్నాయి... కానీ వెనువెంటనే మళ్ళీ తనదైన శైలిలో పూరించి ప్రశంసలందుకునేవాడు. ఇవి కట్టుకథలే!. కానీ దూషణ, భూషణ, తిరస్కార చాటువులుగా కవుల వైషమ్యాలను బయటపెట్టాయి. రామలింగనికి భట్టుమూర్తి అంటే కిట్టదు. భట్టుమూర్తి ఒకసారి సభలో "కుంజరయూథంబు దోమకుత్తుక సొచ్చెన్" -- అని సమస్యనిచ్చాడు. దానికి సమాధానముగా ఈ విధంగారామలింగడు తిట్టాడు.

*గంజాయి త్రాగి తురకల*

*సంజాతులగూడికల్లుచవిగొన్నావా?*

*లంజల కొడకా! ఎక్కడ*

*కుంజరయూథంబు దోమకుత్తుకసొచ్చెన్*

రాయలు కోపము పట్టలేక తనే ఆ సమస్యనిచ్చినట్లుగా భావించి పూరించమన్నాడు. రామలింగడు కాళీవరప్రసాదుడని లోకవాడుక. అతడీ క్రిందివిధంగా సమస్య పూరించి రాయల బహుమతినందుకున్నాడు.

*రంజనచెడి పాండవులరి*

*భంజనులై విరటుకొల్వపాల్పడిరకటా!*

*సంజయ! ఏమని చెప్పుదు*

*కుంజరయూథంబు దోమకుత్తుక సొచ్చెన్*

దోమ కుత్తుకలో ఏనుగు దూరడమేమిటని ప్రశ్నించిన రామలింగడు---విరటుని కొలువులో పాండవులు చేరడమటువంటిదేనని ప్రతిభావంతముగా పూరించాడు. ఇతనికి భట్టుమూర్తిపై ద్వేషమున్నట్లుగా చాటువులు ప్రచారమయ్యాయి. రామలింగడు కానీ, భట్టుమూర్తికానీ రాయల కొలువులోలేరు. ఆ ఇద్దరు గొప్పకవులు. కానీ రామకృష్ణుడు బ్రాహ్మణాహంకారముతో భట్టుకవిని శూద్రకవిగా ద్వేషించాడని చాటువులు పుట్టడం విచారకరం. రామలింగడు కవితాప్రతిభతో కృష్ణదేవరాయలపై చెప్పిన అనేక చాటువులున్నాయి. అంతేకాదు అతనికి మహాకవులపై అభిమానముంది. తనను నీటికాకితో పోల్చుకుని మహాకవుల పట్ల తన గౌరవాన్ని ఈ క్రింది చాటువులో చాటుకున్నాడు. కవి అంటే 'నీటికాకి' అని కూడా అర్థము.

*కవి అల్లసాని పెద్దన*

*కవి తిక్కన సోమయాజిగణుతింపగా*

*కవి నేను రామకృష్ణుడ*

*కవియను నామంబు నీటికాకికి లేదే!*

వికటకవిగా పేరుపొందిన ఈ మహాకవి పాండురంగమహాత్యమును ప్రౌఢకావ్యమును రచించాడు. ఈ మహాకవి రాయల అష్ట దిగ్గజకవులలో లేడని నమ్మితే, రాయల భువనవిజయకీర్తికి ఆయన చెప్పిన విఖ్యాత చాటుపద్యాలు సరసతను కోల్పోతాయి. అందుచేత రాయల ఆస్థానకవిగా రామలింగడు చెప్పిన పద్యాలను చాటువులుగా ప్రచారమైనవి తెలుసుకుందాం. తెనాలి రామలింగడు లేదా తెనాలి రామకృష్ణుడు---ఈ ఇద్దరినీ లోకము ఒకరిగానే పరిగణించింది. కృష్ణరాయని కీర్తించిన రామకృష్ణుడు చెప్పిన పద్యాలు చూద్దాము

*నరసింహ కృష్ణరాయని*

*కరమరుదగుకీర్తియొప్పె కరిభిద్గిరిభి*

*త్కరి కరిభిద్గిరిభి*

*త్కరికరిభిద్గిరిభిత్తురంగ కమనీయంబై*

కృష్ణదేవరాయల కీర్తి తెల్లగా మనోహరంగా - శివుడు, ఐరావరము, కైలాసము, వజ్రాయుధము, నంది, ఉచ్ఛైశ్రవముల తెలుపుకు సాటిగా ఉందని కవి చెప్పాడు. ఆ ప్రకారమే పద్యాలలోని పదాలలోకి అర్థాలు విడదీసుకోవాలి కరిభిత్---శివుడు (గజాసురుని చంపినవాడు),---- గిరిభిత్ (పర్వతాలను ఛేదించిన ఇంద్రుని యొక్క), ---కరి-- ఇంద్రుని ఐరావతము,

కరిభిత్(శివుని)--కైలాసగిరి,--గిరిభిత్ (కొండలను ఛేదించినది) వజ్రాయుధము

కరిభిత్, గిరిభిత్, తురంగ--- శివుని, ఇంద్రుని తురంగములంటే వాహనాలు నంది, ఉచ్ఛైశ్రవమునే గుఱ్ఱము రాయల కీర్తి వలె మనోహరమైన తెల్లదనానికి ఉదాహరణలు.

కరిభిత్---గిరిభిత్--- కరిభిత్గిరి-- గిరిభిత్---- ----కరిభిత్, గిరిభిత్ తురంగ అని చదవాలి

శివుడు ---- ఐరావతము-- కైలాసము --- వజ్రాయుధము -- నంది, ఉచ్ఛైశ్రవము.

***

# తెలుగులో చాటు కవిత్వం
## డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(11)

కృష్ణరాయల సభలో భువనవిజయ ఆస్థాన కవులు ఎంత సమర్థులైనా చాటుకవిత పద్యాలు మాత్రము రామలింగని ప్రసక్తి లేకుండా సాగవు. అది గౌరవమును ఇనుమడింప చేసినా లేక వెటకారాన్ని లేదా చమత్కారాన్ని నింపుకున్నా రామకృష్ణుని దేనని ప్రచారము పొందాయి. ఒకే పదానికి నానార్థాలు గోచరించే పునరుక్తి కలిగినపాదాలతో చాటుపద్యాలు రామలింగడు చెప్పగలడు. కృష్ణరాయలను కీర్తిస్తూ పునరుక్తి కలిగిన నానార్థాల పదాలు కలిగిన నాలుగు పాదాలు చెప్పిన ఈ క్రింది చాటు పద్యము కూడా రామలింగనిదిగా చాలా ప్రసిద్ధము.

అబ్జముకీమనోజ!నరపాధినందన!కృష్ణ! నీయశం
బబ్జకరాబ్జజాబ్జయనాబ్జవిలాసము నీ పరాక్రమం
బబ్జకరాబ్జజాబ్జయనాబ్జవిలాసము నీవిహాపితం
బబ్జకరాబ్జజాబ్జయనాబ్జ విలాసము చిత్రమిద్దరన్

అబ్జముఖీమనోజుడవైన నరసాధిపనందనా! కృష్ణదేవరాయా!...

1: నీయశము---

**అబ్జ,-కర,అబ్జజాబ్జ నయన,-అబ్జ- విలాసము--**

**(అమృతము, వడగండ్లు, బ్రహ్మ భార్యయగు సరస్వవతి, శంఖము, లనుమిచిన అందము)**

2: నీ పరాక్రమము---

**అబ్జ,-కర,-జ,-అబ్జయన,-అబ్జ.విలాసము-**

**(అగ్ని, శివుని చేతియందుగల, అగ్నికి, పుట్టీన కుమారసావి, పుండరీకాక్షుడు, అర్జునుడు: మించిన సోయగపు విలాసము)**

3:కృనీ విహాపితము (దానగుణము)---

**అబ్జకర,-అబ్జ,-నయన-అబ్జ,-వి,-లాసము**

**(సముద్రములలో గొప్పదైన పాల సముద్రము. సూర్య సుతుడు కర్ణుడు, నిధులను, పొందిన కుబేరుడు, చంద్రుడు, మొదలైన వారిని మించి ఎక్కువగా విలాసము, గ్రహించుటకు స్థానమైనది)**

కీర్తి:- అమృతము, వడగండ్లు, సరస్వతీదేవి, శంఖములకంటే అందమైనది, పరాక్రమము:- అగ్ని, శివుని చేతి యందు నిలిచిన అగ్ని నుండి పుట్టిన కుమారస్వామి, పుండరీకాక్షుడైన నారాయణుడు, అర్జునుడు మొదలైన వారి విలాసమై ఒప్పింది. దానగుణము:---పాలసముద్రము, కుబేరుడు, చంద్రుడులను మించి గ్రహించ గల సంపదలకు స్థానమైనది

ఇలాగా

'రాజనందనరాజ రాజాత్మజులుసాటి - తలపనల్లయవేమధరణిపతికి' అంటూ శ్రీనాధుని అల్లయ వేమారెడ్డి మీద చెప్పిన నాలుగు సీసపద్యపాదములు - అమీర 'భావభవభోగసత్కళాభావములను' అనే తేటగీతి నాలుగు పద్యపాదములు కలిగిన ఒక చాటు పద్యములు ప్రచారములో ఉంది. ఇది కృష్ణరాయల సభలో ఒక కవి చదివి ప్రతి పాదములోని అర్ధము చెప్పమంటే పెద్దనాదికవులు తెల్లముఖము వేశారని చెపుతారు. నాలుగు సీసపాదాలు, నాలుగు పాదాల తేటగీతి ఎత్తుగీతి పునరుక్తితో నార్ధాలు పదాలలో వెతికితే ఈ పద్యతాత్పర్యమిలా ఉంటుంది.

మొదటి పాదంలో బుద్ధి, ఐశ్వర్యము, వైభవము, సత్కళలయందు-- బుధుడు, ఈశ్వరుడు, దేవేంద్రుడు, బ్రహ్మామాత్రమే అల్లయవేమారెడ్డి సాటిరాగలరు.

రెండవ పాదములో క్రియ, ధనము, పరిపాలన సత్కళాభావ సమూహములు మొదలైన వాటిలో మనోహరుడైన శివనందుడు కుమారస్వామి, కుబేరుడు, రఘువు కొడుకైన అజుడు చంద్రుడును అల్లయ వేమారెడ్డికి సాటి అవుతారు.

మూడవ పాదములో ఆత్మజ్ఞానమందు, పుట్టుక యందు, అభివృద్ధి ప్రణాళికల యందు, బంగారు వంటి కాంతి కలిగిన బ్రహ్మ కుమారుడు సనత్కుమారుడు, శ్రేష్టుడైన బ్రహ్మకు పుట్టిన వసిష్టుడు, బృహస్పతికి పుట్టిన కచుడు అల్లయ వేమ ధరణి పతికి సాటి అవుతారు.

నాల్గవ పాదములో ఆకారమునందు, సంసార సౌఖ్యములలోను, సౌందర్య భావ విహారములలోను ఎన్నదగిన మన్మధుడు. మన్మధుని కుమారుడైన అనిరుద్ధుడు. సర్వవ్యాపకుడైన విష్ణువు, నలకూబరుడు అల్లయ వేమధరణిపతికి సాటిరాగలరు.

అయితే పై విధముగా పునరుక్తితో ఒకేలా ఉన్న అన్ని పాదాలులోని నానార్ధములు వెతికి పట్టుకునే ప్రతిభ తరువాతి కాలములో తిరస్కారానికి గురయింది. రాయల సభలో అటువంటి మేధావి కవులను రాజు దృష్టిలో పడకుండా కవులు ఆ ప్రక్రియను నిరోధించారనడం కన్న ప్రోత్సహించలేదు అని నాకనిపించింది. శ్రీనాధ కవి కాలమును గుర్తు తేగల ప్రతిభగల ఆ కవిని రామకృష్ణుడు తరిమి కొట్టడానికి తోఇకవుల అభ్యర్ధన మీద వికత కవిత్వముతో ఈ క్రింది చాటువును చెప్పాడని ప్రచారము జరిగింది. శ్రీనాధుని కాలమునాటి రాజుల మెప్పుకోసము చెప్పబడిన ఈ నానార్ధపునరుక్తి చాటు పద్యపాద ప్రక్రియ హేళనకు గురయింది కనుకనే ఈ క్రింది చాటువు ఉదాహరణగ రామకృష్ణునికి అంటగట్టారు.. మేకతోకకు వెనకాల మేక-- తోకమేక వెనకాల మేక-- ఇలా ఒక మేకల మంద వరుసను కొంటెతనంతో సీసపద్యములో రచించి పండితుడు అర్ధము చెప్పలేక పారిపోయే పరిస్థితి కలిగించాడని కథనం.

మేకతోకకు మేక తోక మేకకు మేక---మేకతోకకు తోక తోకమేక
మేక తోకకు మేక తోక మేకకు మేక--- మేకతోకకు తోక మేక
మేకతోకకు మేక తోక మేకకు మేక---- మేకతోకకు తోక తోకమేక
మేక తోకకు మేక తోకమేకకు మేక--- మేకతోకకు తోక తోకమేక
మేకతొాకతోక తొాకతోక తోకమేక
మేకతొాకతోక తొాకతోక తోకమేక
మేకతొాకతోక తొాకతోక తోకమేక
మేకతొాకతోక తొాకతోక తోకమేక

శ్రీకృష్ణదేవరాయలు అపర భోజుడు. కవి అనిపించిన ప్రతి వ్యక్తికి రాజుతోపాటు సామాన్య పౌరుడు కూడా ఆ స్వర్ణయుగములో నీరాజనాలు పట్టారు. ప్రతిభమాటున అప్రతిష్ఠ పాలు చేసే కుకవిని భువనవిజయ సభలోకి అడ్డుకుందుకు, తమప్రతిభ

మసకబారిపోకుండా అష్టదిగ్గజ కవులు చేసిన ప్రయత్నాలకు ప్రజామోదము లభించింది. అందుచేతనే వికటకవి గౌరవప్రదమైన స్థానంలో చాటుపద్య కవిత కథలలో జీవించాడు. ఆ కవి రామకృష్ణుడని లోకం నమ్మింది. రామకృష్ణుడు చేసిన అల్లరిని మరికొన్ని పద్యాలలో చూద్దాం.

ప్రెగడ నరసరాజు---రామలింగడు:-

ప్రెగడ నరసరాజు పెద్దనను మించిన ఆశుకవి. గంటకు ఆశువుగా కొన్ని వందల పద్యాలు చెప్పగలడు. ఎదుటివాడు ఎంత కఠిన ఉచ్చారణ సమాస భరిత పద్యాన్ని చదివినా గంటమునంతే వేగముతో కదిలించి ఆపకుండా రాయగలడు. అందుచేత వ్రాయసకాడు అనే బిరుదు పొందాడు. ఈ ప్రతి భకు రాయలతన్ని సన్మానించి పంపును. కానీ నరసరాజు ఒక విషయం మరచిపోయాడు. రాయలు స్వయంగా పల్లకీని ఎత్తుపట్టి, గండపెండేరము తొడిగిన పెద్దనకంటే గొప్పవాడినని భావించాడు, పైగా భువన విజయకవుల ఎవరి కవిత్వములోనైనా సరే తప్పులు పడతానని వ్రాయడంలో తనను మించిన వేగము ఎవరికీ లేదని జయప్రతికనాశించి జబ్బ చరిచి సభ చేయించమన్నాడు, ఆ అహంకారము భువన విజయము సహించలేకపోయింది. 'ప్రెగడ నరసరాజుకు రామలింగడు ఉజ్జీగా నిలబడ్డాడు. వందల పద్యాలక్కరలేదు. ఈ ఒక్క పద్యమును ఆగకుండా రాయమని వికట కవి చిత్రోచ్చారణ చేసి పద్యమును చదివాడు. నరసరాజు చిత్రోచ్చారణను రాయడానికి చాలాసేపు ఆలోచించి ఈ క్రింది విధముగా రాశాడు.

తువ్వటబాబాతలపై
బువ్వట జాబిల్లివల్వబూచతదే
బువ్వట చూడగహుళు
క్కవ్వట తలపంగనిట్టి హరునకు జేజే!

రాయడంలో జరిగిన ఆలస్యముతో నరసరాజుకు వ్రాయసకాడన్న బిరుదు పోయింది.

**రామలింగడు తప్పు పట్టమని ఇచ్చిన పద్యము**

గననీహారగురామపద్మధళరంగత్కీర్తిచానూరమ
ర్ధన శుక్రాక్షికళేబరాగ్ణ్మగపతీత్రైలోక్యదామోదరా
యనగాశంకరవాంఛితార్థికృపదివ్యాస్తోకపాణీజనా
ర్ధననానేకవైరినిగ్రహముకుంధామిత్రవింధాధిపా!

**నరసరాజు పై పద్యములోని గీటులను తప్పులని చూపి సవరించిన పద్యము**

నరసరాజు రామలింగని పద్యములోని తప్పులను ఎత్తి చూపి ఈ క్రింది విధముగా పద్యాన్ని తిరిగి చెప్పాడు

ఘననీహారుడురాము పద్మదళరంగర్కీర్తిచాణూరమ
ర్ధనశ్రీకాక్షికళేబరాగ్ణ్మగపతీత్రైలోక్యదామోదరా!
యనఘా శంకరవాంఛితార్థకృపదివ్యాసోక్తపాణీజనా
ర్ధనవానేకవైరిని విగ్రహముకుందామిత్రవిందాధిపా!

కానీ రామకృష్ణుడు ప్రెగడ నరసరాజు స్వరించిన తప్పులకు అర్థాలు చెప్పి ఔననిపించుకున్నాడు. తన తప్పులతడక పద్యానికి అర్థము చెప్పాడు "ఓ! కృష్ణా! నీవు మంచి కీర్తికలవాడవు. స్తోత్రము చేయువారి యొక్క హితమును కోరి మృత్యువును దూరముగ తోలివైచెదవు" అని తన పద్యానికి అర్థము చెప్పగానే నరసరాజు తల వాల్చాడు. కానీ తెనాలి రామకృష్ణుడు నిగ్రహము కోల్పోయి ఈ క్రింది పద్యాలలో దూషించాడని చెపుతారు.

ఒకని కవిత్వమందెనయు నొప్పులు తప్పులు నాకవిత్వమం
దొకనికిదప్పుపట్టపని యుండదు కాదని తప్పు పట్టినన్
మొకమటుక్రిందుగా దిగిచి ముక్కలువోవనినుంపకత్తితో
సికమొదలంటగోయుదును చెప్పున కొట్టుదు మోముదన్నుదున్

తెలియనివన్నిదప్పులటంచును దిట్టతనాన సభాంతరంబులం
పలుకగరకురోరి పలుమారుబిశాచపుబాడెకట్ట! నీ
పలికిన నోటదుమ్ముపడ భావ్యమెరుంగవు పెద్దలైనవా
రల నిరసింతువా ప్రెగడరాణ్ణరపా!విరపా!తుపాబుసా!విసా!

రామలింగడు దూషించినా తప్పుపట్టక భువన విజయ సాహితీ విజయముగా ఈ చాటువులు మిక్కిలి ప్రీతి పాత్రముగ రామలింగని పేరు తలుచుకుంటూ చదివి గర్వపడకుండా ఉండలేకపోతున్నాము. రామలింగడు బూతులు మాట్లాడినా సమర్ధించగలడన్న ఖ్యాతినిచ్చాము. రామలింగడు బడబానలభట్టనే కవికి హేళనగాకుశలవులలోని "లవుడా" అనే పదాన్నిచ్చి పద్యము చెప్పమన్నాడు. అది బూతు పదముగా భావించి నొచ్చుకుని తనను అవమానించినట్లున్న రామలింగని ప్రవర్తనను బడబాబలభట్టు రాయల దృష్టికి తెచ్చాడు. నేనే ఆ పదమిస్తే ఎలా పూర్తిచేస్తావని రాయలు రామలింగని పిలిపించి అడిగాడు

ఆతురపడి యెదురించితి
వాతతబలశాలిరాముడనెతనయునితో
సీత రఘురాముసదృశుని
జూతుమె <u>లవుడా</u> యటంచు సూక్తులువలికెన్

రాయల మందలింపులకు గురికాకుండ తప్పించుకున్న మరికొన్ని చాటువులను చుద్దాము.

# తెలుగులో చాటు కవిత్వం
## డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(13)

<u>ధూర్జటి మహాకవి -- కవనమాధురి</u>

తెనాలి రామలింగడు అష్టదిగ్గజకవులలో ఒకడు కాదన్నది విమర్శకుల అభిప్రాయము. కానీ వికటకవిగా రాయల ఆస్థాన కవిగా ప్రచారమైన రామలింగని కథలు చాటువులై రాయలకాలమునాటి సాహిత్య గోష్టికి రసహృదయాన్ని ఆవిష్కరిస్తాయి. కాళహస్తీశ్వరమహాత్యము వంటి గొప్ప రచన చేసిన దూర్జటి మహాకవిని భక్తుడు కాదని ఎవరూ అనలేరు. కానీ ప్రతి కవికీ బలహీనతలుంటాయి. వాటిని ఎవరూ కప్పి పుచ్చలేరు. పొగడుతూనే హేళనగా ఆ విషయాన్ని బయట పెట్టడము తెలుగు కవుల ప్రత్యేకత. ధూర్జటి మహాకవికి వేశ్యాలోలత్వముంది. రాయలు ఒక సమస్య నిచ్చి రామలింగని పూరణముద్వారా ఆ విషయాన్ని సరసముగా నొచ్చుకుకుండా నిండు సభలో బయట పెట్టించాడని ఈ క్రింది చాటువు ప్రచారములో ఉంది. వేశ్యల అధరామృత రసధారలు గ్రోలిన ధూర్జటికి అందరినీ మెప్పించ గలిగిన కవితామాధురి అలవడిందట!

స్తుతిమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేల కల్గెనో<br>
అతులిత మాధురీ మహిమ?............ (అని కృష్ణరాయలు)<br>
(రామలింగడు అందుకుని)<br>
-------------------హా! తెలిసెన్ జగదేకమోహనో<br>
ద్ధత సుకుమారవారవనితా జనతాఘునతాఘనతాపహారిసం<br>
తత మధురాధరోదిత సుధారసధారలు గ్రోలుటంజుమీ!

**సరయుత సమస్యాపూరణలు**

**తిరుమలాంబ**

ధూర్జటి కవి వారవనితాపేక్ష నిజమని కాని అబద్ధమని కాని చెప్పే ఆధారాలు లేవు. కానీ రాయల కాలములో వేశ్యావృత్తి ఉండేది. అందుచేత సమస్యాపూరణములు శృంగారపరంగా సాగేవని చెప్పవచ్చు. తిరుమలాంబ రాయల కుమార్తె. కవులనాదరించడములో ఆమె నిర్వహించిన పాత్ర అమోఘం..! రాయలకాలంలో కవులకు గౌరవుండేది. కవినని చెప్పుకునేవారికి పద్యమడిగి రాయించుకుని మరీ ఒక దీనారమేనా ఇచ్చి సత్కరించి సామాన్యులు కూడా తమ ప్రభువు సాహిత్య పోషణ ఔదార్యానికి ఉడతా భక్తిని చాటారు. రాయల దర్శనము దొరకక ఒక కవి విసిగిపోయి తాను రాసిన పద్యాలను అమ్ముకుని జీవించాలని తలచి అందమైన స్త్రీ నడుమును వర్ణిస్తూ "ఒత్తుకుని ముందుకు వచ్చిన కుచద్వయ ఉన్నతిని చూసిన నడుము ఉద్ధతుల మధ్య నావంటి పేదది ఉండలేదని సన్నబడిమాయమైపోయింది" అనే అర్థములో ఒక చాటుపద్యాన్ని రచించాడు. ఆ పద్యాన్ని ఒక దీనారానికి అమ్మాడు. తిరుమలాంబవద్దకు

ఆ పద్యము చేరింది. సమయము చూసి రాయలకా పద్యాన్ని చేరవేయాలని ఎదురు చూసింది. గొప్ప కవులకు దొరికినట్లుగా సామాన్య కవికి కూడా ఆశ్రయము లభించి తీరాలి. రాజుననుకరించి ప్రజలు కవుల పద్యాలను కొని సత్కరించి ఔదార్యము చూపారు. అందుచేత రాజు ఉత్తచేతులతో కవి అన్నవాడు తిరిగి పోకుండా తగిన శ్రద్ధ వహించాలని రాయలకు తెలియచేయాలని తలచింది. రాయలతో కలిసి చతురంగము ఆడుతున్న సమయములో ఆమెకా అవకాశమొచ్చింది. తిరుమలాంబ చతురంగపు బంటు చతురంగపు మంత్రికి, ఏనుగుకు మధ్య చిక్కింది. "ఉద్ధతుల మధ్య పేదలకుండతరమె" అని బంటును దృష్టిలో పెట్టుకుని పలికింది. రాయలు మెచ్చుకుని సందర్భము తెలుసుకుని కవిని సన్మానించాడు. ఆ చాటువీక్రిందిది.

ఒత్తుకుని వచ్చు కటికుచోద్వృత్తి జూచి
తరుణి తను మధ్య మెచటికో తొలగిపోయె
నుండెనేనియు గనపడకున్నె! యమహా!
యుద్ధతుల మధ్య బేదలకుండతరమె!

కాని ఈ పద్యము సంకు సాలనృసింహకవి రచించిన కవి కర్ణరసాయనము మూడవ ఆశ్వాశములో ఇరవై ఆరవ పద్యముగా ఉంది. ఇద్దరు చిత్రకారులు విమలాంగి అనే రాజకుమారి చిత్రపటమును వర్ణించునపుడు చెప్పిన పద్యమిది.

<u>వాకిట కావలి తిమ్మన</u>

ముక్కుతిమ్మన, పెద్దన్న, భట్టుమూర్తి, రామలింగకవులు భువనవిజయ సభాప్రవేశము చేస్తున్నారు. వారికి వాకిటి కావలి తిమ్మన నమస్కరించాడు. కవులు పద్యములోనే పలకరించారు. రామలింగడు మాత్రము వాకిటి కావలి తిమ్మని సన్మానించమనే అర్థములో పలకరించాడు. చూడండి ఈ క్రింద చాటువు

పెద్దన పలకరింపు --------వాకిటి కావలి తిమ్మా!
తిమ్మన మెచ్చికోలు---------- ప్రాకటముగసుకవి వరుల పాలిటిసొమ్మా!
భట్టుమూర్తి ఆదరణ------- నీకిదెపద్యముగొమ్మా!
రామలింగని చమత్కారము ------నాకీపచ్చడము చాలు నయముగనిమ్మా!

తనపేరుతో నలుగురు కవులు పలకరించి శాశ్వతముగా చాటువులో నిలిచిపోయేటట్లు చేయగల పచ్చడము రామలింగనికి సమర్పించి తిమ్మన ధన్యతపొందాడు కనుకనే ఈ చాటువు ప్రచారములోనొకొచ్చింది. రాయల కాలములో అతి సామాన్యునికి గల కవిత ప్రీతిని చాటుతూ ఉదాహరణంగా నిలిచాయి ఇలాంటి పద్యాలు..

**తిరుమలరాయుడు**

తిరుమలరాయుడు ఒక చిన్న మండలాధికారి. ఆయనకు ఒక కన్ను లేదు. కాని కవీశ్వరులు అతిశయోక్తులతో స్తోత్రపాఠాలతో ఆయనని పొగిడేవారు. ఒకరోజున తిరుమల రాయలు "స్వభావోక్తి మధురముగా నన్ను వర్ణించండి అతిశయోక్తులు వద్దు" అని అడిగాడు. మన వికటకవి ఆయనకు ఒక కన్ను లేదనే విషయాన్ని నిర్భయంగా వర్ణించి చమత్కారముగా చెప్పినప్పటికీ ఆగ్రహానికి గురికాకుండా సన్మానము పొందాడు. భార్యతో కలిసి కూర్చుంటే త్రినేత్రుడైన హరుడవు. భార్యపక్కన లేనపుడు అసురుగురుడైన శుక్రాచార్యుడవు (శుక్రునకు ఒక కన్ను మాత్రమే ఉంటుంది). ఒక కన్ను లేదు కాని నువ్వు మన్మధకారుడవే అనే అర్థములో ఈ చాటుపద్యము చెప్పాడు.

అన్నాతిగూడహరుడగు
నన్నాతినిగూడకున్న నసురగురుండౌ!
నన్నా! తిరుమలరాయుడు

కన్నొక్కటి లేదుగాని కంతుడుగాడె!

**నంది తిమ్మన**

ఈయనకు ముక్కు తిమ్మన అనే ముద్దుపేరు కూడా ఉంది. అరణముగా రాయల అత్తవారింటి నుంచీ వచ్చిన కవి. రాయలచేత సన్మానాలేకాదు, రాయలకు తన చెవికుండలాన్ని బహుమతిగా ఇచ్చిన సరసకవి. పారిజాతాపహరణము రచించిన ఈ మహాకవి విలువకట్టలేని బంగారు చెవికుండలాలు ధరించి సభకు వస్తుంటే ఒక భట్టుకవి ఎదురు పడ్డాడు. "మేముజానపదులము. నీ కవితాశీవి మాకు లేదు. బావిలోని కప్పలము. <u>గగనధుని (ఆకాశగంగ)</u> నీటి ప్రవాహపు చెమ్మ లభించదు" అని పొగిడాడు. కర్ణపేయమైన ఆ ప్రశంసకు తన విలువైన ఒక కర్ణకుండలాన్ని భట్టుకు ప్రశంసగా ఇచ్చాడు. ఒంటి కుండలముతో సభలోకి వచ్చిన తిమ్మనను రాయలు విషయమడిగి "నేను ఆపద్యభావముతో ఏకీభవిస్తున్నాను. అయితే కొంచెం మార్పుగా గగన ధునికి బదులుగా<u>నాకధునీ</u> అని చెపితే మీకు నచ్చుతుందా మరి!" అని తిరిగి ఆ పద్యాన్ని చదివి ప్రశంసించాడు. ఆనంద పట్టలేని ఆ మహాకవి రాయలకు తన రెండోకుండలాన్ని బహుకరించాడని ఈ చాటువు ద్వారా తెలుస్తోంది.

మాకొలదిజానపదులకు
నీకవితాశీవియబ్బునే కూపనట
ద్భేకములకుగగనధునీ
శీకరముల చెమ్మ! నందిసింగయతిమ్మా!

**రవిగాననిచోకవిగాంచునేకదా!**

రాయలను మెప్పించిన ఈ మహాకవిని కూడా రామలింగడు వదిలిపెట్టలేదు. కాని రామలింగనిని నవ్వులపాలు చేసిన ఘనత తిమ్మనకు దక్కింది. రామలింగడు తిమ్మన ఇంటికి వెళ్ళాడు. ఊయల ఊగుతున్న కవిని "ఊతవా" అని శ్లేషగా అడిగాడు. ఊయల ఊగుతున్న పరవశములో రామలింగడు కొంటెవాడన్న విషయము మరిచిపోయి సరేనన్నాడు. అదే అదనుగా రామకృష్ణ కవి తిమ్మన ముఖముపై నూసెను. కోపావేశముతో తిమ్మన ఉయ్యాల బల్లతో రామలింగని ముఖాన్ని గుద్దాడు. రామలింగడి పన్నూడిపోయింది. ఈ విషయము నలుగురికీ తెలిసి నవ్వులపాలవకుండా ఊడిన పన్ను స్థానములో దుప్పికొమ్మును పన్నుగా మలిచి పెట్టుకుని సభకు వచ్చాడు, రవి చూడక పోయినా కవి గమనించిన విషయాన్ని రాయలు "రవిగాననిచో కవిగాంచునేకదా!" ని సమస్యా పూరణము ద్వారా మరీ బయట పెట్టించాడు. దక్షయజ్ఞ ధ్వంస సమయాన వీరభద్రుడు "రవికి" పళ్ళూడగొట్టాడు. విరిగిన పన్నుకు ప్రత్యామ్నాయము రవికి తెలియలేదు. కాని రామలింగడు తిమ్మన తన్నుకు ఊడిన పన్నును దుప్పికొమ్ముతో కప్పిపుచ్చిన విషయము రవి చూడలేడుకానీ కవి చూడగలడు అనే అర్థముగల ఈ చాటువు ప్రసిద్ధమై ప్రచారములో ఉంది.

ఆరవి వీరభద్రుచరణాహతిడుల్లిన బోసినోటికిన్
నేరడు రామకృష్ణ కవినేరిచెబో మనముక్కుతిమ్మరాట్
క్రూరపదాహతిందెగిన కొక్కిరిపంటికి దుప్పికొమ్ముప
ల్గారచియించెనౌరా! రవిగాననిచోకవిగాంచునేగదా!

**పింగళిసూరన**

ముక్కు తిమ్మన చేతిలో పరాభవము తరువాత రామలింగడు కొంచెం జాగ్రత్తపడ్డాడేమో! తనమీద పద్యాలు పుట్టకుండా జాగ్రత్త పడ్డాడు. పింగళి సూరన రామలింగని హేళన చేయాలని పద్యము సగము రాసి తగిన సందర్భములో దానిని పూర్తి చేసి నలుగురుకీ వినిపించాలని ఎదురు చూస్తున్నాడు ఆ సగము ఈ క్రిందిది.

తెనాలి రామలింగడు

తిన్నాడుర తట్టెడంత----

రామలింగడు ఈ విషయాన్ని గ్రహించి సూరన ఇంటికి వెళ్ళినపుడు మిగిలిన శేషభాగాన్ని పూరించి వచ్చేశాడు. తియ్యటి బెల్లం తిని తన నోరు తీపయింది. పాపం సూరనకు నోరంతా పేడయింది --- అని ఆ పూరణకు అర్థము.

--------- తియ్యని బెల్లం

చెన్నుగమన పింగళిసూ

రన్నకు నోరంతపేడయైపోయెనురా!

**మనోహర పూరణలు**

కృష్ణరాయల సభ కవుల పరస్పర హేళనలకు నిలయమనుకుంటే పొరపాటు. నగరు, తగరు, తొగరు, వగరు,-- అనే పదాలతో రామాయణ, భారత, భాగవతపరముగా దత్తపదిని పూరించిన రాధామాధవ కవి నేటికవుల దత్త పది పూరణకు మార్గదర్శకుడూ. మాలికా రచనతో గండెపెండేరము తొడిగించుకున్న పెద్దన సంస్యాపూరణములో విశేష ప్రతిభగలవాడు. "స్ఫురితఫణామణిద్యుతుల పొల్పగునాగకుమారుడోయనన్" --- అనే సమస్యను కృష్ణ దేవరాయలివ్వగా" వరుడు కొంగులాగగావలువ తొలిగిపోయి సిగ్గుపడిన వధువు రత్న ముద్రికలతో ఒప్పిన డాపలికేలితో మూసిన మనోహర దృశ్యముగా మలిచి పెద్దన మాత్రమే పూరించి సమస్యా పూరణలకు విశేష ఖ్యాతినివ్వగలిగాడని నా అభిప్రాయము.

ఆ పద్యమీ క్రింది చాటువు.

వరుడు చెఱంగు పట్టి ననువల్వ తొఱంగినలే మసిగ్గుప

ట్టురుతరత్నముద్రికల నొప్పగు డాపలికేలమూయగా

గరమమరెంగరంబపుడుకామవిధానముకాచియున్నవి

స్ఫురితఫణామణిద్యుతులబొల్పగు నాగకుమరుడోయనన్

# తెలుగులో చాటు కవిత్వం

డా.జొన్నలగడ్డ మార్కండేయులు

(14)

*జనశ్రుతులు*

కృష్ణదేవరాయల ఆస్థాన కవులగురించి సేకరించవలసిన చాటువులు చాలా ఉన్నాయి. మరొక ఉదాహరణ. ప్రజలు ఆయన్ని శ్రీకృష్ణావతారముగా భావించారు. ఈశ్వరాంశతో జనించిన పరాక్రమవంతులైన దాశరథులకంటే, ఈశ్వరాంశలేని పాండవులు పరాక్రమంలో గొప్ప వారని రాయలు నిండు సభలో అన్నాడు. ఆ మాటలు విని రాజుగారికి చామరము వీస్తున్న చాకలి - రాయలు అభినవ కృష్ణుడై జన్మించి కూడా కృష్ణావతారము నాటి పాండవ పక్షపాతముని విడవలేదని పలికాడు. తనను కృష్ణావతారముగా భావించి పలికిన చమత్కారమునకు రాయలు సంతోషించి సన్మానించాడు. చాకలి వంటి సామాన్యుని చమత్కారాన్ని కూడా రసహృదయముతో స్వీకరించిన మహోన్నత వ్యక్తిత్వము రాయలిది. అందుకే రాయల యుగము స్వర్ణయుగమైంది. ఇంకో విషయమేమిటంటే..రాయలు దండయాత్రకు వెళ్ళేముందు ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకునేవాడు. ఆ మహారాజు పరాక్రమము గురించి ఒకసారి ఇదే చాకలి మహోత్సాహముగా పాడాడట! తదుపరి రాయలవారు గజపతి మీద దండయాత్ర చేసి కటకాన్ని జయించి గజపతి కుమార్తెను వివాహమాడాడు. విజయుడై తిరిగి రాగానే ఆ చాకలికి దేవరకోట సీమను ఏలుకొమ్మని ఇచ్చాడు. నేటికాలంలో కమ్మ జమిందారు ఏలుబడిలో ఉందని చెప్పబడిన దేవరకోట సీమలో 'సీలు మొహర్లు' చాకలి వంశీయులవద్దే ఉంచేవారు. అతని వంశీకులు పల్లకి మోసేవారు కాదని వేటూరి ప్రభాకర శాస్త్రిగారు పేర్కొన్నారు. సామాన్యునిపై కూడా ఆ మహారాజు కురిపించిన వాత్సల్యానికి ఇది ఒక ఉదాహరణ.

ఒకసారి కృష్ణానదీ తీరములో ఇవతలి ఒడ్డున సేనతో రాయలున్నాడు. ఆవలి ఒడ్డున తురకసేన ఉంది. కానీ నది పొంగి వెల్లువై తురక సేనను ముంచెత్తింది. సైన్యము కొట్టుకు పోయింది. తురక సేనలోని ఏనుగులు మాత్రం ఈదుకుని ఒడ్డుకు వచ్చి రాయల సైన్యములోని గజబలంలో కలిసి పోయాయి. అది చూసి ఒక కవి ఇలా చమత్కరించాడు.

నరసింహ కృష్ణరాయా
దురమున నీపేరిటేఱు తురకలజంపెన్
గరిరాజ వరదుడవనుచు
గరిఘటలటమిమ్ము జూచి గ్రక్కున వచ్చెన్

రాయల పేరు కలిగిన కృష్ణానది తురకలును చంపింది. కరివరదుడైన శ్రీకృష్ణదేవరాయల వద్దకు తురక సైన్యములోని ఏనుగులు చేరిపోయాయి అని చమత్కారము...

మరొక సంఘటన: బొడ్డుచర్ల తిమ్మన అనేవాడు రాయలతో చదరంగమాడి కొప్పోలుపురమును--కృష్ణరాయపురమను పేరుతో అగ్రహారముగా పొందాడని తెలియచేసే ఈ క్రింది చాటువు ప్రచారములో ఉంది.

శతసంఖ్య లొక్కటయినను
సతతము శ్రీకృష్ణరాయజగతీపతితో
చతురంగమాడి గెల్చును
ధృతిమంతుడు బొడ్డుచర్లతిమ్మన భళిరే!

రాయలవారి పరాక్రమము గురించి, కవితాపోషణ గురించిన చాటువులు మరెన్నో జనశ్రుతుల శీర్షికలో చేర్చబడాలి. ఈ క్రింది చాటువుతో మరుపురాని వారి భువన విజయ సభకు నివాళులర్పిద్దాము.

బోరనయాచక ప్రతతి భూరి విపద్దశ నొందుచుండగా
నారయ శాలివాహన శతాబ్దములద్రియుగాబ్ది సోములం
దారణవత్సరంబున నిదాఘదినంబున మాఘశుద్ధ ష
ష్ఠీ రవివాసరంబున నృసింహుని కృష్ణుడు చేరె స్వర్గమున్
ద్వారకనున్న కృష్ణుడవతార సమాప్తిని చెందుకైడిన్

<u>రాజాశ్రయ చాటు కవిత----రాజులవర్ణనలు</u>

ప్రాచీనకాలంలో తాము పొందిన సన్మాన సత్కారములకు సంతసించిన పండిత కవులు, రాజులను జమిందారులను పొగిడేవారు. వాటిలో అతిశయోక్తులుండేవి.. చమత్కారాలుండేవి. కోపతాపాలుండేవి. దీవెనలులుండేవి. అవన్నీ కూడా శీర్షీకరించితే బావుంటుంది.. రాజుల మీద కవులకున్న అభిప్రాయాన్ని ఈ చాటువులో చూడవచ్చు.

రాజులు విక్రమోగ్ర మృగరాజులు విశృతదివ్యకాంతిరే
రాజులు రూపరేఖ రతిరాజులు మానగుణంబునందురా
రాజులు దానశక్తి ధనరాజులు వైభవభోగవృద్ధిస్వా
రాజులనంగనొప్పుదురు రాజితతేజులు తత్పరంబునన్

భీమకవి చోడగంగు అనే రాజును సకలగుణాభిరాముడని పొగుడుతూచెప్పిన ఈక్రింది చాటువు చాలా ప్రసిద్ధము. భోజుడు, ధర్మరాజు, చంద్రుడు, ఇంద్రుడు, శివుడు, బ్రహ్మలో లోపాలున్నాయి కాబట్టి చోడగంగుకు వీరెవ్వరూ సరిరారు అంటున్నాడు.

భోజుడుమంకు ధర్మజుడుబొంకు శచీపతీరంకు కల్పపూ
రాజు కళంకు దైవతరరాజముడొంకు పయోధియింకు నం
భోజభవుండుపంకు ఫణిభూషణదేవుడు సంకు పద్మినీ
రాజహితుండుక్రుంకు సరిరారుగుణంబుల నీకు ధారుణిన్

మరో కవి మల్కిభరాముడనే తురకరాజును మాత్రమే రాజశబ్దానికర్హుడని పొగిడాడు. ఎలాగంటే- రాజు అనబడే చంద్రుడు రాహువుకు చిక్కాడు. వాహినీరాజు రావణకుమారుని చేతిలో ఓడిపోయాడు - ఇలా ఏకరువు పెట్టి మల్కిభరాముడు మాత్రమే రాజని అతిశయోక్తిగా చెప్పిన కవి ఆంతర్యములో వెటకారము మరుగు పడిఉంది.

రాజును రాజుగాడతడు రాహుముఖంబున జిక్కెవాహినీ
రాజును రాజుగాడతడురావణసూతికినోడె నాజి దేవతా
రాజును రాజుగాడతడు రామశరాహతిదూలె నాజిలో
రాజనరాజు మల్కియిభరాముడెరాజు ధరాతలంబునన్

ఆ విధంగానే రామరాజభూషణుడు చేసిన రాజవర్ణన చాటు పద్యాలుగా ప్రచారమై అర్థవివరణ ఇవ్వడంలో కవులకు సవాలు విసురుతాయి.

గంటము లేకుండ గడియకు నూరుపద్దెములు చెప్పగల అడిదము సూరకవి దేశాటనలో సంస్థానాధీశులపై పద్యాలు చెప్పాడు.---- పూసపాడ్విజయరామనృపాలుడెరాజుగాక-- "ఈ రాజులు రాజులె పెనుతరాజులుగాక ధరాతలంబునన్" అని కీర్తించాడు.

పెద్దాపుర సంస్థాన విద్వత్కవి ఏనుగు లక్ష్మణ కవి వత్సవాయుభూపతిని "రాజులు రాజులా! సుగుణ రాజుల రాజవు నీవుగాక--యోరాజవతంస వత్సవయిరాయమహీపతి తిమ్మభూపతీ" అని కీర్తించాడు.

ఇలా సంస్థానాధీశులను మెప్పించి అగ్రహారాది దానాలు పొందడమన్నది జమిందారీ వ్యవస్థ రద్దయిన తరువాత కూడ రాజభరణాలున్నంతకాలమూ సాగింది.

అనవేముడు తనపై చెప్పిన శ్లోకానికి ఆరువేలని, యోగకవి చమత్కారానికి ఎనిమిదివేలిచ్చాడన్న ఈ శ్లోకము దేశాటన చాటుకవులకు లభించే సిరిసంపదలకు ఉదాహరణగా నిలుస్తుంది.

అనవేమ మహీపాల స్వస్త్యతనబాహవే
అహవేరిపుదోర్దండ చంద్రమండలరాహవే

నాలుగు పాదాలలోను తన పేరులోని "వే" ని ఉపయోగించానని కవి చెప్పాడు. అలా తనను ప్రశంసించిన కవికి అనవేముడు మూడు వేలిచ్చాడు. నాలుగు పాదాలకు మూడువేలేనా? అన్నాడు కవి. అయితే తీసుకో అని నాలుగువేలిచ్చాడు రాజు . నేను అన వేముని పేరులోని నాలుగు వేలు రాసి కవిత చెప్పాను నాది నాకివ్వడము గొప్పకాదన్నాడు. ఐదువేలిస్తే నేను ఆరువేలని బోతుంటే మా ఆరువేల నియోగుల సంఖ్యలోని వాడిని అని రాజు కేసి చూశాడు. ఆరువేలివ్వబోతుంటే మా ఆరువేల సంఖ్యకు మించి గొప్ప అవుతుందని అన్నాడు. ఏడువేలివ్వబోతే రోదనసంఖ్య అవుతోందని తిరస్కరించితే ఎనిమిది వేలిచ్చి అనవేముడు కవిని సంతోషపరిచాడు.

**తంజావూరి విజయ రాఘవరాయలు**

శ్రీకృష్ణదేవరాయల తరువాత అభినవరాయలని పేరు పడ్డ తంజావూరి విజయ రాఘవరాయల సాహిత్య పోషణ మరుపురానిది. ఆ మహారాజును గురించి ఒక కవి చెప్పిన చాటువు ఈ క్రిందది. శిబి, కర్ణులు దాతలను మాటదబ్బర. విజయరాఘువుడే సిసలైన వదాన్యుడని చెప్పిన చాటువు అతిశయోక్తిగాకాక అతని సాహిత్య పోషణకు ఉదాహరణగా నిలుస్తోంది.

భూతలమున శిబికర్ణులు
దాతలనే సుద్దియౌనుదబ్బర నిన్నెం
చేతటివదాన్యుడెవ్వడు
రా తంజావూరి విజయరాఘవనృపతీ!

రఘునాధరాయలు రసికుడు. మమన్నారు దాస విలాసమును రచించి కనకాభిషేకమును పొందిన కవయిత్రి రంగాజమ్మ ఈతని ఆస్థాన కవయిత్రి. ఈ మహారాజుకు ప్రేయసి. వంచనతో మహారాజును వశపరచుకున్నావని మహారాణి రంగాజమ్మపై మండిపడి

నిందించింది. ' ఇల్లాలికి నేర్పులేకపోతే భర్త ప్రేమకు దూరమవుతుంది. అందుకు చింతించాలిగాని నన్ను నిందించడము తగద ' ని రంగాజమ్మ పంపిన సమధాన చాటువుగా ప్రచారమైంది.

ఏ వనితల్ మము తలంపగనేమిపనో! తమరాడువారుగా
రో! వలపింపనేర్పెఱుగురో? తమకావగిటిలో నుండగా
రావదియేమిరా!విజయ రాఘవ! యంచిలు దూఱిబల్మిమై
దీవరకత్తెనై పెనగి తీసుకువచ్చితినా! తలోదరీ!

**ద్వాత్రింశన్మంత్రులు**

కృష్ణదేవరాయల వంటి చక్రవర్తులేకాక , చిన్న సంస్థానాధిపతి వరకు మంత్రాంగము నడిపిన మంత్రులు కూడా సాహిత్యపోషణలో కూడా ప్రాధాన పాత్ర పోషించారు. ఈ రాజమంత్రులపై కవులు చూపించిన ఆదరానాదారాలు చాలా చాటుకవితలలో కనిపిస్తాయి. ఈ రాజమంత్రులలో కొందరు కవులై  కవిత్వము కూడా చెప్పారు.

సాధారణంగా ఈ మంత్రులందరూ నియోగులను శాఖకు చెందిన బ్రాహ్మణులు. రాజ్యతంత్రము, కవితాశాఖ వీరి అధీనములో ఉన్నాయని ఆంధ్రుల చరిత్ర రాసిన చిలుకూరి వీరభద్రరావుగారు అభిప్రాయపడ్డారు. అందుచేత వీరిని మరచి ఆంధ్రదేశ చరిత్ర రాస్తే, శిరములేని మొండెమువలెను, సారములేని పిప్పివలెను, ఉప్పులేని కూరవలెను ఉంటుందని (ఆంధ్రుల చరిత్ర పదునైదప్రకరణము---- పుట---332) అభిప్రాయపడ్డారు. అందుచేత "తెలుగులో చాటు కవిత్వము" నందు ఈ రాజమంత్రులు మీద గల చాటుపద్యాలు కూడా సేకరించాల్సిన అవసరముంది.. రాజమంత్రులందరూ నియోగులేనన్న భావనలో ఉన్న ఈ చాటుపద్యము  కూడా ప్రసిద్ధమైనదే.

భాగ్యవశమున బుద్ధిసంపన్నుడగును
బుద్ధిబలమున నృపులకు పూజ్యడగును
నృపులు మన్నింప నయకళా నిపుణుడగును
పూని రాజ్యమునడుపు ప్రనుడగును

**ఈవ్యాస పరంపరకి ముగింపు వాక్యాలు: ఎందరో మహానుభావులు**

పట్టపగలు నక్షత్రములు సూర్యకాంతిలో కనపడకపోయినంత మాత్రమున అసలు నక్షత్రాలే లేవనుకోవడము హాస్యాస్పదమవుతుంది. ఆధునిక సాహిత్యం సూర్యకాంతి ఐతే ప్రాచీన సాహిత్యాన్ని అనంతకోటి నక్షత్రకాంతిగా భావించవచ్చు. చందమామ వంటి లాక్షణికగ్రంధ సంకలన వెన్నెల కాంతిలో నామా వశిష్ట గ్రంధరాజములు, ఎప్పటికైనా కవులు తొంగి చూడకమానరు. శిధిల కవిత పేరున ఆ మహానుభావులు చాటు కవితలో శీర్షికరింపబడాలి. లక్షణ గ్రంధముల మాటునే కాదు-- ఆధునిక సాహిత్యములో కూడా గొప్ప  చాటు కవులున్నారు, "ప్రాచీన కవిత్వమునకు భరత వాక్యము --- నవీన కవిత్వమునకు నాంది '-- పలికిన తిరుపతి కవుల కాలమునుంచి -- జ్ఞానపీఠ బహుమతినందిన విశ్వనాధ సత్యనారాయణ వరకు ఎందరో లబ్దప్రతిష్ఠులైన కవులు చాటువులు రచించారు. ఆధునికులలో ఇంచు మించు అందరూ అవధాన కవులు. వారి చాటువులు సంకలన గ్రంధరూపంలో వస్తున్నాయి. కాబట్టి చాటుకవిత శీర్షికలో వారి పద్యములు కూడ నచ్చినవి ఎన్నుకుని చేర్చుకుని చదువుకునే సమిష్టి సంపదగా చాటు కవితను నిరంతర ప్రవాహినిగా ఆస్వాదించాలని కోరుతూ-- ప్రస్తుతానికి సెలవామరి!

**సమాప్తం**

## చాటువులు - దూర్వాసుల వేంకట సుబ్బారావు



(1)

**తెనుగు సాహిత్యం** ప్రత్యేకత పద్యమే. రామాయణ, భారత, భాగవతాది కావ్యాలు ప్రబంధాలు పద్యకావ్యాలే. కావ్య పరంగా కాక, ఆశువుగా, హాస్యధోరణిలో, సందర్భానుసారంగా పొగడినా, తెగడినా చెప్పిన పద్యాన్ని "చాటు"వందురు. చాటువనగా చాటుట. అనగా ఒక నిగూఢ నిజాన్ని, సత్యాన్ని ప్రజలకు తెలియజేయుటయే చాటుట. పూర్వం మన పల్లెలలో ఏదైనా ముఖ్యాంశాన్ని ప్రజలకు చాటించి తెలియజేసేవారు. సర్వసాధారణంగా చాటువులు స్వానుభవంపై ఆధారపడటం వల్ల, ఆశువుగా చెప్పటం వల్ల యతి నియమాలు, వ్యాకరణ దోషాలతో ఉండవచ్చు. ఇల్లు కొనేటప్పుడు పరిసరాలు ఎంత ముఖ్యమో, చాటువులకు సందర్భం, సమయం చాలా ముఖ్యం. అందుకే వేమన ఇలా అన్నాడు.

*ప్రస్తుతంపు వేళ పద్యంబు చెప్పుచో*
*తప్పు గలిగి యున్న నొప్పెయగును*
*బిత్తరి రతిలోన బిత్తలైయుండదా*
*విశ్వదాభిరామ వినురవేమ*

ఈ చాటువుల్లో ప్రసంగ పద్యాలు, పొగడ్త పద్యాలు, తిట్టు పద్యాలు, ప్రాస్తావికత పద్యాలు, సుభాషితాలు, శృంగార పద్యాలు, సమస్యపూరణాలు, అశ్లీల (బూతు) పద్యాలు ఉంటాయి. ఆంగ్ల భాషలో లిమరిక్కులు, డిట్టీలు, డాగరల్, మినిస్ట్రెల్స్, గ్రూక్స్ మన తెలుగు చాటువుల్లాంటివే. ఆది భాష సంస్కృతంలో 'చాటు' అంటే పొగడ్త - రాజులను ఇంద్రుడు, చంద్రుడని ఆకాశానికి ఎత్తేసి, సంస్కృత శ్లోకాలతో కవులు ప్రస్తుతించేవారు. తమిళంలో 'చాటు' అంటే వాక్చాతుర్యం, 'చాటువర్' అంటే కవి. సంస్కృతం రాని వాళ్ళని, అరవంలో ఈ చాటువర్‌లు పొగిడేసేవారు, అవసరమైతే తిట్టేవారు కూడ.

చాటు కవిత్వానికి 'చిత్రకవిత' అన్నదొక మారుపేరు. అయితే ఈ చాటువులు అక్కడా, అక్కడా అడపా తడపా చెప్పబడుట వలన వీటిని సంకలనం, లేక కూర్పు చేయటం జరిగింది. ఈ సంకలనాల్లో ముఖ్యమైనవి:

మడికి సింగన (1430) సకలనీతి సమ్మతం, జగ్గన (1620) ప్రబంధ రత్నాకరం (వేటూరి ప్రభాకర శాస్త్రి గారి ప్రకటితము), దాసరి లక్ష్మణ స్వామి వర్ణన రత్నాకరం (కాశీనాధుని నాగేశ్వరరావు 1928-30లలో ప్రకటించినది), భట్టిప్రోలు రామచంద్రయ్య ఆంధ్రకవితా రత్నాకరం (1878), రంగయ్య శెట్టి (ఋతుచక్రం 1915), కూచిమంచి వెంకట రాయుడు (సుకవి మనోరంజనం), అడిదెము సూర కవి (కవి సంశయ ఏచ్ఛేదము) చాటుపద్య మణిమంజరి (వేటూరి ప్రభాకర శాస్త్రి 1917). మరల 1952, 1988ల్లో వేటూరి ప్రభాకర శాస్త్రి గారి చాటు పద్య మణిమంజరిని పెంపు చేసి ప్రచురించారు.

శ్రీ వేటూరి వారు పరిశోధనా గంగలో పట్టినదల్లా బంగారం, ముట్టినదల్లా ముత్యం. ఆంధ్ర లోకానికి శ్రీ అన్నమాచార్య కీర్తనా సాహిత్యాన్ని పైకి తీసుకు వచ్చి అమృత విందులు చేసిన తపస్వి, పూజ్యులు శ్రీ వేటూరి. వీరు మద్రాసు విశ్వవిద్యాలయ ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో పండితులుగా పనిచేసి 1950లో స్వర్గస్తులయ్యారు. వీరికి ఈ గ్రంథాలయంలో ఏ గ్రంథంలో ఏముందో నిద్రలో కూడా చెప్పగలిగే సామర్థ్యం ఉండేదట. వీరేశలింగం, గురజాడ సాహిత్య విషయాలపై శ్రీ వేటూరి వారితో సంప్రదించేవారట. వీరి చాటు పద్యమణి మంజరిలో 1823 రసగుళికలున్నాయి. మన తెలుగు సాహిత్యంలో కవుల సన్నివేశాలు, వారి సామాజిక, రాజకీయ విషయాల్ని ఎవ్వరూ వ్రాయనందున, వారి పీఠికల్లో, అవతారికల్లో ఉన్న చాటువులనే ఆధారంగా చేసుకుని వారి గురించి వ్రాయటం జరిగిందని శ్రీ ఆర్ద్ర అభిప్రాయపడ్డారు. తొలుత చెప్పిన ఎనిమిది రకాల చాటువుల్నీ సమయానుకూలంగా సందర్భోచితముగా వివరిస్తున్నా.

పన్నెండవ శతాబ్దికి పూర్వం, కళింగరాజుకాలంలో కోపిలలో ముక్కోపి వేములవాడ భీమ కవి స్వకీయంగా ఏమన్నాడంటే

*ఉగ్రకోపి నేను నోపుదు శపియింప*
*గ్రమ్మరింప శక్తి గలదు నాకు*
*వట్టి మాన జిగురు పుట్టింప గిట్టింప*
*బిరుదు వేములాడ భీమకవిని.*

తన తిట్టు ఊరికే పోదు, అది రాముని బాణం, భీముని గధ, విష్ణు చక్రం కన్న మిన్న అని ఈ విధంగా శాపనార్థాలు పెట్టాడు:

*రాము నమోఘు బాణమును, రాజ శిఖామణి కంటి మంటయున్*
*దామర చూలి వ్రాతయును, దారక ద్విఘఘోర శక్తియున్*
*భీము గదా విజృంభణ, ముపేంద్రుని చక్రము, వజ్రి వజ్రమున్*
*వేములవాడ భీమ కవి వీరుని తిట్టును రిత్తవోవునే?*

కడ దారిద్ర్య బాధచే, బహుశః కోమట్లనుంచో, లేక కోమటి అనే అధికారినుంచో అప్పులు తీసుకుని, తీర్చలేని బాధతో ఇలా తిట్టాడు

*కోమటి నొక్క టిచ్చి పది గొన్నను దోసము లేద యింటికిన్*
*సేమ మెఱింగి... చిచ్చిన జెందద పాపము.*

వెంటనే ఇంకో పద్యములో కోమటి పక్షపాతివై

*కోమటికొక్కటిచ్చి పదిగొన్నను దోసము లేదటంటివా*
*కోమటి కొక్క టీక పది గొన్నను ధర్మము ధర్మ పద్ధతిన్*

అని సమర్థించుకున్నాడు ఈ భీమ కవి.

కవులను తగు రీతిలో సత్కరించని వారిని ఈ విధంగా భాస్కర మంత్రి శపించాడు:

*పద్యము చెప్పిన సుకవికి*
*హృద్యముగా నియ్యనట్టి హీనాత్ముని యా*
*పద్యమె పామై కఱుచును*
*ప్రద్యోతితకీర్తి కాండ! భాస్కరుకొండా!*

## చాటువులు - డా. దూర్వాసుల వేంకట సుబ్బారావు



(2)

పావులూరి మల్లన కాలం ఇదమిద్ధంగా తెలియకపోయినా, బహుశః భీమకవి సమకాలికుడని పండితాభిప్రాయం. ఈయనకు గణితం, చదరంగం అంటే ఇష్టం. చదరంగం పేరుతో ఒక గట్టి ప్రశ్న ఈ విధంగా అడిగాడు. చదరంగంలో మొత్తం గళ్ళు 64 (8x8). వడ్ల గింజల్ని ఒక్కొక్క గడిలో ఈ విధంగా ఉంచి:

మొద లొకట నిల్పి దానిం
గదియగ దుది కాక రెట్టిగా గూడిన చొ
విదితముగ బల్కు మాకుం
జుదరంగపు టిండ్లకైన సంకలిత మొగిన్.

అంటే మొదటి గడిలో ఒకటి, రెండవ గడిలో రెండు, మూడవ గడిలో నాలుగు, అలాగే తరువాత గళ్ళలో 8,16,32,64, 128... గళ్ళకు మొత్తం ఎన్ని వస్తాయో చెప్పమంటాడు చమత్కారంగా. దాని జవాబు కూడా తానే పద్యరూపంలో ఇరవై అంకెల సంఖ్య - 18446744073709551615 అని జవాబిచ్చాడు:

శర శశి షట్క చంద్ర శరసాయక రంధ్ర వియన్నగాగ్ని భూ
దరగగనాబ్ధి వేదగిరి తర్క పయోనిధి పద్మ జాస్యకుం
జరతుహినాంశు సంఖ్యకు నిజంబగు తచ్చ తురంగ గేవావి
స్తరమగు రెట్టి రెట్టికగు సంకలితంబు జగత్ప్రసిద్ధికిన్

మనం గుర్తుంచుకోవలసిన సాంకేతాల ప్రకారం శర అంటే 5, శశి అంటే 1, షట్కం అనగా 6. వీటిని కుడి నుంచి ఎడమకు వేసుకుపోతే ఇరవై అంకెల సంఖ్య వస్తుంది. ఇదే విధంగా ఇంకొక వినోద సమస్యని ఆరు ఒకట్లని (1,11,111) అవే ఆరు ఒకట్లచే గుణిస్తే పదకొండు అంకెల సంఖ్య 12345654321 వస్తుందన్నది ఇలా తెలియజేసాడు:

ఆరు నిక్కట్లు నోడ్పుగా నమర బెట్టి
యంత గుణకంబు చేతను నమర బెంచి
సొరిది వర్ణించి జనులకు జోద్యముగను
హిమక రొప మలబ్దంబు నెరయవచ్చు.

భక్తి రసానికి పోత పోసిన పోతన, సరస్వతీ స్వరూపుడే భుక్తికి ఇబ్బంది పడ్డాడే కాని, భక్తితో శ్రీహరిని నమ్ముకొందునని ఈ క్రింది చాటువులో తెలియచెప్పాడు..

కాటుక కంటి నీరు చనుకట్టు పయింబడక నేల ఏడ్చెదో
కైటభ దైత్య మర్దనుని గాదిలి కోడల్ల! యోమదంబ! యో
హాటక గర్భురాణి! నిను నా కటికై కొనిపోయి యల్లక
ర్ణాటకిరాట కీచకుల కమ్మ్రది శుద్ధిగ నమ్ము భారతీ!

తాను రచించిన భాగవతం డబ్బుకి, హోదాకి అమ్ముడు కాదన్నాడు ఇలా:

ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనమ్ములున్
సొమ్ములు కొన్ని పుచ్చుకుని సొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెట వ్రేటులంబడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పెనీ
బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్.

మన కవులలో మహాభోగి, శృంగార పురుషుడు శ్రీనాథుడు. మహాజ్ఞానిగా వ్యవహరింపబడే బృహస్పతి గుండెల్లో భయం కలిగించగలనని, "వాణి నా రాణి" అని చెప్పుకున్న కవి సార్వభౌముడు శ్రీనాథుడు రావు సింగమ భూపాలుని కొలువులో పండిత వివాదానికి ముందుగా శారదాంబను ఇలా కొలిచాడు.

దీనారటంకాల దీర్థ మాడించితి / దక్షిణాధీశు ముత్యాల శాల
పలుకు తోడై తాంధ్ర భాషా మహాకావ్య / నైషధ గ్రంధ సందర్భమునకు
పగుల గొట్టించి తుద్భట వివాద ప్రౌఢి / గౌడ డిండిమ భట్టు కంచు ఢక్క
చంద్ర భూషక్రియా శక్తి రాయల యొద్ద / బాదు కొల్పితి సార్వభౌమ బిరుద
మెటుల మెప్పించె దో నన్ను నింక మీద
రావు సింగమ మహీపాలు ధీ విశాలు
నిండు కొలువున నెలకొని యుండు నీవు
సరస సద్గుణ నికురంబ! శారదాంబ!

కర్ణాటక సామ్రాజ్యంలో రాజోచిత సన్మానంలో ఆలశ్యమవటం వల్ల ఇలా ప్రార్థించాడు

కుల్లాయుంచితి, గోక సుట్టితి, మహా కూర్పాసముం దొడ్గితిన్
వెల్లులిం దిలసిష్టమున్ మొసవితిన్ విశ్వస్త వడ్డింపగా
సల్లాయంబలి త్రావితిన్, రుచులు దోసంబంచు బోనాడితిం
దల్లీ! కన్నడ రాజ్య లక్ష్మి! దయలేదా నేను శ్రీనాథుడన్.

## చాటువులు - డా. దూర్వాసుల వేంకట సుబ్బారావు



(3)

ఆటవెలదులంటే ఇష్టమైన శ్రీనాథుడు జంగము, చాకలి, కాసలనాటి, శబర, పూజారి స్త్రీలపై ఇలా చాటువుల్లో చెప్పాడు.

*పూజారి వారి కోడలు*
*తాజాగ బిందె జారి దబ్బున బడియెన్*
*మై జారు కొంగు దడసిన*
*బాజారే తిరిగి చూసి పక్కున నవ్వెన్*

దక్షిణాదికి వెళ్ళి ఏమన్నాడంటే

*మేత గరి పిల్ల పోరున మేకపిల్ల*
*పారుబోతు తనంబున బంది పిల్ల*
*ఎల్ల పనులను జెఱుపంగ బిల్లిపిల్ల*
*అందమున గ్రోలి పిల్ల యీ యఱవపిల్ల*

బోగి శ్రీనాథుడు రేనాటి వంటకాలు తినలేక శివుణ్ణి ఇలా ఆక్షేపించాడు

*గరళము మ్రింగితి నంచుం*
*బురహర! గర్వింపబోకు! పో!పో!పో! నీ*
*బిరుదింక గానవచ్చెడి*
*మెఱసెడి రేనాటి జొన్న మెదుకులు తినుమీ!*

నీటి సదుపాయం సరిగ్గా లేనందున శివుణ్ణే ఈ విధంగా ఎత్తిపొడిచాడు

*సిరిగల వానికి చెల్లును*

*తరుణులు పదియారు వేల తగు పెండ్లాడన్*

*తిరిపెమునకు కిద్దరాండ్రా*

*పరమేశా గంగ విడుము పార్వతి చాలున్!*

అంతభోగి తన అవసాన దశలో బొడ్డుపల్లెలో వ్యవసాయము చేసి నష్టపోయి 700 పన్నుకట్టలేని దుస్థితిలో ఏమన్నాడంటే

*కవిరాజ కంఠంబు కౌగలించెను గదా! పురవీధి నెదురెండ పొగడదండ*

*....... బిలబిలాక్షులు తినిపోయే దిలలు పెసలు*

*బొడ్డుపల్లెను గొడ్డేఱి మోసపోతి*

*నెట్టు చెల్లింతు డంకంబు లేడు నూర్లు!*

అలాగే తనదైన బాణిలో సీస పద్యంలో తన ఆఖరి దశని ఇలా చెప్పుకున్నాడు

*కాశికా విశ్వేశు గలిసె వీరారెడ్డి రత్నాంబరంబు లేరాయడిచ్చు*

*...భాస్కరుడ మన్నె దేవుని పాలికరిగె..*

*దివిజ కవివరు గుండియెల్ దిగ్గురనగ*

*నరుగు చున్నాడు శ్రీనాథుడమరపురికి*

శ్రీనాథుని వలె అదే విధంగా కృష్ణదేవరాయల అష్టదిగ్గజాలలో ఆరాధ్యుడు పెద్దన తన చరమావస్థని ఈ విధంగా చెప్పుకున్నాడు.

*ఎదురైన చోదన మద కరీంద్రము నిల్పి కేలూతమొసగి యెక్కించుకొనియె*

*మను చరిత్రంబందుకొనువేళ బురమేగ బల్లకి దనకేలబట్టి యెత్తె*

*గోకట గ్రామాద్యనేకాగ్రహారంబు లడిగిన సీమలందు నిచ్చె*

*బిరుదైన గండపెండేరమున కీవ తగుదని తానె పాదమున దొడిగె*

*ఆంధ్ర పవితా పితా మహ! అల్లసాని*

*పెద్దన కవీంద్ర! యని నన్ను బిలుచునట్టి*

*కృష్ణ రాయలతో దివికేగలేక*

*బ్రతికి యున్నాడ జీవచ్ఛవంబు నగుచు*

కృష్ణదేవరాయల ఆస్థానంలో తెనాలి రామలింగనికి ఒక ప్రత్యేక స్థానం ఉండేది. గడ్డు సమస్యలొస్తే తిట్టుకవిత్వంతో సవాల్ చేసిన కవిని వాగ్వివాదంలో ఈ విధంగా ఓడించేవాడు తెనాలి రామలింగడు:

ప్రెగడ రాజు, నరసరాజులు అల్లుండ్లు. దేవర ఆస్థానానికి వచ్చి తమ గొప్పతనాన్ని పొగడు కొంటుంటే శ్రీ రామలింగడు ఇలా వారించేడు.

*తెలియని వన్ని తప్పులని దిట్టతనాన సభాంతరంబునన్*
*బలుకగ రాకు రోరి పలుమాఱు బిశాచపు బాడె కట్టె! నీ*
*పలికిన చోట దుమ్ము పడ! భావ్య మెఱుంగవు, పెద్దలైన వా*
*రలు నిరసింతురా! ప్రగడ రాణ్ణరసా! విరసా! తుసా! బుసా!*

పెద్దన కవిత్వాన్ని మెచ్చుకుంటూ

*కవి యల్లసాని పెద్దన*
*కవి తిక్కన సోమయాజి గణుతింపంగా*
*గవి నేను రామకృష్ణుడ*
*గవి యను నామంబు నీరు కాకికి లేదే?*

వినమ్రతతో చెప్పుకున్నా ఆ అల్లసాని పెద్దనలో లోపాన్ని సూచిస్తూ ఇలా అన్నాడు రామకృష్ణుడు:

*ఎమితిని సెపితివికపితము*
*బ్రమపడక వెఱి పుచ్చకాయ వడి దిని సెపితో*
*యు మెతకయ తిని సెపితివో*
*యమవసనిసి యనెడి మాట యలసని పెదనా!*

ఒకే కన్ను గల తిరుమల రాయడు తనపై పద్యం చెప్పవలసిందని రామలింగని సతాయిస్తుంటే ఇలా చమత్కరించేడు:

*అన్నాతిగూడ హరుడగు*
*అన్నాతిని గూడకున్న నసురగురుండౌ*
*అన్నా తిరుమల రాయా*
*కన్నొక్కటి లేదు కాని కాంతుడు కాడే!*

## చాటువులు - దూర్వాసుల వేంకట సుబ్బారావు



(4)

### కలగలుపు చాటువులు

రకరకాలు భాషల్లోని పదాలను ఛందోబంధంగా అనేకమంది కవులు"కలగలుపు చాటవులు"గా అందజేసారు. వీటినే మణి ప్రవాళలు అని అంటారు. నైజాము రాష్ట్రంలో తెలుగు, ఉర్దూ కలిపి ఒక అగ్రహారీకుడు తన నవాబుకి తన ఈతి బాధల్నిఇలా విన్నవించుకున్నాడు..

ఫలం లేదు మజ్కూర్, కలంబందు హల్ సాల్
అలం మోదుగాకుల్, క్వచిత్ టేకు మాకుల్;
అవుర్ కోయకొంపుల్, మరీ మాలకొంపల్
హ మే ముళ్ళ కంపల్. హమార్శేగ్రహారే

తుమాతా జవానుల్, హమార్శేగ్రహారే
కదాపిహదంగా, సజా సేయకుండన్
హుకుందియతాంనో, హకాంచాపి దర్యా
త్ఘురాతే ముదేస్తా త్సదా జంగలీశ!

ఇంకొక కవి సంస్కృతం తెలుగులను జోడించి తన బాధల్ని విన్నవించు కున్నాడు ఈ విధాన:

భోజనం ఈగ సంకీర్ణం
దోమ సంకీర్ణ మందిరమ్
శయనం నల్లి సంకీర్ణం
దేహమే కుంటి కూనమా!

పోతనగారి గునుగు పద్యం "ధరసింహాసనమై...." పంథాలో నేటి కవి కళ్ళన వడ, ఆవడ, పకోటి, ఇడ్లీ, బొండా కాఫీ ఫలహారాల గురించి ఇలా అన్నాడు:

వడపై, నావడపై పకోడిపయి, హల్వా తుంటిపై బూందియోం
పొడిపై, నుప్పిడిపై, రవిడ్లిలిపయిం, బోండాపయిన్, సేవియా

సుడిపై, చాఌ భవత్కృపారసము నిబ్బో గొంతరానిమ్మనే

నుడుకుంగాఫిని మ్రొక్కు గ్రుక్కు గొనవే మో కుంభ దంభోధరా!

ప్రశ్నోత్తరాల రూపంలో కూడ కొన్ని చాటువులున్నాయి. 1750 ప్రాంతం వాడైన అడిదము సూరకవి చాల చమత్కారంగా తన గురించి ఇలా చెప్పుకున్నాడు:

ఊరెయ్యది? చీపురువలె

పేరో? సూరకవి; ఇంటిపే?రడిదము వార్

మీరాజు? విజయ రామ మ

హారాజతడేమి సరసుడా? భోజుడయా

జూపల్లి ధర్మారావుగారి గురించి 1854 లో ఇద్దరు భట్రాజులు (నీరపరాజు, సుపరాజు) ఇలాగే ప్రశ్నోత్తరాలలో ఇలా అన్నారు:

జూపల్లి దర్మరాయం

డేపాటి ధనంబొసంగె? నీరపరాజా!

పాపాత్ముడెవరికిని

జూపనిదె చూపెనయ్య సూరపరాజా!

ప్రభువులు సహాయం చేయకపోతే ఖచ్చితంగా, నిస్సంకోచంగా చాటువు రూపంలో తిట్టేవారు. మంచెళ్ళ కృష్ణయ్య (1848) ఈ క్రింది విధంగా తిడ్తే  వెంటనే సహాయం వచ్చి పడిందట!

ఇయ్యక చదివించుకొనే | కొయ్యలు నౌ లంజతొత్తు కొడుకులు దొరలా |

యియ్యగ నేరుతురర్థికి | వెయ్యారులు యాచభూప వినుత దిలీపా!

నలుగురుకవులు చేరి సమానంగా చెరి ఒక పాదం చెప్పిన చాటువు కూడ ఉంది దీన్లో ఆఖరి పాదం తెనాలి రామలింగనిది - అది చదివి కప్పుకునే శాలువాని తిమ్మన నుంచి పొందేడు.

1.వాకిట కావలి తిమ్మా

2.ప్రాకటముగ సుకవి వరుల పాలిటి సొమ్మా

3.నీకీ పద్యము కొమ్మా

4.నాకీ పచ్చడమెచాలు నయముగనిమ్మా

అష్టకష్టాలు పడుతూ తమ బాధల్ని కొందరు చాటుకున్నారు ఈ విధంగా

శీతల స్నానంబును

భూతల శయనంబు, నొంటిపూలు శనంబున్

నాతిగల బ్రహ్మచర్యము

నాతరమా! పూట గడప నారయ భూపా!

కావేటి రంగధామునికి ఇలా మొఱపెట్టుకున్నారు తమ ఈతి బాధల్ని:

అరయబరదేశ యాత్ర సేయుట యొండు, తనకు తానే వండుకొనుట రెండు
కులపతి నెడబాసి తొలిగిపోవుట మూడు, వెలయంగ యాచక వృత్తి నాల్గు
తన సరివారి పంచను జేరుకొనుటైదు, గుఱుతెఱుగని రాజు గొల్చుటారు
చదువు నేరక యుండి సభకు బోవుట ఏడు, నెన్న దారిద్ర్యంబు నెన్మిదవది

అష్టకష్టంబులని యెడు నవ్వి యివ్వి
గానయిటువంటి వెవ్వరికైన వలదు
చారుతరమూర్తి! దేవతా చక్రవర్తి
రమ్య గుణ ధామ! కావేటి రంగధామ!

పుల్లకవి తన ప్రభువు ఎంత ఔదార్యశీలుడో వెటకారంగా ఈ చాటువును చెప్పేడు:

ఇచ్చె ఇచ్చెను దొరయేమిచ్చెనంటిరా, ఈ ఊరిలో నుండనిచ్చినాడు
పొరుగూళ్ళ వెంబడి పోయి ముష్టెత్తుక, ఇంటికి తిరిగి రానిచ్చినాడు
గ్రాసాన కోక వేళ కలిగి లేకుండిన, నిట్టింట పస్తుండ నిచ్చినాడు
చలి వేళ కప్పుకో చట్ట లేకుండినా, చేతులు ముడుచుకోనిచ్చినాడు
------
ఇట్టి యన్యాయము కేడ్వ నిచ్చినాడు
మేలు మేలెట్టి గుణము నిర్మించాడు
పుల్లకవి నేలు గోపికా వల్లభుండు

చాలామంది కవులు తమ రాజుల్ని, దాతలిని అదే పనిగా ఇంద్రుడు చంద్రుడు అని గగనానికి ఎత్తేసేవారు. ఇరవై శతాబ్దంలో పండిత ప్రకాండులు, కవి పుంగవులలో నగ్రగణ్యులు తిరుపతి వేంకట కవులు. వీరు అష్టావధానం విజయనగరంలో చేయాలన్న ఉద్దేశంతో ఆనందగజపతుల వారిని 25 చాటవుల్లో పొగిడారు మచ్చుకి:

రాజు రాజునగనే రాజాయనే చంద్రు,డల రాజశేఖరు నాశ్రయించె
రాజు రాజునగనే రాజాయనే ఇంద్రు,డర్యమాత్మజుని దానడిగి కొనియె
రాజరాజనగనే రాజరాజాకుబే,రుడు? కిం నరేశ్వత రూఢిగాంచె
రాజ రాజననే రాజ రాజా సుయోధనుడధి కర్ణత్వమునుగమించె
రాజనిన రజ రాజున్న రాజులందు
నీకు తగుగాక యన్యులౌ లోకపతుల
కొకరికైనను జెల్లునే? యుర్విలోన
విజయ నగర మహారాజ! విపుల తేజ.

## చాటువులు - దూర్వాసుల వేంకట సుబ్బారావు



(5)

విజయనగరం ప్రభువులు సంగీత పోషకులు కదా, మా కీర్తి నీవలనే కదా అని చమత్కరిస్తూ సంగీతంలో సరిగమపదనిస బీజాక్షరాలతో ఇలా చమత్కరించరు ఈ తిరుపతి వేంకట జంటకవులు.

మాపసమా నీ సాగమ
గాపసం మాపధాపగాగమనిసమా
మా పస నీపస గనిగా
దా! పరిపరి తుష్టి చెందె నా నంద నృపా!

అటు గద్యాలు నుంచి ఇటు చెన్న పట్నంవరకూ ఎన్నెన్నో శతావధానాలు చేసిన తిరుపతి వేంకట కవుల పటిమ, కవితామాధురి "నానారాజు సందర్శనము" నుంచి చదివి ఆనందించవలసినదే. తెలుగు భాష యందు భక్తి పెంచుకోమని బందరులో ఇలా ప్రార్థన చేస్తూ హెచ్చరించారు వీరు:

ఆంధ్రదేశీయులార మీరందఱొక్క
ప్రార్థనను గైకొనుడు దేవ భాషయందు
కొంచెమేని పరిశ్రమ కొనవలెజుడి
దాన సులభంబుగా మీకు దనరు దెవ్వి

ఈ తిరుపతి వేంకట కవులు తమ ప్రజ్ఞతో యావత్ ఆంధ్రుని ముగ్ధుల్ని చేసారు. వీరి శిష్య జాబితాలో ఎందరో మహాకవులున్నారు. ఉదాహరణకు వేటూరి ప్రభాకర శాస్త్రి, వేటూరి శివరామశాస్త్రి, త్రిపురనేని రామస్వామి చౌదరి, దీపాల పిచ్చయ్య శాస్త్రి తదితరులు. తమ ఊర్లో కొబ్బరి చెట్లను పృచ్ఛకులుగా భావించి కవిత్వం చెప్పేవారట వీరు. వీరికి శతఘంట కవనము, అష్టావధానాలు, ఆశుకవిత్వం సులభసాధ్యాలు. నానారాజ సందర్శనంలో "ఏనుగు నెక్కినాము, ధరణీంద్రులు చూడగ నిక్కినాము, సన్మానములందినాము, బహుమానములన్ గ్రహించినారమెవ్వానిని లెక్క సేయక" అని తమ గురించి తెలియజేసిన ధీరులు. వనపర్తి రాజుకొలువులో

రాజమిత్రుల మదికాక రాజబంధు
వులము కవిరాజులము, పలువురు గలట్టి
కులము వారము, మాకెందు గొడవలేదు
కీర్తికై రాక సుమి వనపర్తి భూప!

అని తమ గురించి ఒక చాటువులో చెప్పారు.

సాంపరాయని శ్రీనాథుడు "అక్షయంబుగ సాంపరాయని తెనుంగా ధీశ కస్తూరికా! బిక్షాదానము సేయ రా సుకవిరాట్ బృందారక శ్రేణికిన్" అన్నట్లే వీరిర్వురు కవులను సన్మానించుట రాజుల విధి మమ్ముల నిరసించుట క్షేమమ్ముకాదు అని హెచ్చరిస్తూ ఈ చాటువు రూపంలో నిలదీసి అడిగారు.

అమ్మ వంక జుట్టమా యేమి భోజ భూపాల వర్యున కల్ల కాళిదాసు
అబ్బ వంక జుట్టమా యేమి విక్రమ ప్రభువరేణ్యున కల్ల భట్టి సుకవి
అత్త వంకను జుట్టమా యేమి రాజధరాధీశ్వరునకు నన్నయ భట్టు
మామవంక జుట్టమా యేమి కృష్ణరాడ్ధరణీశ్వరునకు పెద్దన్నగారు
కవి యయిన వాని నెల్లను గారవింప
రాజయిన వానికెల్ల ధర్మమ్ముగాక

వేరొక చోట "గురుడున్ దైవము లేడు సత్కవులకుం గోపంబురానీకుమా" అని వారి ఉపాస్యదేవత కాళికాదేవితో ఘాటుగా చెప్పారు.

వీరికి దర్శనమీయక జాప్యం చేస్తున్న విశాఖపట్న నివాసి గొడే గజపతి రావు గురించి ఒక చాటువులో ఇలా ఎత్తి పొడిచారు:

సంగరశక్తిలేదు, వ్యవసాయము సేయుట సున్న, సంతలో
నంగడి వేసి యమ్ముటది యంతకు మున్నెహుళక్కి, ముష్టికిన్
బొంగు భుజాన వైచుకుని పోయెద మెక్కడికేని, ముష్టి చెం
బుంగొని పెట్టు మొక్కటి యమోఘ మిదేకద! దంతి ర్రాణుపా!

వీరి హాస్యాస్పదమైనవి, చమత్కారమైన చాటువులు చాలా ఉన్నాయి. ఒక పకోడి ప్రియునకు పకోడి ఎలా తయారు చేయాలో కూడ ఒక చాటువులో చెప్పారు:

సెనగపిండి ఉల్లిపాయ చిన్న మిరపకాయలుం
జొనిపి యందునల్లమింత చొన్పి, ముద్ద చేసియున్
అనల తప్తమైన నేతియందు వైచి వేచినన్
జను పకోడి యనెడి పేర జక్కనైన ఖాద్యమై

మీరు వైదీకులు కదా, మీసం ఎందుకు పెంచారని వీరిని ప్రశ్నిస్తే వారి జవాబే ఒక సవాల్

దోసమటం బెరింగెయ దుందుడు కొప్పగ పెంచినారము ఈ
మీసము, మేమె ఉభయ భాషా కవీంద్రుల మంచు తెల్పగా
కాదని కవి వరేణ్యులు గెల్వుడు, గెల్చిరేని ఈ
మీసము తీసి మీ పదసమీపము నుంచి తల వ్రంచి మ్రొక్కమే!!

మనకందరికీ తెల్సినవాడు తెనాలి రామకృష్ణుడు - "కుంజర యుద్ధంబు దోమ కుత్తుక జొచ్చెన్" అన్న సమస్యను

గంజాయి త్రావి తురకల
సంజాతుల గూడి కల్లు చవిగొన్నావా ఓరీ
లంజల కొడకా ఎక్కడ

కుంజర యూథంబు దోమకుత్తుక జొచ్చెన్

అని దూషిస్తూ పూర్తి చేసాడు. సభా మర్యాదక భంగం కలగకుండా, అదే సమస్యని కృష్ణదేవరాయల కోరికపై

రంజన చెడి పాండవులరి
భంజనులై వికట గొల్వ చాల్పడి రకటా
సంజయ ఏమని చెప్పుదు
కుంజర యూథంబుదోను కుత్తుక జొచ్చెన్.

అని చక్కగా పూరించాడు.

వేరొక కవి "మంగళ సూత్రము నెంత మదినమ్మినదొ" అన్న సమస్యని

మ్రింగెడివాడు విభుండని
మ్రింగెడిది గరళమని, మేలని ప్రజకుం
మ్రింగుమని సర్వమంగళ
మంగళ సూత్రము నెంతమది నమ్మినదొ.

లోక కళ్యాణార్థం గరళాన్ని శివుడే మ్రింగాలని పార్వతీ దేవి తన మాంగల్యాన్ని నమ్ముకున్నది అన్నది కవి భావన.

అష్టావధానాల్లో సమస్యా పూరణం ఉంటుంది. ఎందరెందరో ఎన్నో అష్టావధానాలు చేసి ఎన్నో చాటువులను చెప్పారు. మచ్చుకి ముచ్చటగా మూడు తెలియజేస్తాను "కప్పను జూడంగ పాము గడగడ వణికెన్" అన్న సమస్యను ఈ విధంగా పూరించారు.

కుప్పలి కావలి పనిలో
జెప్పులు కట్టియును బూని శ్రీఘ్రముతోడం
జప్పుడగుచు వచ్చెడి వెం
కప్పను జూడంగ బాము గడగడ వణికెన్

"ఎలుకలు తమ కలుగులోని కేనుగు నీడ్చెన్ " అన్న సమస్యా పూరణం ఇలా జరిగింది.

ఇలలో నిద్దరు రాజులు
మలయుచు చదరంగ మాడ మాపటి వేళన్
బలమెత్త కట్ట మరచిన
ఎల్కలు తమ కలుగులోని కేనుగు నీడ్చెన్.

పొడుపు పద్యాలు కూడా చాటువులువులుగా చెప్పారు కొందరు.

మూడు శిరములుండు, ముదమొప్ప పదికాళ్ళు
కరములుండ రెండు, కన్నులారు
కొమ్ము లెన్న నాలుగును, తోకలును రెండు
దీని భావమేమి తిరుమలేశ!

మూడు తలలు, పదికాళ్ళు, రెండు చేతులు, ఆరు కన్నులు, నాలుగు కొమ్ములు, రెండు తోకలున్నది బండి యెడ్లు, మనిషి అన్నదే చమత్కారము.

## చాటువులు - దూర్వాసుల వేంకట సుబ్బారావు



(6)

1770 - 1820 ల మధ్య తెలుగుభాషకు అపార సేవ చేసిన అగ్రగణ్యుడు సి.పి.బ్రౌన్ దొర. అనేక పండితులను ఆహ్వానించి, వారితో చర్చించి ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు వ్రాసిన మేధావి. తెనుగు భాగవతం బాగా చదివి తన స్వంతం చేసుకున్నాడు. ఒక బీద పండితుడు చాల ఇబ్బంది పడుతూ, అర్థిస్తూ పోతనగారి భాగవతం నుంచి ఒక పద్యాన్ని కొద్దిగా ఈ విధంగా మార్చి చదివితే:

*లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులా*
*ఠావులప్పెను మూర్ఛ వచ్చె దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్*
*నీవే తప్ప నితః పరంబెఱుగ మన్నింపదగున్. దీనునిన్*
*రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు బ్రౌను దొరా!*

ఈ భట్రాజు పొగడ్తలు నచ్చని బ్రౌన్ అదే భాగవతం నుంచి ఇలా జవాబు వ్రాసారు:

*ఏనుమృతుండ నౌదునని ఇంత భయంబు మనంబులోపలన్*
*మానుము సంభవంబు గల మానవ కోట్లకు జావునిక్కమౌ*
*గానహరిదలంపు మిక గల్గదు జన్మము ధాత్రిపై*
*మానవ నాథ! పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్*

ఈ చాటువుల పొగడ్తలు ఒక్క తెలుగు ప్రభువులకే కాక, సుల్తానులకు కూడ అన్వయిస్తుంది. ఇబ్రహీం అనే సుల్తాను (1550) చాలా ప్రజోపకార్యాలు చేసాడు. తెలుగు బాగా నేర్చుకుని తెలుగు ముషైరాలు జరిపిస్తూ అందరి మన్నలను పొందాడు. ఇంకేం మన కవీంద్రులందరూ ఇతన్ని ఆకాశానికి ఎత్తేశారు. ఇబ్రహీంని ఇభరామ్ అని పిలుస్తూ, మనకున్న ఆరుగురు చక్రవర్తులనగా హరిశ్చంద్రుడు, నలుడు, పురుకుత్సుడు, పురూరువుడు, సగరుడు, కార్తవీర్యార్జునుడు - ఈ ఇభరామ్‌కి సాటికాదని ఏడవ చక్రవర్తిగా, పదిహేడవ మహరాజుగా చెప్పారు. అంతటితో ఆగక మన పురాణాల్లోని ఏ రాముడు ఈ ఇభరామునికి సాటికాదని ఈ విధంగా చెప్పారు ఒక చాటువులో

*రాముడు దుక్కిముచ్చు, రఘురాముడు క్రోతుల రాజు, రేణుకా*
*రాముడు పోటు బంటు, పటురాగసమంచితుడైన గోపికా*
*రాముడు వెర్రిగొల్ల, ఒక రాష్ట్రములందు సమాను లేరయా*

*రాముల నెంచి చూడ నిభరామ మహీధవభవ్య వైభవా!*

చాటువులకు కవి చౌడప్ప పేరు చెప్పితీరాలి. ఇతడు 1600 ప్రాంతంలో తంజావూరు ధరణీ నాయకుల కొలవులో నీతి పద్యాలను చెపుతూనే, నవ్వుపుట్టించటానికి ఎన్నో చాటవులు చెప్పాడు. తెనుగు సాహిత్యంలో అసలు సిసలు బూతుకవి ఇతడే ఈ కుందవరపు చౌడప్ప కందాల గురించి ఇలా అన్నాడు.

*కందం తిక్కనగారిది*
*కుందవరపు వారి ముద్దు కుఱని దంతే*
*అందరి తరమా కందపు*
*చిందుల కిటుకుల్ గ్రహింప సిరిసిరి మువ్వా!*

తన శతకంలో చౌడప్ప అడిగిన ప్రశ్న సహజమే - అది ఏమనగా

*బూతని నగుదురు తమ తమ*
*తాతలు ముత్తాత మొదలు తరతరములవా*
*రే తీరున జనించిరొ*
*ఖ్యాతిగమరి? కుందవరపు కవి చౌడప్పా!*

అంతటితో గాక తన బూతు కవిత్వాన్ని ఇలా సమర్ధించుకున్న విధం చూడండి:

*నీతులకేమి యొకించుక*
*బూతాడక దొరకు నవ్వు పుట్టదు ధరలో*
*నీతులు బూతులు లోక*
*ఖ్యాతులురా కుంద వరపు కవి చౌడప్పా!*
*పది నీతులు పదిబూతులు*
*పది శృంగారములు గల్గు పద్యములు సభన్*
*జదివిన వాడే యధికుడు*
*గదరప్పా కుందవరపు కవి చౌడప్పా.*

శ్రీనాథుని క్రీడాభిరామంలోనూ, సెట్టి లక్ష్మీ నరసింహంగారి శృంగార పంచకము (1922) లోనూ చౌడప్పచాటువుల్లాంటివి చాలా ఉన్నాయి. చాటువులు సందర్భోచితాలు, ఆశువుగా హాస్యధోరణిలో చెప్పబడ్డవికాన వాటిని అలాగే చదవాలి. అయితే ఇన్ని పద్యాలు అవసరమా అంటే మహాయోగి, జ్ఞాని వేమనదే వేదవాక్యం, ఆఖరి మాట.

*నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు*
*తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల?*
*చాటు పద్యమొకటి చాలదాయిలలోన*
*విశ్వదాభిరామ వినురవేమ!*

(అయిపోయింది)